పుస్తక ప్రియులకు ఇదే మా ఆహ్వానం
38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం), హైదరాబాద్
డిసెంబర్ 19 నుండి 29 వరకు - మ॥ 1 నుండి రా॥ 9 వరకు
నవచేతన బుక్ హౌస్ స్టాల్ నం. 292 - 295
Shop online through our website navachethanabooks.in
నవచేతన పబ్లిషింగ్ హౌస్ స్టాల్ నం. 339 - 344

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

హిమాచల్‌లో డాక్టర్ల సమ్మె
బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌పై దిగ్విజయ్ ప్రశంసలు 05

సంపుటి 09, సంచిక: 31 | ఆదివారం | 28-12-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సిపిఐ

సిపిఐ తన ప్రారంభ సంవత్సరాల్లో, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొమింటర్న్)తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉంది. మార్క్సిజం–లెనినిజంను అవగాహన చేసుకోవటంలో, వలస, అర్ధవలస సమాజాలను విశ్లేషించటంలో, భారతదేశ పరిస్థితులకు అనువైన వ్యూహాలను అభి వృద్ధి పరుచుకోవటంలో భారతదేశ కమ్యూనిస్టు లకు సహాయకారిగా కొమింటర్న్ ముఖ్యమైన పాత్ర నిర్వర్తించింది.

– వ్యాసం 6లో

## ‘మహాత్మాగాంధీ నరేగా’ రద్దుపై కాంగ్రెస్
# దేశవ్యాప్త ఉద్యమం

**జనవరి 5 నుంచి ‘ఎంజి నరేగా బచావో అభియాన్’**

- మోదీ చర్యపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు...
- ఎన్‌డిఎ సర్కార్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జు ఖర్గే హెచ్చరిక
- రాష్ట్రాలు, పేదలపై మోదీ ఏకపక్ష దాడి : రాహుల్






**న్యూఢిల్లీ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజినరేగా) రద్దుపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశ వ్యాప్త ఉద్యమానికి సిద్ధమైంది. యుపిఎ హయాంలోని గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దును నిరసిస్తూ జనవరి 5న ప్రచారాన్ని ప్రారంభించనుంది. కేంద్ర ప్రభుత్వ చర్యపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, దీనికి నరేంద్ర మోదీ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హెచ్చరించారు. 20 ఏళ్ల నాటి ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ స్థానంలో తీసుకొచ్చిన ‘విబి– జి రామ్ జి’ బిల్లు ఇటీవల ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ కొత్త చట్టం గ్రామీణ కార్మికులకు 125 రోజుల వేతన ఉపాధికి అవకాశం కల్పిస్తుంది. కాగా, శనివారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ‘ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ బచావో అభియాన్’కు పార్టీ నాయకత్వం వహిస్తుందని చెప్పారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ కేవలం ఒక పథకం కాదని, అది రాజ్యాంగం కల్పించిన పని హక్కు అని ఆయన అన్నారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ రద్దుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, తరువాయి 2లో



## ‘సంధ్య’ ఘటనలో
# చార్జిషీట్ ఫైల్

- అల్లు అర్జున్ వల్లే తొక్కిసలాట అని తేల్చిన పోలీసులు
- వ్యక్తిగత భద్రత,యాజమాన్య సిబ్బంది మధ్య సమన్వయలోపం
- ఏ1గా సంధ్య థియేటర్ యాజమాన్యం.. ఏ11గా అల్లు అర్జున్

ప్రజాపక్షం/హైదరాబాద్

‘‘సంధ్య థియేటర్ పుష్ప 2 తొక్కిసలాట’’ ఘటనకు సినీ నటుడు అల్లు అర్జునే కారణమని పోలీసులు తమ అభియోగపత్రంలో (చార్జ్‌షీట్) స్పష్టం చేశారు. ఆయన ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ రావడమే తొక్కిసలాటకు కారణమైందన్నారు. థియేటర్ యాజమాన్యం, నిర్వాహకులు, ప్రైవేటు భద్రతా సిబ్బంది మధ్య సమన్వయ లోపం దుర్ఘటనకు కారణమైందని తమ దర్యాప్తులో తేలినట్లు చిక్కడపల్లి పోలీసులు అభియోపత్రంలో పొందుపర్చారు. ‘సంధ్య థియేటర్ తొక్కిసలాటకు సంబంధించి కేసులో వంద పేజీలతో కూడిన అభియోగపత్రాన్ని చిక్కడపల్లి పోలీసులు తరువాయి 2లో



## నిజామాబాద్‌లో
# దొంగల హల్‌చల్

- రెండు ఎటిఎంలలో రూ.30 లక్షలకు పైగా నగదు చోరీ
- కారులో వచ్చి గ్యాస్ కట్టర్‌తో చోరీ
- ఎటిఎం సంఘటన స్థలాలను పరిశీలించిన ఇన్‌చార్జి సిపి రాజేష్‌చంద్ర

ప్రజాపక్షం/నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేశారు. రెండు ఎటిఎంలలో చోరీకి పాల్పడి దాదాపు రూ.30 లక్షల వరకు నగదు అపహరించారు. శనివారం తెల్లవారు జాము 3 గంటల 10 నిమిషాల సమయంలో కారులో వచ్చిన దొంగలు ఎటిఎం మిషన్లను ధ్వంసం చేసి నగదుతో ఉడాయించారు. జిల్లా కేంద్రంలోని ఐదవ టౌన్ పరిధిలోని వర్ని రోడ్డు చౌరస్తాలోని ఎస్‌బిఐ బ్యాంకు ఎటిఎంను గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను కట్ చేసి దాదాపు మూడు నుంచి తరువాయి 12లో

## ఉపాధి హామీ రద్దును నిరసిస్తూ నేడు
# గ్రామ గ్రామాన ఆందోళనలు

టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ ఆదివారం గాంధీ చిత్ర పటాలతో గ్రామ గ్రామాన నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నో ఉద్యమాల ఫలితంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చడంతో పాటు అమలు బాధ్యతల నుంచి తప్పికునేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు, గ్రామీణ ప్రాంత కూలీలకు ఎంతో భరోసాగా ఉన్న తరువాయి 2లో

## అత్యాచార బాధితురాలితో వివాహం
# దోషికి శిక్ష రద్దు

- వారిద్దరూ మళ్లీ కలుస్తారని ‘సిక్త్స్ సెన్స్’ చెప్పిందని ‘సుప్రీం’ వ్యాఖ్య
- మధ్యప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేసిన అప్పీల్‌పై కీలక తీర్పు



**న్యూఢిల్లీ :** అత్యాచారం కేసులో ఒక వ్యక్తికి విధించిన శిక్షను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఫిర్యాదుదారు, దోషి ఒకరినొకరు వివాహం చేసుకున్నారని, పార్టీల మధ్య ఏకాభిప్రాయ సంబంధానికి అపార్థం కారణంగా నేరం అనే రంగు పులుమబడిందని అత్యున్నత న్యాయ స్థానం గమనించింది. కేసులోని వాస్తవాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, సతీష్ చంద్ర శర్మ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ముందుకు ఈ విషయం వచ్చినప్పుడు ‘అప్పీల్‌దారు, బాధితురాలు తొలుత వివాహం విషయంలో తొలుత ఏకాభిప్రాయంతోనే ఉన్నా ఆ తర్వాత వచ్చిన విభేదాల కారణంగా కారణంగా అతడిపై కేసు నమోదు చేసినట్లు గమనించామని, అపార్థాల వల్ల విడిపోయిన వారిద్దరూ మళ్లీ కలుస్తారని భావించామని, ప్రతివాది ప్రాసిక్యూటర్ ఇద్దరూ మరొకరిని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లయితే వారిని మరొకసారి ఒకచోట చేర్చవచ్చనే ‘సిక్త్ సెన్స్’ మాకు ఉంది’ అని ధర్మాసనం పేర్కొంది.దోషి బాధితురాలు ఇద్దరూ పెళ్లి చేసుకున్న తరువాయి 2లో

## విజిబుల్ పోలీసింగ్‌తో
# నేరాలు తగ్గాయ్




- హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో గత ఏడాదితో పోలిస్తే 15 శాతం తగ్గిన క్రైమ్ రేటు
- నగరంలో ఈ ఏడాది 30,690 కేసులు నమోదు
- 2024-25 వార్షిక నివేదిక విడుదల చేసిన సిపి విసి.సజ్జనార్

ప్రజాపక్షం/హైదరాబాద్

విజిబుల్ పోలీసింగ్ విధానం ద్వారా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోలిస్తే 15 శాతం క్రైమ్ రేట్ తగ్గిందని సిపి విసి.సజ్జనార్ పేర్కొన్నారు. 2024లో మొత్తం 35,944 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 30,690 కేసులు నమోదయ్యాయని తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్‌లోని ఏడు జోన్ల పరిధిలో ఈ ఏడాది నమోదైన కేసులు, క్రైమ్ రేట్ వివరాలతో కూడిన 2025 వార్షిక నివేదికను శనివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అడిషనల్ సిపి ఎం.శ్రీనివాసులు, డిసిపిలతో కలిసి నగర సిపి విసి.సజ్జనార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సహకరంతో ఈ ఏడాది నగరంలో నిర్వహించిన పండుగలు ప్రశాంతంగా జరిగాయన్నారు. సిటీలో అల్లర్లు, గొడవలు సృష్టించే నేరస్థులపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం కమిషనరేట్ పరిధిలో 5.22 లక్షల సిసి కెమెరాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో డ్రోన్‌లను ఉపయోగించి ట్రాఫిక్ నియంత్రణ, దారి దోపిడీలు, నేరతీవ్రతను తగ్గించేందుకు కృషి చేస్తామన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బాడిలీ అఫెన్సెస్ 2024లో 8,447 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 7,064 కేసులు నమోదై 16 శాతం, ప్రాపర్టీ అఫెన్సెస్ 2024లో 5,328 కేసులు నమోదు కాగా, తరువాయి 2లో

## మోదీ సర్కార్
# ఎవరి పక్షం?

- పేదల కోసమా? అదానీ, అంబానీల కోసమా తేల్చాలి
- ప్రకృతి సంపదను కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టడం దుర్మార్గం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




ప్రజాపక్షం/పాల్వంచ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకృతి సంపదను కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య అని, మోదీ సర్కార్ ప్రజల కోసమా ? లేక అదానీ, అంబానీలాంటి కుబేరుల కోసమా అన్నది తేల్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్‌ల పేరుతో కొనసాగిస్తున్న నిర్బంధాలపై ప్రజా ఉద్యమాలు, తిరుగుబాటు తప్పవన్నారు. మతాలు, కులాల పేరుతో కాషాయం పార్టీ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ ప్రజల మాన, తరువాయి 2లో

## సిరియాలో మసీదుపై
# బాంబుదాడి

**8 మంది మృతి**



**ఇడ్లిబ్:** సిరియాలోని హూమ్స్ నగరంలో ఉంటున్న ఇమామ్ అలీ ఇబ్న్ అబి తాలిబ్ మసీదులో జరిగిన బాంబు దాడిలో కనీసం 8 మంది మరణించగా, 18 మంది గాయపడ్డారు. ఈ ఘటన అలవైట్ సమాజ ఆధిపత్యం ఉన్న వాది అల్‌ధహబ్ ప్రాంతంలో జరిగింది. సిరియా అధికారిక వార్తా సంస్థ అరబ్ న్యూస్ ఏజెన్సీ విడుదల చేసిన వీడియోలో మసీదు మెట్లపై రక్తపు మరకలు కనిపిస్తున్నాయి. కిటికీలు ధ్వంసమయ్యాయి. సున్నా అన్సార్ సరాయాలు అనే అల్ప సంఖ్యాక సమూహం టెలిగ్రామ్‌లో సంఘటనకు తామే బాధ్యులమని ప్రకటించింది. ఈ సమూహం గతంలో డమాస్కస్ సమీపంలో గ్రీక్ ఆర్థడాక్స్ చర్చిపై దాడి చేసినట్టు చెప్పుకుంది. కాగా, ఈ దాడి సిరియాలో సంప్రదాయ సామ్రాదాయిక, విదేశీయ, రాజకీయ విభేదాలను ప్రతిబింబిస్తోంది. బష్షార్ అల్‌అస్సాద్ పతనం తర్వాత అలవైట్‌లపై లక్ష్యపెట్టిన హింస ఎక్కువైంది. సుప్రీమ్ అలవైట్ ఇస్లామిక్ కౌన్సిల్ దీన్ని ‘అలవైట్ సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్న క్రమబద్ధమైన తరువాయి 12లో

## శతాబ్ది ఉత్సవ సభకు
# విస్తృత ప్రచారం

**ర్యాలీలు, జాతాలు, సభలు, సమావేశాలు : కొనసాగుతున్న జనసేవాదళ్ శిక్షణ**

CENTENARY OF STRUGGLES & SACRIFICES




ప్రజాపక్షం/ ఖమ్మం

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాలు జనవరి 18న ఖమ్మంలో జరగనున్న నేపథ్యంలో 18న జరిగే బహిరంగ సభకు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో సభలు, సమావేశాలు, గోడ రాతలను పూర్తి చేయగా వినూత్న పద్ధతిలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా బహిరంగ సభ జయప్రదం కోరుతూ భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేయనున్నారు. జనవరి ఒకటి నాటికి అన్ని ప్రధాన గ్రామాలు, మండల కేంద్రాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని జిల్లా సమితి నిర్ణయించింది. జనవరి 12 నుంచి 16 వరకు అన్ని మండలాల్లో మైకుల ద్వారా ప్రచారం నిర్వహించాలని ఇందుకు సంబంధించి ప్రచార ఆడియోను కూడా విడుదల చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా తరువాయి 12లో

భావజాలాలకు వేదిక బుక్ ఫెయిర్
బుక్ ఫెయిర్‌ను సందర్శించిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, మాజీ గవర్నర్ దత్తాత్రేయ



03



# ప్రపంచం
WORLD NEWS

## 17 ఏళ్ల తర్వాత ఓటరుగా బిఎన్‌పి నేత తారిఖ్ రెహమాన్

**ఢాకా/న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) కార్యనిర్వాహక అధ్యక్షుడు తారిఖ్ రెహమాన్ (60) 17 సంవత్సరాల స్వీయ అజ్ఞాతవాసాన్ని ముగించుకొని, ఓటరుగా నమోదు అయ్యారు. లండన్‌లో 17 ఏళ్లకు పైగా ఉన్న ఆయన, ఇటీవల బంగ్లాదేశ్‌కు తిరిగివచ్చిన రెండు రోజులకే ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకుని జాతీయ గుర్తింపు కార్డు (ఎన్ఐడి) పొందేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేశారు. ఢాకాలోని ఎన్నికల సంఘం (ఇడి) కార్యాలయాన్ని కఠిన భద్రత మధ్య సందర్శించిన తారిక్ రెహమాన్ బయోమెట్రిక్ నమోదు కోసం వేలిముద్రలు, కంటి ఐరిస్ స్కానింగ్ చేశారు. ఇప్పటికే ఆయన ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించారని ఇడి అధికారులు తెలిపారు. 24 గంటల్లో ఎన్ఐడి కార్డు అందే అవకాశం ఉందని ఇడి జాతీయ గుర్తింపు నమోదు విభాగం డైరెక్టర్ జనరల్ ఎఎస్ఎం హుమాయున్ కబీర్ వెల్లడించారు. తారిక్ రెహమాన్ కుమార్తె జైమా కూడా ఎన్ఐడి నమోదు పూర్తి చేశారు.

### అంతర్జాతీయ సహాయ నిధుల కోత..
# అఫ్ఘానిస్తాన్‌లో ఆకలి కేకలు



**కాబూల్:** అంతర్జాతీయ సహాయ నిధులు గణనీయంగా తగ్గిపోవడంతో అఫ్ఘానిస్తాన్‌లో లక్షలాది మంది తీవ్రమైన ఆకలి, పేదరికంతో పోరాడుతున్నారు. దేశ జనాభాలో సగానికి దగ్గరగా ఉన్న సుమారు 2.29 కోట్ల మందికి 2025లో మానవతా సహాయం అవసరమని అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ వెల్లడించింది. అయితే అమెరికా సహా పలు దేశాలు సహాయాన్ని నిలిపివేయడంతో, ఐక్యరాజ్యసమితి వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యుఎఫ్‌పి) నిర్వహించే ఆహార పంపిణీ వంటి కీలక కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఫలితంగా ఈ శీతాకాలంలో 1.7 కోట్ల మందికి పైగా ప్రజలు తీవ్రమైన ఆకలి స్థాయిని ఎదుర్కొంటున్నారని డబ్ల్యుఎఫ్‌పి హెచ్చరించింది. ఇది ఏడాది క్రితం కంటే 30 లక్షలు ఎక్కువ. బలహీన ఆర్థిక వ్యవస్థ, పునరావృత కరువులు, ఘోర భూకంపాలు, ఇరాన్, పాకిస్థాన్ వంటి దేశాల నుంచి వెనుదిరిగిన లక్షలాది శరణార్థులు కలిసి దేశ వనరులపై తీవ్ర ఒత్తిడి తెచ్చాయి. కాగా, ఐక్యరాజ్యసమితి మానవతా విభాగాధిపతి టామ్ ఫ్లెచర్ మాట్లాడుతూ, దాదాపుగా అంతర్జాతీయ ఆహార పంపిణీ లేని శీతాకాలం ఇటీవలి సంవత్సరాల్లో ఇదే మొదటిదని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకూ, కేవలం 10 లక్షల మందికే ఆహార సహాయం అందిందని, గత ఏడాది ఇది 56 లక్షలుగా ఉందని చెప్పారు. కాబూల్‌లో రోజుకు 10 గంటలు బండిపై చిరుబండారాలు అమ్ముకుంటూ కేవలం 4.5 నుంచి 6 డాలర్లు సంపాదించే రహీముల్లా (29) వంటి వారు ఈ సంక్షోభానికి ప్రత్యక్ష ఉదాహరణ. ఐదుగురు కుటుంబ సభ్యులను పోషించడానికి అది చాలడం లేదని ఆయన వాపోయారు. శరణార్థిగా పాకిస్థాన్‌కు వెళ్లి తిరిగొచ్చిన తర్వాత మొదట్లో అందిన సహాయం ఆగిపోవడంతో జీవనం మరింత కష్టంగా మారిందన్నారు. ఇళ్ల అద్దెలు రెట్టింపు కావడంతో నివాసం కూడా కోల్పోయే పరిస్థితి ఎదురైంది. ఉత్తర అఫ్ఘానిస్తాన్‌లోని బదఖ్షాన్ ప్రావిన్స్‌లో షెరిన్ గుల్ కుటుంబం పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. 12 మంది కుటుంబానికి గతంలో అందిన ఆహార సరఫరా ఆరు నెలలకే ముగిసింది. మహిళల ఉద్యోగంపై నిషేధం ఉండటంతో ఆమె కూడా పనిలేకుండా పోయింది. కొన్నిసార్లు పిల్లలు ఆకలితోనే నిద్రపోతున్నారని, వారికి టీ తప్ప ఇంకేమీ ఇవ్వలేకపోతున్నామని ఆమె అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ కన్నీళ్లపెట్టుకున్నారు. ఇలావుంటే, వచ్చే ఏడాది మానవతా సహాయం మరింత తగ్గే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి హెచ్చరిస్తోం ది. ఈ నేపథ్యంలో, ఆహార అసురక్షితత, ఆరోగ్య అవసరాలు, ప్రాథమిక సేవలపై ఒత్తిడి పెరుగుతున్న వేళ అంతర్జాతీయ మద్దతు అత్యవసరమని మానవతా సంస్థలు కోరుతున్నాయి.

### థాయిలాండ్, కాంబోడియా మధ్య
# కాల్పుల విరమణ ఒప్పందం



**బ్యాంకాక్:** సరిహద్దు విషయంలో నెలకొన్న వివాదం కారణంగా గత కొన్ని వారాల పాటు సాగిన పరస్పర దాడులకు, సాయుధ ఘర్షణలకు ముగింపు పలుకుతూ థాయిలాండ్, కాంబోడియా దేశాలు కొత్త కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం స్థానిక కాలమానం ప్రకారం శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారరె ఇరు దేశాలు ఇకపై సైనిక చర్యలు నిలిపివేయాలి. ఎటువంటి అదనపు సైనిక కదలికలు చేపట్టకూడదు. అలాగే ఒకరి గగనతలాన్ని మరొకరు సైనిక అవసరాల కోసం ఉల్లంఘించరాదని స్పష్టంగా పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పోరాటాల్లో కాంబోడియాలోని కొన్ని ప్రాంతాలపై వైమానిక దాడులు జరిపినట్లు థాయిలాండ్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. కాగా, ఒప్పందంలోని మరో కీలక అంశం ప్రకారం, కాల్పుల విరమణ 72 గంటలు పూర్తిగా కొనసాగిన తర్వాత థాయిలాండ్ తన అదుపులో ఉన్న 18 మంది కాంబోడియా సైనికులను స్వదేశానికి పంపించాలి. ఈ సైనికులు జులైలో జరిగిన ఘర్షణల సమయంలో పట్టుబడ్డారని, వారి విడుదల కాంబోడియా ప్రధాన డిమాండ్‌గా ఉన్నట్లు సమాచారం. ఇరు దేశాలు జులైలో ఐదు రోజులపాటు జరిగిన యుద్ధాన్ని నిలిపివేసిన పూర్వపు కాల్పుల విరమణ ఒప్పందాలకు కట్టుబడి ఉన్నట్లు తాజా ఒప్పందంలో పేర్కొన్నారు. ఆ ఒప్పందానికి మలేషియా మధ్యవర్తిత్వం వహించగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సడలింపులు నిలిపివేస్తామని హెచ్చరించడం ద్వారా కీలక పాత్ర పోషించారు. అనంతరం అక్టోబర్‌లో మలేషియాలో జరిగిన ప్రాంతీయ సమావేశంలో ఆ ఒప్పందాన్ని మరింత స్పష్టంగా రూపకల్పన చేశారు. అయితే ఆ ఒప్పందాల తర్వాత కూడా ఇరు దేశాల మధ్య ప్రచార యుద్ధం, స్వల్ప సరిహద్దు ఘర్షణలు కొనసాగాయి. ఈ నెల మొదటి వారంలో తీవ్ర స్థాయికి చేరాయి. తాజా కాల్పుల విరమణ ఒప్పందంతో పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని అంతర్జాతీయ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## బంగ్లాదేశ్‌లో జేమ్స్ సంగీత కచేరీ రద్దు
### మూక దాడిలో 20 మందికి గాయాలు

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ప్రముఖ రాక్ గాయకుడు జేమ్స్ నిర్వహించాల్సిన సంగీత కచేరీపై గుంపు దాడి జరగడంతో కనీసం 20 మంది విద్యార్థులు గాయపడ్డారని అధికారులు, నిర్వాహకులు తెలిపారు. ఈ ఘటన కారణంగా కచేరీని రద్దు చేయాల్సి వచ్చింది. జేమ్స్ హిందీ సినిమాల్లోనూ పలు హిట్ పాటలు పాడారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి ఫరీద్‌పూర్‌లో జరిగింది. ఇటీవల దేశంలో సాంస్కృతిక సంస్థలపై వరుస దాడులు జరుగుతున్న క్రమంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ఇటీవలి వారాల్లో ఢాకాలోని ఛాయానాట్, ఉదీచీ శిల్పి గోష్టి వంటి సంస్థలు ధ్వంసానికి గురయ్యాయి. ఫరీద్‌పూర్ జిల్లా పాఠశాల 185వ వార్షికోత్సవ ముగింపు సందర్భంగా జేమ్స్ కచేరీ నిర్వహించాల్సి ఉంది. పాఠశాల ప్రాంగణంలో తాత్కాలిక వేదికపై రాత్రి ఆలస్యంగా ఈ కార్యక్రమం జరగాల్సి ఉందని పాఠశాల వర్గాలు తెలిపాయి. అయితే కార్యక్రమం ప్రారంభానికి కొద్దిసేపటి ముందు బయట నుంచి వచ్చిన కొందరు లోపలికి బలవంతంగా ప్రవేశించేందుకు ప్రయత్నించారు. భద్రతా సిబ్బంది నిలువరించడంతో వారు ఇటుకలు, రాళ్లు విసిరి వేదికను ఆక్రమించేందుకు యత్నించారు. పాఠశాల విద్యార్థులు దాడి చేసిన వారిని అడ్డుకోగా, ఎగిరివచ్చిన రాళ్ల వల్ల కనీసం 20 మంది గాయపడ్డారని నిర్వాహకులు తెలిపారు. అయితే గాయపడిన వారి ఖచ్చిత సంఖ్య ఇంకా నిర్ధారణ కాలేదని దనపు పోలీసు సూపరింటెండెంట్ (సదర్ సర్కిల్) అజ్మీర్ హొస్సైన్ అన్నారు. 'దాడిలో గాయపడిన వారి సంఖ్య ఇంకా తెలియలేదు. వివరాలు సేకరిస్తున్నాం' అని ఆయన అన్నారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు నిర్వాహక కమిటీ కన్వీనర్ ముస్తాఫిజుర్ రహ్మాన్ షమీమ్ తెలిపారు అని 'ది డైలీ స్టార్' పత్రిక పేర్కొంది. నగర్ బౌల్ అనే బంగ్లాదేశీ రాక్ బ్యాండ్‌కు ప్రధాన గాయకుడు, గీత రచయిత, గిటారిస్ట్ అయిన జేమ్స్, 'గ్యాంగ్‌స్టర్', 'వో లమ్హే' వంటి పలు బాలీవుడ్ హిట్ చిత్రాల్లో పాటలు పాడారు. కాగా, కార్యక్రమ ప్రచార, మీడియా ఉపసమితి కన్వీనర్ రాజీబుల్ హసన్ ఖాన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దాడి వెనుక కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదన్నారు. జేమ్స్ కచేరీపై ఎవరు, ఎందుకు దాడి చేశారో అర్థం కావడం లేదన్నారు. మొత్తం పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని జిల్లా పరిపాలన ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని రద్దు చేయాల్సి వచ్చింది అని ఆయన చెప్పారు.

## సోమాలీలాండ్ గుర్తింపునకు ఆఫ్రికన్ యూనియన్ తిరస్కరణ






**నైరోబీ (కెన్యా):** సోమాలియా నుంచి విడిపోయిన ప్రాంతమైన సోమాలీలాండ్‌ను స్వతంత్ర దేశంగా ఇజ్రాయెల్ గుర్తించిన చర్యను తప్పుపడుతూ, ఆఫ్రికా ప్రాంతీయ పాలనా సంస్థలతో కూడిన ఆఫ్రికన్ యూనియన్ (ఎయు) శనివారం ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. గత 30 ఏళ్లకు పైగా ఏ దేశం కూడా సోమాలీలాండ్‌ను గుర్తించని పరిస్థితిలో, ఇజ్రాయెల్ తొలి దేశంగా ముందుకు రావడం వివాదాస్పదమైంది. 1991లో సోమాలియా అంతర్యుద్ధం నేపథ్యంలో సోమాలీలాండ్ స్వతంత్రత ప్రకటించింది. స్వంత ప్రభుత్వం, కరెన్సీ ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా గుర్తింపు పొందలేదు. ఈ నేపథ్యంలో ఎయు చైర్‌పర్సన్ మహ్మూద్ అలీ యూసుఫ్ స్పందిస్తూ, సోమాలియా సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే ఏ ప్రయత్నమైనా ఆఫ్రికా ఖండంలోని శాంతి, స్థిరత్వానికి ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. సోమాలీలాండ్ అనేది సోమాలియా ఫెడరల్ రిపబ్లిక్‌లో అవిభాజ్య భాగమేనని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఇజ్రాయెల్ చర్యను సోమాలియా కేంద్ర ప్రభుత్వం కూడా శుక్రవారం తీవ్రంగా ఖండించింది. దీనిని చట్టవిరుద్ధ చర్య అని పేర్కొంటూ, ఉత్తర ప్రాంతమైన సోమాలీలాండ్ తమ దేశ సార్వభౌమ భూభాగంలో భాగమేనని పునరుద్ఘాటించింది. ఇలావుంటే, ఇజ్రాయెల్ అకస్మాత్తుగా సోమాలీలాండ్‌ను గుర్తిస్తున్నట్టు ఎందుకు ప్రకటన చేసిందన్న దానిపై స్పష్టత లేదని అంతర్జాతీయ వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో, అబ్రహామ్ ఒప్పందాల స్ఫూర్తితో సోమాలీలాండ్ అధ్యక్షుడు అబ్దిరహ్మాన్ మహ్మద్ అబ్దుల్లాహితో కలిసి సంయుక్త ప్రకటనపై సంతకాలు చేసినట్లు వెల్లడించింది. ఈ ఒప్పందాలకు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో మధ్యవర్తిగా ఉన్న ఈజిప్ట్ కూడా ఇజ్రాయెల్ నిర్ణయాన్ని తిరస్కరిస్తూ, సోమాలియా ఏకత్వం, భౌగోళిక సమగ్రతకు పూర్తి మద్దతు ప్రకటించింది. తూర్పు ఆఫ్రికా ప్రాంతీయ సంస్థ ఐజిఎడి కూడా సోమాలియా సార్వభౌమత్వం అంతర్జాతీయ చట్టాల ద్వారా గుర్తించబడిందని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి, ఆఫ్రికన్ యూనియన్ చార్టర్లకు విరుద్ధంగా ఏకపక్ష గుర్తింపులు చెల్లవని స్పష్టం చేసింది.

## ఆందోళనలు
**(మొదటి పేజీ తరువాయి)**

ఈ పథకాన్ని రద్దుకు నిరసనగా జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవమైన నేడు రాష్ట్ర వ్యాప్తంగా గాంధీ విగ్రహాల వద్ద, గాంధీ చిత్రపటాలతో నిరసన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండ ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి, పనికి ఇచ్చే గౌరవాన్ని ప్రజలకు వివరించనున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

## చార్జిషీట్ ఫైల్
**(మొదటి పేజీ తరువాయి)**

హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో సమర్పించారు. ఈ కేసులో మొత్తం 23 మందిపైన అభియోగాలు మోపారు. ఇందులో ఏ1గా సంధ్య థియేటర్ యాజమాన్యం, ఏ11గా అల్లు అర్జున్ ఉన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై సమగ్రమైన, వివరణాత్మక దర్యాప్తు నిర్వహించామని, మూడు రోజుల క్రితం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసినట్టు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం శనివారం వెల్లడించింది. కాగా ఈ కేసులో థియేటర్ భద్రతా లోపాలను కూడా గుర్తించారు.

**అల్లు అర్జున్ రాకతోనే తొక్కిసలాట..**

గత డిసెంబర్ 4న పుష్ప2 సినిమా బెనిఫిట్ షో కోసం హైదరాబాద్ ఆర్టిసి క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌కు అల్లు అర్జున్ రావడమే తొక్కిసలాటకు కారణమని పోలీసులు తేల్చారు. ఆయన థియేటర్ వద్దకు రాగానే కారు రూఫ్ ఎక్కి చేయి ఊపుతూ అభివాదం చేయడం వల్ల ఆయనను చూసేందుకు అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట జరిగిందని, ఈ ఘటనలో రేవతి(35) అనే మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డారని, అలాగే మరికొందరు స్వల్పంగా గాయపడ్డారని అభియోగపత్రంలో పొందుపర్చారు.

ఈ ఘటనలో 2024, డిసెంబర్ 13న అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత ఆయనకు నాంపల్లి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించగా అల్లు అర్జున్‌ను చంచల్‌గూడ్ జైలుకు తరలించారు. అయితే అదే రోజు హైకోర్టు అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఆయనను మరుసటి రోజు ఉదయం విడుదలైన విషయం తెలిసిందే.

**సంధ్య థియేటర్ కేసులో నిందితులు వీరే....:**

ఏ1: ఆగమతి రామ్ రెడ్డి (పెద్ద రామ్ రెడ్డి) భాగస్వామి (సంధ్య థియేటర్ యజమాని)
ఏ2: ఆగమతి రామ్ రెడ్డి (చిన్న రామ్ రెడ్డి) సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ3: ఎం.సందీప్ సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ4: ఎం. సుమిత్ (మిట్టు) సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ5: ఆగమతి వినయ్ కుమార్ సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ6: ఆగమతి అశుతోష్ రెడ్డి సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ7: ఎం.రేణుకా దేవి సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ8: ఆగమతి అరుణ రెడ్డి సంధ్య థియేటర్ భాగస్వామి
ఏ9: ఎం. నాగరాజు మేనేజర్, సంధ్య థియేటర్
ఏ10: గంధకం విజయ్ చందర్ లోయర్ బాల్కనీ ఇన్‌చార్జ్ ,గేట్ కీపర్
ఏ11: అల్లు అర్జున్ (బన్నీ) సినీ నటుడు
ఏ12: జోస్య భట్ల సంతోష్ కుమార్ అల్లు అర్జున్ మేనేజర్
ఏ13: శరత్ బన్నీ (శరత్ చంద్ర నాయుడు) అల్లు అర్జున్ మేనేజర్
ఏ14: తాటిపాముల వినయ్ కుమార్ (అర్జున్ కుమార్) ఫ్యాన్స్ అసోసియేషన్ ఇన్‌చార్జ్
ఏ15: ఎండి. పర్వేజ్
ఏ16: తాళ్ల కిరణ్ కుమార్ గౌడ్ (రాజు) ఈవెంట్ ఆర్గనైజర్/ఎలక్ట్రీషియన్
ఏ17: చెరుకు రమేష్ అల్లు అర్జున్ పర్సనల్ సెక్యూరిటీ గార్డ్
ఏ18: శ్రీరాముల రాజు అల్లు అర్జున్ పర్సనల్ సెక్యూరిటీ గార్డ్
ఏ19: ఇబ్రహీం మొహమ్మద్ ఫిర్దోష్ బౌన్సర్
ఏ20: ఆజం పాషా (బాబీ) బౌన్సర్
ఏ21: డి. మహేష్ బౌన్సర్
ఏ22: రాజ్ ఆంటోనీ డిమెల్లో (ఆంటోనీ) బౌన్సర్
ఏ23: పెగ్గాపురం సత్యమూర్తి బౌన్సర్

## దేశవ్యాప్త ఉద్యమం (మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. 'సిడబ్ల్యుసి సమావేశంలో, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎను కేంద్ర బిందువుగా చేసుకుని ఒక ప్రచారాన్ని ప్రారంభిస్తామని మేము ప్రతిజ్ఞ చేశాము. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహించి జనవరి 5 నుండి 'ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ బచావో అభియాన్'ను ప్రారంభిస్తుంది' అని ఖర్గే అన్నారు. 'విబి– జి రామ్ జి' చట్టం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వ్యయ పంపిణీ నిబంధనను ప్రస్తావిస్తూ, ఈ నిర్ణయం వల్ల రాష్ట్రాలపై అదనపు వ్యయ భారం పడుతుందని కాంగ్రెస్ అధినేత అన్నారు. ఇది సంప్రదింపులు లేకుండా తీసుకున్న ఏకపక్ష నిర్ణయమని అభివర్ణించారు. 'ఈ చట్టం పేదలను అణచివేయడానికి తీసుకురాబడింది; మేము దీనిపై వీధుల్లో పార్లమెంట్‌లో పోరాడతాము' అని ఆయన అన్నారు.

**రాష్ట్రాలు, పేదలపై మోదీ ఒంటరిగా దాడి : రాహుల్**

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'విబి– జి రామ్ జి' చట్టం చట్టంపై కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పెద్దనోట్ల రద్దు మాదిరిగానే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక్కరే రాష్ట్రాలపై, పేదలపై వినాశకరమైన దాడి చేశారని ఆరోపించారు.



మొత్తం ప్రతిపక్షం తమతో కలిసి ఉంటుందని విశ్వసిస్తున్నానన్నారు. యుపిఎ హయాంలోని ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ కేవలం ఒక పని కార్యక్రమం మాత్రమేకాదని, ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన ఒక అభివృద్ధి నమూనా అని రాహుల్ పేర్కొన్నారు. దాని రద్దు హక్కుల ఆధారిత విధానంపై, దేశ సమాఖ్య స్ఫూర్తిపై దాడి అని ఆరోపించారు. 'ఇది పెద్ద నోట్ల రద్దు మాదిరిగానే, ప్రధాన మంత్రి ఒక్కరే రాష్ట్రాలపై, పేదలపై చేసిన వినాశకరమైన దాడి. ప్రధానమంత్రి తన క్యాబినెట్‌ను అడగకుండా, ఈ విషయాన్ని అధ్యయనం చేయకుండా ఒక్కరే ఎంజినరేగాను నాశనం చేశారు' అని ఆయన అన్నారు.

ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని, మొత్తం ప్రతిపక్షం తమతో కలిసి వస్తుందనే నమ్మకం ఉందని వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి తన క్యాబినెట్‌ను అడగకుండా, ఈ విషయాన్ని అధ్యయనం చేయకుండా ఒక్కరే ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎను నాశనం చేశారని విమర్శించారు. జనవరి 5న దేశవ్యాప్తంగా ప్రారంభించనున్న కాంగ్రెస్ 'ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ బచావో అభియాన్'ను ప్రస్తావిస్తూ, తాము దీనిని ప్రతిఘటించబోతున్నామన్నారు.

## ఎవరి పక్షం? (మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. కమ్యూనిస్టులను లేకుండా చేయాలనే కుట్రతో కేంద్రంలోని పాలకులు యోచిస్తున్నారని, అందుకే మావోయిస్టులను డెడ్‌లైన్ పెట్టి మరీ చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అడవుల్లో నిక్షిప్తమైన అపార సహజ సంపదను కాజేసేందుకు, కొల్లగొట్టేందుకు అధికారాన్ని అడ్డం పెట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ మావోయిస్టు నేతలను చంపటం సరైనది కాదని హితవు పలికారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ముందుకు వచ్చినప్పటికి పట్టించుకోకుండా ఏకపక్షంగా మారణ హోమానికి తెగబడటం పైశాచికమన్నారు.

మావోయిస్టుల హత్యలపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఖమ్మం కేంద్రంగా జనవరి 18న, ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఐదు లక్షల మందితో జరుగనుందన్నారు. దీనికి 45 దేశాల నుండి ప్రతినిధులు రానున్నారని పేర్కొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే బారీ జన సభకు గడప, గడపకూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల పనైపోయిందని అవాకులు, చెవాకులు పేలుతున్న వారికి ఈ వేడుక కనువిప్పు కావాలన్నారు. ఈ సభ దేశ చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోనున్నదని అన్నారు.

**హామీలను అమలు చేయాలి :** పాలక ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను నిలుపుకొంటూ అమలు చేయాలని లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు.

గడిచిన స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ ఒంటరి పోరు చేసి విజయ తీరాలకు చేరిందని, సిపిఐని నిలువరించాలనే కుట్రలు చసిన వారికి తీవ్ర నిరాశే మిగిందన్నారు. ఎర్రజెండా పనైపోయిందని కారుకూతలు కూసే వారికి గ్రామ పంచాయితీ ఎన్నికలు చెంపపెట్టని, సిపిఐని లేకుండా చేద్దామని చూసిన అనేక పార్టీలు కాలగర్భంలో కలిశాయని గుర్తు చేశారు. అధికారం, పదవులు లేకున్నా ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని, ప్రజలను నమ్మించి మోసం చేసే పాలకులను నిలదీస్తామన్నారు. చంద్ర నరేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మిరియాల రంగయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, వై. ఉదయ్ భాస్కర్, మున్నా లక్ష్మికుమారి, కే. సారయ్య, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళి, రేసు ఎల్లయ్య, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, జి. వీరస్వామి, భూక్యా దస్రు, బంధం నాగయ్య, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే. ఫహీం. మండల, పట్టణ కార్యదర్శులు, ప్రజా సంఘాల జిల్లా బాద్యులు తదితరులు పాల్గొన్నారు.

## దోషికి శిక్ష రద్దు
**(మొదటి పేజీ తరువాయి)**

కారణంగా అతడిపై ఉన్న ఫిర్యాదును, శిక్షను రద్దు చేస్తున్నామని ధర్మాసనం వివరించింది.ఈ ఏడాది జులైలో పార్టీలు ఒకరినొకరు పెళ్లి చేసుకున్నారని, అప్పటి నుండి కలిసి నివసిస్తున్నారని ధర్మాసనం తెలిపింది.'ఈ కోర్టు జోక్యంతో తన శిక్షను నిలిపివేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్న అప్పీల్‌దారుడు, చివరికి తన నేరారోపణను, శిక్షను రద్దు చేయడం ద్వారా ప్రయోజనం పొందిన అరుదైన కేసులలో ఇది ఒకటి' అని డిసెంబరు 5న ఇచ్చిన తీర్పులో ధర్మాసనం పేర్కొంది. శిక్షను నిలిపివేయాలని కోరుతూ ఏప్రిల్ 2024న మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆ వ్యక్తి చేసిన అప్పీల్‌పై సుప్రీం కోర్టు ఈ తీర్పు వెలువరించింది. ఈ కేసులో ట్రయల్ కోర్టు ఆ వ్యక్తిని దోషిగా నిర్ధారించి రూ.55,000 జరిమానా విధించడంతోపాటు 10ఏళ్ల కఠినకారాగార శిక్ష విధించింది. అత్యున్నత న్యాయస్థానం ధర్మాసనం ప్రకారం...'అప్పీల్‌దారు మహిళతో వారి తల్లిదండ్రుల సమక్షంలోనే మాట్లాడారు. వారు ఒకరినొకరు వివాహం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కాగా,అప్పీల్‌దారుకు వారిమధ్య వివాహానికి బెంచ్ మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జులైలో ఇరు పార్టీల మధ్య వివాహం జరిగింది. దీంతో వారి తల్లిదండ్రులు కూడా ఈ పరిణామాలతో సంతోషపడ్డారు' అని వివరించింది. 'తత్ఫలితంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద మా అధికారాలను ఉపయోగించి ఈ విషయంలో పూర్తి న్యాయం చేయడానికి ఫిర్యాదును, అప్పీల్‌దారుపై విధించిన శిక్షను రద్దు చేశాం' అని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం వెల్లడించింది. ఒక అపార్థం కారణంగా పార్టీల మధ్య ఏకాభిప్రాయ సంబంధానికి క్రిమినల్ రంగు పులుమబడిందని వివాహం యొక్క తప్పుడు వాగ్దానం యొక్క నేరంగా మార్చబడిందని తాము భావిస్తున్నామని, అయితే పార్టీలు ఒకరినొకరు వివాహం చేసుకోవాలని అనుకున్నాయని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. అప్పీల్‌దారుడు 2015లో సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌లో ఆ మహిళను కలిశాడని, ఇద్దరూ ఒకరిపై మరొకరు ఇష్టాన్ని పెంచుకున్నారని సుప్రీంకోర్టు తెలియజేసింది. ఆ తర్వాత వారిరువురూ పరస్పర అంగీకారంతో శారీరక సంబంధం పెట్టుకున్నారని, అప్పీల్‌దారు ఇచ్చిన పెళ్లి హామీ మేరకు తాను అలా ప్రవర్తించినట్లు ఆ మహిళ పేర్కొంది. ధర్మాసనం ప్రకారం...వివాహం తేదీని వాయిదా వేయాలని అప్పీలెంట్ కోరడంతో ఆమెను అభద్రతా భావంలోకి నెట్టివేసి ఉండబడవచ్చు అని, ఈ నేపథ్యంలో ఆమె ఆయనపై క్రిమినల్ కంప్లైంట్ దాఖలు చేసి ఉండవచ్చని తెలియజేసింది. 2021 నవంబరులో ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. ఆ తర్వాత ట్రయల్ కోర్టు గత ఏడాది ఏప్రిల్‌లో ఆ వ్యక్తిని దోషిగా నిర్ధారించింది.

## నేరాలు తగ్గాయ్ (మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది 3,817 కేసులు నమోదై 28 శాతం, గ్రేవ్ ప్రాపర్టీ అఫెన్సెస్ 2024లో 315 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 217 కేసులు నమోదై 31 శాతం, అట్రాసిటీ కేసులు 2024లో 175 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 128 కేసులు నమోదై 27 శాతం తగ్గాయని, మహిళలపై దాడులు 2024లో 2,482 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 2,625 కేసులు నమోదై 6 శాతం, చిన్నారులపై దౌర్జన్యాలు 2024లో 449 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 568 కేసులు నమోదై 27 శాతం పెరిగాయని తెలిపారు.

సైబర్ క్రైమ్‌లో గతేడాది 4,042 కేసులు నమోదు కాగా, ఈ సారి 3,735 కేసులు నమోదై 8 శాతం తగ్గాయన్నారు.

**ట్రాఫిక్ నియంత్రణ, ర్యాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి..**

నగరంలో ప్రతి యేటా వాహనాల సంఖ్య పెరుగుతుందని సిపి తెలిపారు. పెరుగుతున్న కాలుష్యం, ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రజలు ప్రభుత్వ ట్రాన్స్‌పోర్టు సదుపాయాన్ని వినియోగించుకోవాలని, ఒకే కంపెనీ, ఒకే ప్రాంతానికి వెళ్లే వారు కారు పుల్లింగ్ విధానం ఉపయోగించాలని సిపి కోరారు. ముఖ్యంగా మైనర్ పిల్లలకు తమ తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని హెచ్చరించారు. ఈ ఏడాది ర్యాష్ డ్రైవింగ్‌పై కొరఢా ఝుళిపించామని, హెల్మెట్ ధరించని వారిపై 41,28,590 కేసులు, రాంగ్ సైడ్ డ్రైవింగ్ 6,07,297 కేసులు, డేంజరస్ డ్రైవింగ్ 2,34,929 కేసులు, సెల్ ఫోన్ డ్రైవింగ్ 1,26,140 కేసులు, డ్రంకన్ డ్రైవ్ 49,732 కేసులు, మైనర్ డ్రైవింగ్ 7,808 కేసులు నమోదు చేశామన్నారు.

**అవగాహన పెరిగింది..సైబర్ క్రైమ్ తగ్గింది..**

సైబర్ క్రైమ్ కేసులు గతేడాది 4,042 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 3,735 కేసులు నమోదయ్యాయని సిపి వెల్లడించారు. ముఖ్యంగా ప్రజల్లో సైబర్ నేరాల పట్ల పెరుగుతున్న అవగాహన కేసుల తగ్గుదలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు.

ఈ మధ్య కాలంలో ఆన్‌లైన్ బెట్టింగ్ అధికమై చాలా మంది అర్ధాంతరంగా ప్రాణాలు విడిచిపెతున్నారని, అత్యాశకు మనిషి దూరం గా ఉండాలని సూచించారు. డబ్బులు ఉరికే రావని నొక్కిచెప్పారు.

**మాయమైపోతున్న మానవ సంబంధాలు..**

ప్రస్తుత కాలంలో మానవ సంబంధాల కంటే డబ్బుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని సిపి సజ్జనార్ ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనరేట్ పరిధిలో నమోదవుతున్న కేసుల్లో ఎక్కువశాతం ఆర్థిక కారణాల వలనే కావడం శోచనీయమన్నారు. డబ్బు వ్యామోహంలో ఒకరినొకరు చంపుకుంటున్నారని తెలిపారు. అలాగే ఈ మధ్యన వివాహేతర సంబంధాల కారణంగా భార్య, భర్తల హత్యలు క్రమంగా పెరుగుతున్నాయని, క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు తమ కుటుంబాలను రోడ్డున పడేలా చేస్తాయని సజ్జనార్ హెచ్చరించారు.

**హైదరాబాద్ పోలీస్ 'విజన్ 2026'**

* చిన్నారులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ఉమెన్ 2.0 ద్వారా షీ టీమ్స్‌ను టెక్నాలజీ పరంగా మరింత బలోపేతం చేసి, బాధితులకు తక్షణ సహాయం అందించే విధంగా వ్యవస్థను పటిష్టం చేస్తామన్నారు.
* ప్రజల్లో అవగాహన మరింత పెంపొందించి సైబర్ క్రైమ్‌ను పూర్తిగా రూపుమాపడానికి ప్రయత్నిస్తామని వెల్లడించారు. అలాగే డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపి డ్రగ్ ఫ్రీ నగరంగా హైదరాబాద్‌ను మార్చుతామని తెలిపారు.
* ప్రజలు పోలీసుల పరస్పర సహకరంతో హైదరాబాద్ నగరాన్ని 'సేఫ్ లివింగ్ సిటీ'గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## తప్పుడు ప్రచారం చేస్తే సహించం : హనుమంత రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారాక రామారావు సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తే సహించబోమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హెచ్చరించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇష్టారీతిన తెలంగాణను దోచుకోవడమే కాకుండా నాయకులను డబ్బులిచ్చి కొనుగోలు చేయడమే కాకుండా పోలీసులతో కొట్టించి మరి బిఆర్ఎస్‌లో చేర్చుకున్నది మీరు కాదా అని ప్రశ్నించారు. అక్రమంగా హాజీజ్‌నగర్ చెరువులో మాజీమంత్రి హరీష్‌రావు కట్టుకున్న ఫామ్‌హౌస్ హైడ్రాతో కూల్చివేయించి ఆయనపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. కెసిఆర్, కెటిఆర్‌లు వాడే భాషను తాము వాడితే తట్టుకోలేరని హనుమంత రావు హెచ్చరించారు.

## నిత్యం ప్రజల్లో ఉండాలి

- సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తే మంచి ఫలితాలు
- సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ:** నూతనంగా గెలుపొందిన ప్రజాప్రతిధులు నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుంటే ఫలితం తప్పకుండా వస్తుందని, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సిపిఐ సర్పంచ్, ఉపసర్పంచ్‌లను సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి శనివారం జిల్లా కార్యాలయంలో శాలువాలతో ఘనంగా ఆత్మీయ సన్మానం చేశారు. అంతకుముందు సిపిఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగింది. సమావేశానికి జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపు బహిరంగ సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని అని వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిందని, దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని, దోపిడీవర్గాల నుంచి మానవ జాతి విముక్తి కోసం అనేక త్యాగాలు, వీరోచిత పోరాటాలు చేసిన ఘనమైన చరిత్ర సిపిఐకే ఉందన్నారు. కమ్యూనిజం, ఎర్రజెండా లేకపోతే ప్రజలకు రక్షణ కవచం లేదని, ఎప్పుడు ఏమైతుందోననే భయానక పరిస్థితులు ఉంటాయని తెలిపారు. ప్రధాని మోదీ, బిజెపి లాంటి తిరోగమనం, కార్పొరేట్లకు ఊడిగం చేసే సిద్ధాంతం కలిగిన వాళ్లు కమ్యూనిజం అంటేనే ఒక భూతంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని, కమ్యూనిస్టులు ఉండకూడదని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఒక లక్ష్యాన్ని పెట్టుకున్నదన్నారు. పేదరికం లేకుండా చేస్తామని చెప్పాల్సిన ప్రభుత్వం, 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని చెప్పడం సిగ్గు చేటన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో అధికార పార్టీ విచ్చలవిడిగా డబ్బులు మద్యం, డబ్బులతో ఓటర్లను మభ్యపెట్టి ఓట్లు కొనుగోలు చేసిన ప్రజలు మాత్రం ఆయా గ్రామాలలో సిపిఐకి సంబంధించి 9 మంది సర్పంచ్‌లను, 14 ఉప సర్పంచ్‌లతో పాటు వార్డు సభ్యులను గెలిపించుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గెలుపొందిన వారు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అవినీతి, అక్రమాలు జరగకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ సాగు కోసం రైతంగానికి ఇచ్చే యూరియా విషయంలో కొత్తగా తీసుకొచ్చిన యూరియా యాప్‌పై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో యూరియా పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిరక్ష్యరాసులైన రైతులకు స్మార్ట్‌ఫోన్ ఎక్కడివి అని ప్రశ్నించారు. ఫోన్ ఉన్న రైతులకు సాంకేతిక సమస్యతో ఆన్‌లైన్‌లో యూరియా బుక్ కావడం లేదని ప్రభుత్వం పాత పద్దతిలో అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి తుమ్మ బుచ్చిరెడ్డి అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రావణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు ఉజ్జని యాదగిరి రావు, పబ్బు వీరస్వామి, బొల్గురి నర్సింహా, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, నల్ప రాజు రామలింగయ్య, తీర్పారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## భావజాలాలకు వేదికగా బుక్ ఫెయిర్






బుక్ ఫెయిర్‌ను సందర్శించిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, దత్తాత్రేయ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి శనివారం సందర్శించారు. హైదరాబాద్ పుస్తక ప్రదర్శన విభిన్న అభిప్రాయాలు, భావజాలాలకు వేదికగా నిలిచిందని ప్రశంసించారు. అందె శ్రీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదర్శనశాల వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా, ఆరోగ్యకరంగా ఉందని పేర్కొన్నారు. ఒకే ప్రాంగణంలో సావర్కర్, గాంధీ, మార్క్స్ వంటి భిన్న ధృవాలైన ప్రముఖుల రచనలు అందుబాటులో ఉండటం అభినందనీయమని, వివిధ రకాలైన విరుద్ధ భావజాలాలను ప్రజలకు చేరువ చేయడమే పుస్తక ప్రదర్శనల ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. గద్దర్ ఫౌండేషన్, వీక్షణం, నవోదయ బుక్ హౌస్, లిఖిత ప్రెస్ బుక్‌హౌస్, పెంగ్విన్, ఓరియంట్ బ్లాక్ స్వాన్, క్యాస్ట్ ఇన్ మోడెర్న్ ఇండియా, ఫైజ్ అహ్మద్ ఫైజ్ మొదలగు పుస్తకాలను కొనుగోలు చేశారు.

హైదరాబాద్ ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను శనివారం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సందర్శించారు. ఈ సందర్భంగా బుక్ ఫెయిర్ ప్రతినిధులు దత్తాత్రేయకు భారత రాజ్యాంగం పుస్తకం బహుకరించారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ.. పుస్తక పఠనం అభ్యాసమైతే అది మనిషికి మానసిక ప్రశాంతతను ఇవ్వడమే కాకుండా, గొప్ప మేధావిగా తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. తన జీవితంలో 'నెపోలియన్ ది గ్రేట్' పుస్తకం తనను ఎంతగానో ప్రభావితం చేసిందని, ఆయన నిఘంటువులో 'అసాధ్యం' అనే పదమే లేదన్న స్ఫూర్తితోనే తాను సమాజ సేవలో నిమగ్నమయ్యానని తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో జైలులో ఉన్నప్పుడు భగవద్గీత తనకు జీవిత పరమార్థాన్ని బోధించిందని, కోవిడ్ వంటి విపత్కర కాలంలో మహాభాగవతం చదవడం వల్ల ధైర్యం, శక్తి లభించాయని గుర్తుచేసుకున్నారు.

## బిఆర్ఎస్ హయాంలో రైతులకు అన్యాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతుల, ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవాలనే ఆలోచన ప్రతిపక్ష బిఆర్ఎస్‌కు లేదని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఎం.కోదండరెడ్డి ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అన్యాయం జరిగిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుంటే, మరోసారి ఫార్మాసిటీ ప్రాజెక్ట్‌ను తెరమీదకు తీసుకొస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారని, ప్రతిపక్షంగా ప్రజల పక్షంగా నిలబడాల్సిన బిఆర్ఎస్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని అన్నారు. రైతుల విషయంలో రాజకీయం చేయొద్దని, వారి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని సూచించారు. ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదని ఇంతకు బిఆర్ఎస్ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నాదా? లేదా వారి సొంత రాజ్యంలో ఉన్నాదా అని దుయ్యబట్టారు. సమస్యలను ముఖ్యమంత్రిని, లేదా సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉన్నదని, కానీ బిఆర్ఎస్ నాయకులు ఎవరినీ లెక్క చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఈ ఫార్మా సిటీని ఎత్తివేస్తామని చెప్పామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అనుకూలంగా ఉన్నదని, నష్టపరిహారం, ఉద్యోగం, ఇంటి స్థలాన్ని కేటాయిస్తుందని వివరించారు. కొడంగల్ విషయంలో కూడా సిఎం రేవంత్ రెడ్డి రైతులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు.

## వెనకడుగు వేయని ధీరుడు బద్దం



సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** భారత దేశానికి స్వాతంత్ర్యం కావాలని స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా హైదరాబాద్ సంస్థానంలో నిజాం నవాబుల పరిపాలనను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు నిర్వహిస్తున్న బద్దం ఎల్లారెడ్డిని సంకెళ్లతో ఊరేగించినా, జైల్లో నిర్బంధించిన మొక్కవోని ధైర్యంతో అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సేనాని, కరీంనగర్ మొట్టమొదటి పార్లమెంటు సభ్యుడుగా, బుగ్గారం, ఇందుర్తి శాసనసభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా పేద, బడుగు బలహీన వర్గాలకు విశిష్ట సేవలు అందించిన గొప్ప నాయకుడు బద్దం ఎల్లారెడ్డి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కొనియాడారు. బద్దం ఎల్లారెడ్డి 46వ వర్ధంతిని పురస్కరించుకొని సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని కోతి రాంపూర్ బైపాస్ రోడ్డులోని బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌లతో కలిసి చాడ వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలిస్తున్న నిజాం నవాబును, రజాకార్లను, దేశ్‌ముఖ్‌లను ఎదిరించడానికి, వెట్టిచాకిరి, బానిసత్వం, దోపిడీకి వ్యతిరేకంగా దున్నే వానికి భూమి కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన గొప్ప యోధుడు పోరాట సేనాని బద్దం ఎల్లారెడ్డి అన్నారు. భారతదేశంలో జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో కరీంనగర్ మొట్టమొదటి పార్లమెంట్ సభ్యునిగా బద్దం ఎల్లారెడ్డి ఎన్నికయ్యారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇందుర్తి, బుగ్గారం శాసనసభ్యుడిగా పని చేశారని, రాజ్యసభ సభ్యులుగా కూడా పనిచేసి ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన గొప్ప నాయకుడని అన్నారు. అలాంటి నాయకుడి ఆశయాలను, లక్ష్యాలను నేటి తరం పునికి పుచ్చుకొని ముందుకు తీసుకెళ్లేందుకు సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలని వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. నివాళులర్పించిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు న్యాలపట్ల రాజు పైడిపల్లి రాజు, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, మచ్చ రమేష్, కొట్టే అంజలి, బోనగిరి మహేందర్, నగర నాయకులు గామినేని సత్యం, కసిబోజుల సంతోష్ చారి, మాడిశెట్టి అరవింద్, బాకం ఆంజనేయులు, నగునూరి రమేష్, బెక్కంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ అగ్రనేత బద్దం ఎల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయం, మఖ్దూం భవన్‌లో ఆయన చిత్ర పటానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమావత్ అంజయ్ నాయక్, రాష్ట్ర సమితి సభ్యులు మారుపాక అనిల్ కుమార్, పుట్ట లక్ష్మణ్, మణికంఠ రెడ్డి, ఆఫీస్ కార్యదర్శి గోవిందరావు, బిల్డింగ్ ఇన్‌చార్జ్ బోయ శ్రీరాములు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది అంజయ్య, దశరథ, నరసింహ, శివకుమార్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ వాదాన్ని తొలి నుంచి ప్రోత్సహించిన మహనీయుడు నూకల రాంచంద్రారెడ్డి

రాంచంద్రారెడ్డి కాంస్యవిగ్రహ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** తెలంగాణ వాదాన్ని తొలి నుంచి ప్రోత్సహించిన మహనీయుడు దివంగత నూకల రాంచంద్రారెడ్డి అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రూ. 42.28 లక్షలతో నిర్మించిన దివంగత మాజీ మంత్రి నూకల రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ శాసనసభ్యు లు, డాక్టర్ భూక్య మురళి నాయక్, పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్, సీతారాం నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, బసవరాజు సారయ్య, ట్రై కార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఇన్‌ఛార్జి ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, నూకల రామచంద్ర రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ మహబూబాబాద్ నుంచి నాలుగుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ, ప్రణాళిక ,ఇతర కీలక శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించి ఈ ప్రాంత ప్రజల గుండె ల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత నాయకుడు నూకల రాంచంద్రా రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో సుమారు రూ.6 కోట్ల 50 లక్షల వ్యయంతో చేపట్టి, సీసీ, బిటి రోడ్లు, వర్షపు నీటి కాలువ, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

## సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు పునరుద్ధరించాలి: హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మానవతా దృక్పథంతో ఆలోచించి వెంటనే మెడికల్ బోర్డ్‌ను ఏర్పాటు చేసి, సింగరేణి సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్దరించాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లో సింగరేణి సంస్థ డైరెక్టర్ గౌతమ్‌ను హరీశ్‌రావు ఆధ్వర్యంలో టిబిజికెఎస్ నాయకుల ప్రతినిధి బృందం శనివారం కలిసి వినతి పత్రం అందజేసింది. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ కార్మికుల పట్ల సిఎం రేవంత్ రెడ్డి పగపట్టినట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కరెంట్‌కు బొగ్గును తీసుకుని బిల్లులను చెల్లించడం లేదని, సింగరేణి అప్పుల పాలయ్యే పరిస్థితికి వచ్చిందని, జీతాలకు కూడా డబ్బులు లేక ఒడి తీసుకుని జీతాలు చెల్లించే పరిస్థితుల్లో ఉన్నదని హరీశ్‌రావు తెలిపారు. ఫుట్‌బాల్ ఆడటం కోసం సింగరేణి సంస్థకు చెందిన రూ.10 కోట్లను ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం వాడిన రూ.110 కోట్ల అంశంపైన విచారణ చేపడుతామని హరీశ్ రావు తెలిపారు.

## 'డ్రగ్స్ కేసు' విచారణపై చర్యలేవి?

- కేంద్ర మంత్రి బండి సంజయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెసిఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో చేపట్టిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వారిని అకున్ సబర్వాల్ బృందం విచారిస్తే కెసిఆర్ కుటుంబ సభ్యులకు కూడా డ్రగ్స్ విక్రయదారులతో సంబంధాలున్నాయని తేలిందని, ఈ విషయమై వాంగ్మూలం ఇచ్చారని బండి సంజయ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటికి వస్తే తన కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తు సమాధి అవుతుందని బావించి, ఆకున్ సబర్వాల్‌ను అర్ధాంతరంగా డ్రగ్స్ కేసు బాధ్యతల నుండి తప్పించారని ఆరోపించారు. ఆ కేసుకు సంబంధించిన నివేదికను, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్‌మెంట్లన్నింటినీ నాటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి డ్రగ్స్ నిర్మూలన పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే ''ఈగల్'' టీమ్‌ను వెంటనే రంగంలోకి దింపి సోమేశ్ కుమార్‌ను విచారించాలని డిమాండ్ చేశారు.

## కమ్యూనిస్టుయోధుల ఆత్మబలిదానాలతో స్వాతంత్ర్యం



- సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అనేక మంది కమ్యూనిస్టు యోధుల ఆత్మబలిదానాలతో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిందని, కాంగ్రెస్ పార్టీలో కమ్యూనిస్టులు అంతర్భాగంగా ఉంటూనే కాంగ్రెస్ నిర్ణయాలను ప్రభావితం చేశారని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు అన్నారు. ప్రస్తుత పాలకులు నాటి బ్రిటీష్ పాలకుల కంటే క్రూరంగా, నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో నెలకొన్న తాజా పరిస్థితులపైన కమ్యూనిస్టులు మరో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నిర్వహించాలన్నారు. ''వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమం –గుణపాఠాలు–కర్తవ్యాలు''అనే అంశంపైన సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కె.రమ అధ్యక్షతన జరిగిన సదస్సులో ''ప్రతిఘటనా పోరాటం, ఆచరణానుభవం,'' పుస్తకాలను మాజీ ఎంఎల్‌ఏ గుమ్మడి నర్సయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోటు రంగారావు మాట్లాడుతూ ప్రపంచంలో మొట్టమొదట రష్యాలో సోషలిస్టు విప్లవం విజయవంతమైందని, తద్వారా భారతదేశంలో యువకులు, విద్యార్థులు తమ మనసునిండా దేశభక్తిని నింపుకున్నారని, స్వాతంత్ర్య పోరాటంలో ముందు వరుసలో నిల్చున్నారని తెలిపారు. కాంగ్రెస్ నిర్వహించిన సభలకు వేలాదిమందిని తరలించిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉన్నదని, అలాగే దండి గాంధీ నాయకత్వంలో సాగిన సత్యాగ్రహంలో కూడా కమ్యూనిస్టులు పాల్గొన్నారని ఆయన వివరించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆవిర్భవించిన గదర్ పార్టీ , హిందూస్తాన్ సోషలిస్టు అసోసియేషన్(హెచ్ఎస్ఎ), పెజెంటరీ అండ్ వర్కర్స్‌లాంటి పార్టీలు ప్రజల తరపున పోరాడిన చరిత్ర ఉన్నదని పోటురంగారావు గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ దేశ విప్లవకారుల నిజమైన వారసత్వంగా, అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీ 3వ ఇంటర్నేషనల్ ఫలితంగా 1925 డిసెంబర్‌లో 26,27,28తేదలలో కాన్పూర్‌లో మహాసభలు జరుపుకొని ఏర్పడిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు విప్లవ వారత్వంను కొనసాగిస్తూ వస్తున్న కమూనిస్టు పార్టీ నేటి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ప్రజా ప్రతీఘాతుకను ఎదిరిస్తూ పోరాడుతున్నదని తెలిపారు. ప్రస్తుత పాలకులు నిర్బంధాలపేరుతో విప్లవకారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

**కాన్పూర్‌లో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీనే సరైన ఆవిర్భావం**

సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకుడు బత్తిని శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో ప్రపంచంలో విప్లవకారులు ఎక్కడ ఉన్నప్పటికీ భారతదేశ స్వాతంత్ర్య కోసం కలలు కన్నారని, అమెరికా, రష్యా లాంటి దేశాలలో ఉన్నప్పటికి వలసల విముక్తి కోసం ఎం.ఎన్.రాయ్.అంతర్జాతీయ విప్లవకారుడు లెనిన్ సలహాతో తాష్కెంట్‌లో కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారని వివరించారు. అయితే, 1925లో కాన్పూర్‌లో విప్లవ శక్తులు కలిసి ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ సరైన ఆవిర్భావంగా భావించవచ్చునన్నారు. దేశబంలో ప్రగతి వ్యతిరేక శక్తుల ప్రాబల్యం పెరిగిందని, కమ్యూనిస్టులు ధైర్యంగా, సాహసోపేతంగా ప్రజాపోరాటాలిన నడపాల్సిన అవసరం గురించాలని అన్నారు.

**కమ్యూనిస్టులు ఆత్మవిమర్శ చేసుకోవాలి : భార్గవ్**

జి. భార్గవ్ మాట్లాడుతూ కమ్యూనిస్టులు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కమ్యూనిస్టులు చేసిన త్యాగాలు అమోఘమని, కానీ చీలికలు, పేలికలుగా తెగిపోయారన్నారు. వారిలో ఐక్యత చెడిందని, సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్)లుగా వందలాది పార్టీలు చీలిపోవడం అవసరం లేదని అన్నారు. గోకినేపల్లి వెంకటేశ్వర్ రావు విప్లవ పార్టీలలో చీలకలు అనే అంశాన్ని పరిచయం చేశారు. మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కె.జి.రాంచందర్ మాట్లాడుతూ దేశంలో సామ్రాజ్యవాదుల జోక్యం పెరిగిందన్నారు. ఈ సదస్సులో సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హన్మేశ్, నాయకులు ఎం.కృష్ణ, వి.కృష్ణ, జి.వెంకటేశ్వర రావు, ఎస్.ఎల్. పద్మ, కె.సూర్యం, సదానందం, ప్రదీప్ పాల్గొన్నారు.


**పురపాలక సంఘ కార్యాలయము :: కోదాడ, సూర్యాపేట జిల్లా.**

నెం.యం.సి.కె/ఇ1/1487/2025-26 బహిరంగ వేలము ప్రకటన తేది: 27.12.2025

ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా, పురపాలక సంఘ పరిధిలో అస్పైషన్ టాయిలెట్‌ని నిర్మించుటకు గాను శీధిలావస్థలో ఉన్నటువంటి ఫిష్ మార్కెట్ వద్ద పాత టాయిలెట్‌ని కూల్చుట మరియు కుల్చగా వచ్చిన డిస్మాంటల్ మెటీరీయల్ మరియు ఇతర మెటీరీయల్ ను బహిరంగ వేలము పురపాలక సంఘ కార్యాలయంలో మీటింగ్ హాల్ నందు బహిరంగవేలము నిర్వహించబడును ఇట్టి వేలంలో పాల్గొనదల్చినవారు రూ.5000/- శ్రీయుత మున్సిపల్ కమిషనర్ కోదాడ మున్సిపాలిటీ పేరు మీద తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ ను తేదీ: 29.12.2025 సాయంత్రం గం.లు. 4.00 లోపు కోదాడ పురపాలక సంఘ కార్యాలయం నందు సమర్పించవలెను. తేది: 31.12.2025 ఉదయం. గం.లు 11.00 లకు పురపాలక సంఘ కార్యాలయం మీటింగ్ హాల్ నందు బహిరంగ వేలంలో పాల్గొనగలరు రూపాయలు 5000/- డిమాండ్ డ్రాఫ్ట్ (తిరిగి చెల్లించబడదు) కార్యాలయం నందు సమర్పించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనుటకు అర్హులు.

సం/- కమీషనర్
కోదాడ పురపాలక సంఘం

DIPR R.O. No. : 12678-PP/CL/ADVT/1/2025-26, Date: 27-12-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

ఎగ్జిక్యూటి ఇంజినీర్ కార్యాలయం, హయత్‌నగర్ సర్కిల్-3, ఎంఆర్‌ఓ కార్యాలయం పక్కన, సరూర్‌నగర్, హైదరాబాద్. ఇ-మెయిల్ : eec.ghmc@gmail.com

కొటేషన్ నోటీస్

కొటేషన్ నోటీసు నెం. EE/HYTNE/LBNZ/17/2025-26/216, తేది: 27-12-2025.

ప్రముఖ సంస్థల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి. అవి ఈ కింద సంతకం చేయబడిన వారికి తేదీ: 29-12-2025లోపు తప్పకుండా అందజేయాల్సి ఉంటుంది. కొటేషన్ తేదీ: 29-12-2025న సాయంత్రం 4.00గంటల వరకు లేదా లోపు మాత్రమే స్వీకరించబడతాయి. అది అదేరోజు 4.30 గంటల సమయానికి తెరవబడుతుంది. దీనికి సంబంధించిన వివరాలను ఎగ్జిక్యూటివ్ కార్యాలయం నుండి కార్యాలయం పనివేళల్లో పొందవచ్చు.

| క్ర.సం. | ఐటెమ్ యొక్క వివరణ | క్వాలిటీ | యూనిట్ | అమౌంట్ |
|---|---|---|---|---|
| 1. | ఫోమ్ బోర్డుల సరఫరా మరియు ఫిక్సింగ్ | 1 | Sft | |
| 2. | ఫ్లెక్సీల సరఫరా మరియు ఫిక్సింగ్ | 1 | Sft | |

**షరతులు :**
1. కొటేషన్లను తేదీ 29-12-2025న సాయంత్రం 4గంటల వరకు లేదా లోపు స్వీకరించబడతాయి. వాటిని అదేరోజు హయత్‌నగర్ సర్కిల్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో 4.30 గంటలకు తెరవబడతాయి.
2. ఎటువంటి కారణం చూపకుండానే కొటేషన్లను దర్దు చేయడానికి హయత్‌నగర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రత్యేక హక్కును కలిగి ఉన్నారు.

**సంబంధిత అధికారి చిరునామా :** శ్రీ కె. రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, హయత్‌నగర్ సర్కిల్-3, జిహెచ్ఎంసి, హైదరాబాద్.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తరపున, హయత్‌నగర్ సర్కిల్-3, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 12658-PP/CL/ADVT/1/2025-26, Date: 27-12-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## వీధి రౌడీలను మించి మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు : పటేల్ రమేశ్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు, జగదీష్ రెడ్డిలు వీది రౌడీలకు మించి మాట్లాడుతున్న భాషనుతెలంగాణ సమాజం గమనిస్తోందని టూరిజం అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. 8 నెలలుగా పామ్ హౌస్‌కే పరిమితమైన ఇప్పుడు బయటికివచ్చిన కెసిఆర్ ప్రజల దృష్టిని మరల్లించేందుకు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పటేల్ రమశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ నేతల ప్రయోగిస్తున్న భాషను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనాగరికమైన భాషను ప్రవేశపెట్టిందే కెసిఆర్ కాదా అని ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కెటిఆర్ ఇష్టానుసారంగా మాట్లాడితే తాము కూడ అదే రీతిలో సమాధానం చెబుతామని ఆయన హెచ్చరించారు.



## హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో 'పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్య' పుస్తకాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజాన్ని చైతన్యపరచిన కవి, ప్రజా వాగ్గేయ కారుడు పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్య పుస్తకాలు హైదరాబాద్ లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో అందుబాటులో ఉన్నాయని పాలడుగు నాగయ్య కుమార్తె సరోజిని దేవి తెలిపారు. పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం , సరోజిని దేవి పుస్తకాలు (కవిత్వం), దామోదరం సంజీవయ్య బుర్ర కథ తదితర పుస్తకాలు బుక్ ఫెయిర్‌లో అందుబాటులో ఉన్నాయని ఆమె వివరించారు. ఆసక్తి ఉన్నవారు స్టాల్ను సంప్రదించాలని సరోజిని దేవి తెలిపారు. కాగా ఈ పుస్తకాలను మాజీ ఎంఎల్‌ఎ మోత్కుపల్లి నర్సింహులు ఆవిష్కరించారు.

## కెటిఆర్ తన స్థాయికి మించిన మాటలు ఆపాలి : చనగాని దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మాజీమంత్రి కెటిఆర్ తన స్థాయికి మంచి మాట్లాడుతున్నారని, ఆయన తీరు మారక పోతే కాంగ్రెస్ కార్యకర్తలు తరిమి తరిమికొడతారు ఖబర్దార్ అని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ హెచ్చరించారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు రాజకీయ సహజీవనం చేస్తు తెలంగాణ అభివృద్ధి కి శనిలా దాపురించారని ఆయన విమర్శించారు. మాజీ సిఎం కెసిఆర్ ప్రెస్ మీట్ పెడితేనో, అయన అసెంబ్లీ వస్తోనో తెలంగాణ ప్రజలకి ఒరిగిలేమి లేదన్నారు. బిఆర్ఎస్ 10 ఏళ్ల అవినీతి పాలన పైన.. రెండు ఏళ్ల కాంగ్రెస్ ప్రజా పాలన పైన చర్చకు తాము సిద్ధమని, వారు సిద్ధామా అన్ని ప్రశ్నించారు. 10 ఏళ్ల పాటు ఈ రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఎంటో మాజీ మంత్రి కెటిఆర్ చెప్పాలని దయాకర్ డిమాండ్ చేశారు.



## ప్రతి పైసా ప్రజల అభివృద్ధి కోసమే

### డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** ప్రజా ప్రభుత్వం ప్రతి పై సా రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చే స్తు ందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపా రు. శనివారం నేలకొండపల్లి మండలం అనంత్ నగర్‌లో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భ ట్టివిక్ర మార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు పర్యటించారు. ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి అనంత్‌నగర్‌లో 33/ 11కెవి సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. కామంచికల్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో వోల్టేజీ సమస్యలు రాకుండా , వ్యవసాయ అవసరాలు, ప్రజా గృహ అవసరాలకు ఇబ్బందులు రాకుండా ఉండాలని సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక మంత్రి తమ దృష్టికి తీసుకు రావడంతో వెంటనే మంజూరు చేసి తక్కువ సమయంలోనే నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రూ. 2.25 కోట్లతో అనంతసాగర్‌లో నిర్మించిన సబ్ స్టేషన్ ను ప్రారంభించుకోవడం, రూ. 1.75 కోట్లతో కామంచికల్‌లో సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన ఒకే రోజు చేసుకోవడం సంతోషకరమన్నారు. గత పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. రాబోయే ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు ఉప ముఖ్యమంత్రి, మంత్రి, కలెక్టర్ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మెన్లు వెన్నపూసల సీ తారాములు, హరినాథ్‌బాబు, మాజీ ఛైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ నాయకులు కోడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజని, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసా చారి, సిపివో ఎ. శ్రీనివాస్, ఖమ్మం ఆర్డివో నర్సింహారావు, సంబంధిత శాఖల జిల్లా అధికారులుపాల్గొన్నారు.



## రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** తెలంగాణలో మార్పు మొదలైందని, రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ పార్టీపైన తెలంగాణ అంతటా తిరుగుబాటు ప్రారంభమైందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా బిఆర్ఎస్ సర్పంచుల ఆత్మీయ అభినందన సన్మా న కార్యక్రమం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పిఎస్ఆర్ కన్వెన్షన్‌లో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అధ్యక్షతన శనివారం జరిగిం ది. కెటిఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గతంలో కంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఓటింగ్ శాతం పెరిగిందని దీన్ని బట్టి అంచ నా వేస్తే రాబోయే ప్రభుత్వం బిఆర్ఎస్‌దేనని ఆయన స్పష్టం చేశా రు. అంతే కాకుండా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, తీరుపై ప్ర జలందరూ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఆరోపించారు. నేడు ఎంతోమంది గిరిజన సర్పంచ్‌లు ఆయా గ్రామాలకు ప్రథమ పౌరులయ్యారంటే అది కెసిఆర్ ఘనతేనని ఆయన అన్నారు. గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుండి 10 శాతం వరకు పెంచి గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడిన నాయకుడు కెసిఆర్ మా త్రమే. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ రవీందర్ రా వు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎ మ్మెల్యేలు శంకర్ నాయక్, డియస్ రెడ్యా నాయక్, హరిప్రియ నాయక్, బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# పుస్తక ప్రపంచంలో విహరిస్తున్న యువత

### 9 రోజుల్లో సుమారు 12 లక్షల మంది రాక

### రేపటితో ముగియనున్న పుస్తకాల పండుగ





**ప్రజాపక్షం/హైదరాబాద్:** హాలీడే వచ్చిందంటే చాలు దారులన్నీ బుక్ ఫెయిర్ వైపు పయనమవుతున్నాయి. పుస్తక ప్రపంచంలో యువతరం విహరిస్తుండటం సమాజంలో మంచి మార్పునకు నాంది అని పలువురు రచయితలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 9 రోజుల్లో సుమారు 12 లక్షల మంది బుక్ ఫెయిర్‌ను సందర్శించారని సొసైటీ అధ్యక్షులు యాకూబ్ తెలిపారు. డిజిటల్ యుగంలో చిన్నారుల నుంచి మొదలుకొని వయోవృద్ధులు, మరీ ముఖ్యంగా యువతరం గంటల కొద్ది సెల్ ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్న విషయం విస్మయానికి గురి చేస్తున్న తరుణంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తకాల పండగ విద్యార్థులతో పాటు యువతరానికి చెలిమిలా నిలుస్తోంది. గతేడాదితో పోల్చితే ఈ సారి బుక్ ఫెయిర్‌కు యువత అధికంగా వస్తుందని, సోమవారంతో పుస్తకాల పండుగ ముగుస్తుందని సొసైటీ నిర్వాహకులు పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో పుస్తకం కనుమరుగవుతుందని అనుకుంటున్న వేళ యువ పుస్తక ప్రేమికులతో పాటు యువ రచయితలు పెరగడం ఆనందంగా ఉందని రచయితలు తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు.

**బుక్ ఫెయిర్‌కు యువతరం క్యూ..**

విద్యార్థుల నుంచి నిరుద్యోగుల దాకా పెద్ద ఎత్తున యువతరం బుక్ ఫెయిర్‌కు క్యూ కట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. భవిష్యత్తు నిర్ణయాలను అందించడంతో పాటు జ్ఞానం పెంపొందించుకోవడానికి తమకు కావాల్సిన అన్ని పుస్తకాలు ఒకే దగ్గర లభ్యమవుతుండటం చాలా సంతోషంగా ఉందంటున్నారు యువత. డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, జర్నలిస్ట్స్, టీచర్లు ఇలా ప్రతి రంగంలో ఉన్న యువత తమ తమ రంగంలో ఉన్నతంగా రాణించేందుకు కావాల్సిన పుస్తకాలు బుక్ ఫెయిర్‌లో కొనుగోలు చేస్తామని పేర్కొంటున్నారు. వారి స్నేహితుల్లో ఎవరైనా చెడు వ్యసనాలకు బానిసైన వారికి మంచి పుస్తకాలను అందించి, వాటిని చదివించడంతో పాటు వారిలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు.

**పుస్తకమే నేస్తంగా కాలక్షేపం..**

సమాజంలో నేడు ఒకరితో మరొకరికి సంబంధం లేకుండా మానవ విలువలు అంతరించిపోతున్నాయి. ఒకే ఇంట్లో నివసిస్తున్న కుటుంబసభ్యులు కూడా ఒకరితో మరొకరు సరిగ్గా మాట్లాడుకోవడం లేదనేది జగమెరిగిన సత్యం. కానీ, ఒంటరిగా ఫీల్ అయ్యే ప్రతి ఒక్కరికి పుస్తకం కాలక్షేపం అందించడంతో పాటు స్నేహితుడిగా తోడుగా నిలుస్తోందని చెబుతున్నారు.

**రచయితల కలయికకు వేదికగా..**

బుక్ ఫెయిర్‌ను సందర్శించి కొందరు మంత్రముగ్ధులవుతున్నారు. తమ ఇష్టమైన రచయితలను ఈ వేదికగా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందంటున్నారు. అలాగే ప్రముఖ కవులు, రచయితలు నచ్చిన పుస్తకాలపై జరిపే వివరణ చాలా బాగుందని పేర్కొన్నారు.

**అఖిల (మెడిసిన్ విద్యార్థిని)**

గతేడాది నా స్నేహితుడి సలహాతో బుక్ ఫెయిర్‌ను సందర్శించి కొన్ని పుస్తకాలను కొనుగోలు చేశాను. అయిష్టంతోనే పుస్తకం చదవడం ప్రారంభించా, కాని అందులోని విషయాలు నన్ను చాలా ప్రేరేపించాయి. ప్రస్తుతం పుస్తకం చదవడం నా దినచర్యగా మారింది. మా ఇంట్లో సుమారు 100 వరకు పుస్తకాలు ఉన్నాయి.

**పిల్లలకు మనమిచ్చే సంపద చదువు మాత్రమే..**

**యాకూబ్ (బుక్ ఫెయిర్ అధ్యక్షులు)**

పిల్లలకు మనమిచ్చే సందప చదువు మాత్రమే. బుక్ ఫెయిర్ హైదరాబాద్ ప్రజలకు గొప్ప వరం లాంటిది. ఇక్కడ 17 రాష్ట్రాలకు చెందిన 13 బాషాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలతో బుక్ ఫెయిర్‌ను సందర్శించి నచ్చిన పుస్తకాలు కొనుగోలు చేయండి. పుస్తక పఠనం విద్యార్థులను సెల్‌ఫోన్ మహమ్మరి నుంచి దూరంచేసి, జ్ఞానం వైపు అడుగులు వేసేలా చేస్తుంది. గత సంవత్సరాలతో పోల్చితే ఈ సారి బుక్ ఫెయిర్‌కు యువతరం తండోపతండాలుగా తరలి రావడం ఆనందంగా ఉంది.

### 42 శాతం బిసి రిజర్వేషన్ల కోసం

# అసెంబ్లీని ముట్టడిస్తాం

### తెలంగాణ బిసి సంక్షేమ సంఘం పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలకు వెళ్లాలని పలువురు బిసి నేతలు డిమాండ్ చేశారు. కాచిగూడలోని ఓ హోటల్‌లో శనివారం తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం'లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్, మేధావుల సంఘం చిరంజీవులు, బిసి జెఎసి వర్కింగ్ ఛైర్మన్ గుజ్జకృష్ణ, జెఎసి వైస్ ఛైర్మన్ నారగోని, బిసి పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ వెంకన్న, బిసి డెమొక్రటిక్ జెఎసి కోలా జనార్ధన్, అడ్వకేట్ల జెఎసి నాగుల శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ, బిసి కళమండలి డప్పు స్వామితో పాటు 80 కుల సంఘాలు, 36 బిసి సంఘాలు, 28 ఉద్యోగ సంఘాలు, న్యాయవాదుల, విద్యార్థి, మహిళ, కళామండలి, మహిళా సంఘాల నేతలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 42 శాతం బిసి రిజర్వేషన్ల సాధనకై అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని, పార్టీలకు అతీతంగా బిసి నాయకులు 42 శాతం రిజర్వేషన్లకై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చి మోసం చేసిందని, ఉన్న రిజర్వేషన్లకు కూడా గండి కొట్టారని మండిపడ్డారు. తక్షణమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాని మోదీతో భేటీ కావాలని సూచించారు. అలాగే రాష్ట్రంలో చేపట్టిన కులగణన లెక్కలు బయటపెట్టాలన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




## నిరంతర అధ్యయనం ఉత్తమ పాత్రికేయుడి లక్షణం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిరంతర అధ్యయనం లేని వారు ఉత్తమ పాత్రికేయులుగా రాణించలేరని సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్ స్పష్టం చేశారు. తన 50 ఏళ్ల వృత్తి జీవితంలో పుస్తక పఠనమే తనను నడిపించిందని తెలిపారు. మారుతున్న కాలంలో ఆడియో పుస్తకాలు, డిజిటల్ మాధ్యమాలు అందుబాటులోకి వచ్చినా, పఠనం అనేది ఒక జర్నలిస్టుకు ఊపిరి వంటిదని ఆయన అభివర్ణించారు. 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో భాగంగా అనిశెట్టి రజిత వేదికపై శనివారం సాయంత్రం పుస్తక స్ఫూర్తి, పుస్తకం ఒక దరిదీపం చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు అల్లం నారాయణ, దేవులపల్లి అమర్, కే.శ్రీనివాస్, కృష్ణుడు మాట్లాడారు. సామాన్య రైతు బిడ్డనైన తాను నేడు ప్రముఖ ఎడిటర్ల సరసన కూర్చునే అర్హత సాధించానంటే అది కేవలం పుస్తక పఠనం వల్లనే సాధ్యమైందని ప్రముఖ పాత్రికేయుడు అల్లం నారాయణ పేర్కొన్నారు. తన 40 ఏళ్ల పత్రికా రంగ ప్రస్థానంలో పుస్తకం ఒక దారిదీపంలా నిలిచిందని తెలిపారు. ఎన్ని డిజిటల్ విప్లవాలు వచ్చినా, ఎన్ని అత్యాధునిక సాధనాలు అందుబాటులోకి వచ్చినా కాగితపు పుస్తకం ఇచ్చే అనుభూతిని మరేదీ భర్తీ చేయలేదని ప్రముఖ సీనియర్ పాత్రికేయులు కె. శ్రీనివాస్ పేర్కొన్నారు. నేటి తరం పుస్తకాలు చదవట్లేదన్న ఆవేదనలో వాస్తవం లేదని, బుక్ ఫెయిర్‌కు యువత పోటెత్తడమే దానికి నిదర్శనమని తెలిపారు. పుస్తకమే సామాన్యుడి జీవితాన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని, అక్షర జ్ఞానమే పేదరికాన్ని జయించే అసలైన ఆయుధమని సీనియర్ పాత్రికేయులు కృష్ణారావు పేర్కొన్నారు. నగ్నముని చేతుల మీదుగా ప్రసంగకర్తలకు సన్మానం జరిగింది.

# క్రమశిక్షణతోనే విజయం తథ్యం

### కెసి పుల్లయ్య ఫౌండేషన్ విద్యార్థుల సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో మంత్రి వివేక్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి వ్యక్తి క్రమశిక్షణతో మెలగాలని, అప్పుడే జీవితంలో విజయం సాధిస్తారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ప్రపంచంలో చాలా మంది క్రమశిక్షణతోనే విజయం సాధించారని గుర్తుచేశారు. శనివారం హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని వాసవి భవన్ లో కెసి పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ పొంది ఉపాధి, ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా మంత్రి వివేక్ హాజరై, విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ రంగాలలో ఆసక్తి ఉన్న విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, ఉపాధి , ఉద్యోగం అవకాశాలను కె సి పుల్లయ్య ఫౌండేషన్ కల్పించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడటం అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కలలు కనాలని ఆ కలల సాధనకు కృషి చేయాలని చెప్పారు. కెసి పుల్లయ్య ఫౌండేషన్ కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ రాబోయే కాలంలో తెలంగాణలో నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా కేసి పుల్లయ్య ఫౌండేషన్ కృషిచేస్తుందన్నారు. 2035 నాటికి లక్షా 50 వేల మందికి నైపుణ్య శిక్షణ ఇప్పిచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ ఏడాది 830 మంది విద్యార్థులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వగా, ఇందులో 710 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశామన్నారు. ట్రస్టీ , సిఈఓ డాక్టర్ సుధారాణి చల్ల , ఫౌండేషన్ డైరెక్టర్ ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, అణగారిన సామాజిక వర్గాల అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే 250 మంది హెచ్ఐవి బాధిత విద్యార్థులను దత్తత తీసుకొని, వారికి పౌష్టికి హారం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


## ముక్కోటికి ముస్తాబు




**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ముక్కోటి ఉత్సవాలకు భద్రాచలం ముస్తాబవుతోంది. ఇప్పటికే అధ్యయనోత్సవాలు కొనసాగుతుండగా ఈనెల 29న జరిగే తెప్పోత్సవం, 30న జరిగే ఉత్తర ద్వార దర్శనానికి సంబందించిన అన్ని ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉందనే అంచనాలతో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. తాగునీరు, పారిశుధ్యంతో పాటు వసతి సదుపాయాలను కల్పించనున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే వారి కోసం తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ప్రత్యేక బస్సు సర్వీసులను తిప్పేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వైకుంఠ ద్వారం వద్ద ఉన్న తలుపులకు మెరుగులు దిద్దుతున్నారు. భక్తులు స్వామిని వీక్షించేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటూ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో ఆలయ పరిసరాల దేదీప్య మానంగా వెలుగులు వెదజల్లుతున్నాయి. వైకుంఠ ఏకాదశి అధ్యనోత్సవాల్లో భాగంగా స్వామివారు శనివారం బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

# కృత్రిమ అవయవాల పంపిణీ

### మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం / వరంగల్ :** దివ్యాంగుల్లో ఆత్మస్థర్యాన్ని పెంపొందించడానికి కృత్రిమ అవయవా ల పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నా రు. ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీనియర్ ఐఎఎస్ అధికారి పరికిపండ్ల నరహరి ఆధ్వర్యం లో భగవాన్ మహావీర్ వికలాంగుల సహాయ స మితి సహకారంతో వరంగల్ జిల్లా పరిధి కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత కృత్రిమ కాళ్ళ పంపిణీ శిబిరాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాళ్లు చేతులు లేని దివ్యాంగుల కోసం ఇలాంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని, నిర్వాహకులు సీనియర్ ఐఎఎస్ నరహరి సేవలను మంత్రి ప్రశంసించారు. సొంత ఊరిలో ఆసుపత్రి నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని, విద్యా వికాసం కోసం, యువతి యువకులకు ఉపాధి కోసం ఆలయ ఫౌండేషన్ వారు సేవలు అందిస్తున్నారని, ఇటీవల కురిసిన భారీవర్షాల నేపథ్యంలో ముంపుకు గురైన ప్రాం తాలలో నిత్యావసర సరుకులను అందించారని, గత 12 సంవత్సరాల కాలం నుంచి ట్రస్టు ద్వారా ప్రజలకు సామాజిక సేవా కార్యక్రమాలు అందిస్తున్నారని వివరించారు. సేవే మార్గంగా ముందు కు పోతున్న క్రమంలో మహావీర్ సొసైటీ వారు భాగస్వాములు కావడం మరింత బలాన్ని ఇచ్చిందన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కలచి వేస్తాయని, వారికి ప్రభుత్వం ఆసుపత్రుల్లో కృత్రిమ అవయవాలు అందిస్తారని, అవి అధిక బరువుతో కూడుకొని ఉంటాయని, వాటిని వినియోగించుకోవడం దివ్యాంగులకు కొంత ఇ బ్బందికర పరిస్థితి ఏర్పడుతుందని, ఈ ట్రస్ట్ ద్వా రా అందించే పరికరాలు నాణ్యతతో పాటు తక్కు వ బరువుతో దివ్యాంగులు వినియోగించుకునే వి ధంగా ఉపయుక్తంగా ఉన్నాయని అన్నారు. నగ ర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ వ రంగల్‌లో క్యాంప్ ఏర్పాటు చేసి కృత్రిమ పరికరాలు అందించడం ఆనందంగా ఉందని, నగరం లో రెండు రోజుల పాటు శిబిరం ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బంది కలుగకుండా శిబి రం నిర్వహించడం ముదావహం అని ఆలయ ఫౌండేషన్ ద్వారా విద్యా వైద్యం తో పాటు అనేక సేవా సామాజిక కార్యక్రమాలను చేయడం సం తోషంగా ఉందని ఒక ఐఎఎస్ అధికారి తన స్వం త రాష్ట్రంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. విధి నిర్వహణలో భా గంగా ఎంతటి పని ఒత్తిడి ఉన్నా ఇందు కోసం ప్ర త్యేక టీంను ఏర్పాటు చేసుకొని నిర్వహిస్తున్నందుకు మేయర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఎఎస్ నరహరి, జిల్లా కలెక్టర్ డా. స త్యశారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పా య్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కా ర్పొరేటర్లు ఆడెపు స్వప్న, బసవ రాజు కుమారస్వామి, కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ ఎర్రబెల్లి ప్ర దీప్ రావు, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, ట్రస్టు సిఇఒ రమేష్ బాబు, భగవాన్ మహావీర్ వికలాంగుల సహాయ సమితి కార్యవర్గ సభ్యు లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ముగ్గురు దోపిడీ దారులు అరెస్ట్

**హోషియార్‌పూర్:** పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లా గఢ్‌శంకర్ ప్రాంతంలో శనివారం పోలీసులతో జరిగిన కాల్పుల తర్వాత దోపిడీలకు పాల్పడిన ఒక ముఠాకు చెందిన ముగ్గురు సభ్యులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. హోషియార్‌పూర్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సందీప్ కుమార్ మాలిక్ మాట్లాడుతూ, నిందితులు డిసెంబర్ 16న మహిల్‌పూర్‌లోని ఒక మనీ ఎక్స్ఛేంజ్ దుకాణంలో జరిగిన దోపిడీలో పాలుపంచుకున్నారని, ఆ సమయంలో రూ. 4 లక్షలకు పైగా దోచుకున్నారని చెప్పారు. పారిపోతున్నప్పుడు, నిందితులు తమ మోటార్‌సైకిల్ జారిపడటంతో దానిని ఒ టక వాగులో వదిలేశారని, అయితే ఆ సమయంలో వారు తప్పించుకోగలిగారని ఆయన తెలిపారు. గతంలో జరిపిన దర్యాప్తులో దిలావర్ సింగ్ అలియాస్ జోరాను అరెస్టు చేశామని, ఆ తర్వాత మిగిలిన నిందితులు మరో నేరానికి ప్లాన్ చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందిందని ఎస్ఎస్‌పి చెప్పారు. శనివారం, గఢ్‌శంకర్ ప్రాంతంలోని బిల్డోన్ గ్రామం సమీపంలో సాధారణ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నప్పుడు, నంబర్ ప్లేట్ లేని అనుమానాస్పద మోటార్‌సైకిల్‌ను పోలీసులు గుర్తించారు. ఆగమని సంకేతం ఇవ్వగా, అందులో ఉన్నవారు పోలీసులపై కాల్పులు జరిపారని మాలిక్ చెప్పారు.

మాదకద్రవ్యాల దుర్వినియోగం

## హర్యానా యువతను పీడిస్తోంది

పరిస్థితి మరింత దిగజారుతోంది

రణదీప్ సుర్జేవాలా



**చండీగఢ్:** హర్యానాలో మాదకద్రవ్యాల దుర్వినియోగం తీవ్రమైన ప్రజా ఆరోగ్య సంక్షోభంగా మారిందని, యువత దీనివల్ల తీవ్రంగా ప్రభావితమవుతున్నారని ఒక నివేదికను ఉటంకిస్తూ కాంగ్రెస్ నాయకుడు రణదీప్ సింగ్ సుర్జేవాలా పేర్కొన్నారు. రోహ్‌తక్ పిజిఐ నివేదిక ప్రకారం, 15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు మాదకద్రవ్యాల వ్యసనానికి ఎక్కువగా బానిసలవుతున్నారన్నారు. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, మాదకద్రవ్యాల దుర్వినియోగంతో ప్రభావితమైన వారిలో సుమారు 74 శాతం మంది 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారే. వారిలో, దాదాపు 73 శాతం మంది చికిత్స పొందిన తర్వాత కూడా తిరిగి వ్యసనానికి బానిసలవుతున్నారు. ఇది సమస్య తీవ్రతను తెలియజేస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వ మాదకద్రవ్యాల కౌన్సెలింగ్ డేటా ప్రకారం... గత ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్య సన విముక్తి కేంద్రాలలో చికిత్స కోసం 1,84,163 మంది యువకులు నమోదు చేసుకున్నా రని ఆయన తెలిపారు.వయస్సుల వారీగా గణాంకాలను పరిశీలిస్తే... మాదకద్రవ్యాలు వాడేవా రిలో 46 శాతం మంది 19–25 సంవత్సరాల వ యస్సుల వారు ఉన్నారు. 28 శాతం మంది 15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు వారు కాగా 21 శాతం మంది 26 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు వారు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంక్షోభం మరింత తీవ్రంగా ఉందని, పట్టణ ప్రాంతాల నుండి 38 శాతం కేసులు నమోదవ్వగా, గ్రామాల నుండి 62 శాతం కేసులు నమోదయ్యాయని డేటా చూపిస్తోందని ఆయన అన్నారు. గత ఏడాదితో పోలిస్తే మాదకద్రవ్యాల దుర్వినియోగం కేసులు సుమారు 35 శాతం పెరగడంతో మొత్తం పరిస్థితి మరింత దిగజారిందని సుర్జేవాలా అన్నారు.

ప్రజాస్వామ్య హక్కులు పరిమితం చేసేందుకు

## ‘సర్’ ఒక నిశితమైన కుట్ర

❑ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ :** గ్రామీణ ఉపాధి పథకం ఎంజిఎన్ఆర్ఇజిఎ రద్దుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ప్రభుత్వం చివరికి వెనక్కి తీసుకోవలసి వచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం మాదిరిగానే ఈ ఉద్యమం ఉండాలని ఆయన సూచించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనేది ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడానికి చేసిన ఒక ‘సునిశితమైన కుట్ర’ అని కూడా ఖర్గే అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, పౌరుల హక్కులు తీవ్ర ముప్పులో ఉన్నాయన్నారు. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమి ఓటమి తర్వాత మొదటిసారిగా జరిగిన ఈ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తో పాటు ఇతర అగ్ర నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుడు శశి థరూర్ కూడా పాల్గొన్నారు. సమావేశానికి ముందు, పార్టీ అగ్ర నాయకులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. దివంగత కాంగ్రెస్ నాయకులు శివరాజ్ పాటిల్, శ్రీప్రకాష్ జైస్వాల్‌కు నివాళులర్పించడానికి రెండు నిమిషాల మౌనం పాటించారు. సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన ఒక దార్శనిక చట్టమని, దీనిని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసించారని ఖర్గే అన్నారు. ఈ పథకం చూపిన ప్రభావం కారణంగా దీనికి మహాత్మా గాంధీ పేరు పెట్టారని ఆయన చెప్పారు. ‘ఎంజిఎన్ఆర్ఇజిఎను రద్దు చేయడం మహాత్మా గాంధీకి అవమానం’ అని ఆయన అన్నారు. దీనిని పని హక్కుపై దాడిగా అభివర్ణించారు. ‘మోడీ ప్రభుత్వం ఎటువంటి అధ్యయనం, రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపకుండా చట్టాన్ని రద్దు చేసింది. ప్రభుత్వ ఈ చర్యను దేశవ్యాప్తంగా వ్యతిరేకించాలి’ అని ఆయన పిలుపునిచ్చారు. భారతదేశ భూసేకరణ చట్టానికి 2015లో చేసిన సవరణలను సమర్థవంతంగా వెనక్కి తీసుకున్న ఘటనలతో సహా గతంలో జరిగిన ఉదాహరణలను కాంగ్రెస్ అధినేత ఉదహరించారు. మొదట ఆర్డినెన్స్‌లుగా తీసుకువచ్చి, ఆ తర్వాత ప్రతిపక్షాల నిరసనల మధ్య పార్లమెంటులో ఆమోదించబడినా 2020–21 రైతుల నిరసనల తర్వాత రద్దు చేయవలసి వచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను కూడా ఆయన ప్రస్తావించారు. ‘వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంటారని రాహుల్ గాంధీ చాలా కాలం క్రితమే అంచనా వేశారు. ఇప్పుడు, ఎంజిఎన్ఆర్ఇజిఎను కూడా తిరిగి తీసుకురావాల్సి వస్తుందని ఆయన చెప్పారు’ అని ఖర్గే అన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎపై పటిష్టమైన ప్రణాళికలు రూపొందించి, దేశవ్యాప్త ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించడం మనందరి సామూహిక బాధ్యత అని, ఈ ‘కష్టకాలంలో’ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని ఆయన అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై మాట్లాడుతూ, ఇది ఒక తీవ్రమైన సమస్య అని, ప్రజల ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడానికి చేసిన ఒక సునిశితమైన కుట్ర అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. రాహుల్ జీ ‘ఓట్ల దొంగతనం’పై అనేక ఉదాహరణలు, వాస్తవాలను సమర్పించారని, బిజెపికి, ఎన్నికల సంఘానికి మధ్య కుమ్మక్కు ఉందని, మన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా చూసుకోవాలని చెప్పారు. దళితులు, గిరిజనులు, అత్యంత వెనుకబడిన తరగతులు, మైనారిటీల పేర్లు తొలగించబడకుండా లేదా ఇతర బూత్‌లకు బదిలీ చేయబడకుండా కూడా మనం నిర్ధారించుకోవాలన్నారు. దీని కోసం, మన బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లవలసి ఉంటుందని ఖర్గే చెప్పారు. 2027లో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో పని ప్రారంభించాలని ఆయన పార్టీ సభ్యులకు పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న దాడులను ఖర్గే ఖండించారు. ఈ విషయంపై యావత్ దేశం ఆందోళన చెందుతోందని అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ఉన్న సంస్థలు క్రిస్మస్ వేడుకలపై చేసిన దాడులు మత సామరస్యాన్ని దెబ్బతీశాయని, ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్టను మసకబార్చాయని ఆయన అన్నారు.

## ‘ఆపరేషన్ ఆఘాత్ 3.0’



- ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో పోలీసులు అర్ధరాత్రి వేళ తనిఖీలు
- 966 మందిని అదుపులోకి... మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం, వాహనాలను స్వాధీనం

**న్యూఢిల్లీ :** కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ‘ఆపరేషన్ ఆఘాత్ 3.0’ పేరిట అగ్నేయ ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో పోలీసులు అర్ధరాత్రి వేళ తనిఖీలు నిర్వహించారు. వీధి రౌడీలు, నేరస్థులతో సంబంధం ఉన్న అనుమానితులే లక్ష్యంగా తనిఖీలు చేశారు. కొత్త సంవత్సర వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దీన్ని నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ చర్యల్లో భాగంగా 966 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆయుధాలు, మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం, వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు శనివారం తెలిపారు. సంవత్సరాంతపు వేడుకల సమయంలో ప్రజల రద్దీ పెరిగిన దృష్ట్యా, వ్యవస్థీకృత నేరాలు, వీధి నేరాలు, పాత నేరస్థుల కార్యకలాపాలను అరికట్టడానికి ‘ఆపరేషన్ ఆఘాత్ 3.0’ పేరుతో ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు వారు చెప్పారు. మొత్తం అరెస్టు అయిన వారిలో 331 మంది నిందితులను ఢిల్లీ ఎక్సైజ్ చట్టం, ఎన్‌డిపిఎస్ చట్టం, పబ్లిక్ గ్యాంబ్లింగ్ చట్టం కింద అరెస్టు చేయగా, 504 మందిని వివిధ నివారణ నిబంధనల కింద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. లక్షిత చర్యల్లో భాగంగా, పోలీసులు 116 మంది జాబితాలో ఉన్న రౌడీలను అదుపులోకి తీసుకున్నారు, ఐదుగురు ఆటో దొంగలను, నలుగురు పరారీలో ఉన్న నేరస్థులను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ సమయంలో, పోలీసులు ఆయుధాల చట్టం కింద 21 నాటు తుపాకులు, 20 లైవ్ కార్ట్రిడ్జిలు, 27 కత్తులను స్వాధీనం చేసుకున్నారు. 12,258 క్వార్టర్ల అక్రమ మద్యం, 6.01 కిలోల గంజాయి, జూదగాళ్ల నుండి రూ. 2.36 లక్షల నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 310 మొబైల్ ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఒక నాలుగు చక్రాల వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఢిల్లీ పోలీస్ చట్టం కింద 1,306 మందిపై చర్యలు తీసుకోగా, నిబంధనల ఉల్లంఘనలకు గాను 231 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 600 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించి ఈ దాడులు నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల సమయంలో, ముఖ్యంగా నివాస ప్రాంతాలు, మురికివాడల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడం, వ్యవస్థీకృత నేరాల నెట్‌వర్క్‌లు, పాత నేరస్థులను నిరోధించడం ఈ ఆపరేషన్ యొక్క లక్ష్యమని పోలీసులు తెలిపారు. తగిన కేసులలో బిఎన్ఎస్ సెక్షన్లు 111, 112 తో సహా కఠినమైన చట్టపరమైన నిబంధనలను అమలు చేస్తామని, పాత నేరస్థులను బహిష్కరించడానికి కూడా ప్రతిపాదనలు ప్రారంభిస్తున్నామని అధికారులు తెలిపారు. గత నెల రోజులుగా జిల్లాలో పెట్రోలింగ్, వాహనాల తనిఖీ, రాత్రి నిఘాను ముమ్మరం చేయడం వల్ల వీధి నేరాలకు సంబంధించిన పిసిఆర్ కాల్స్ తగ్గాయని పోలీసులు తెలిపారు

## బిజెపి పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలపై దాడి

వలసకార్మికుడి హత్యలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

మమతా బెనర్జీ



**కోల్‌కతా :** బిజెపి పాలిత ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన 30 ఏళ్ల వలస కార్మికుడు హత్యకు గురైన కొన్ని రోజుల తర్వాత, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. ‘జీరో ఎఫ్ఐఆర్’ నమోదు అయిందని, దర్యాప్తు నిమిత్తం రాష్ట్ర పోలీసు బృందం పొరుగు రాష్ట్రానికి వెళ్లిందని తెలిపారు. ప్రతి బిజెపి పాలిత రాష్ట్రంలో బెంగాలీ మాట్లాడే ప్రజలపై జరుగుతున్న క్రూరమైన అణచివేత, వేధింపులు, హింసను ఆమె ఖండించారు. బుధవారం బీడి విషయంలో జరిగిన వాగ్వాదం తర్వాత పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆ వలస కార్మికుడు సంబల్‌పూర్ జిల్లాలో హత్యకు గురైనట్లు ఆరోపణలు వచ్చాయి. యువకుడు జ్యువెల్ రాణా హత్యకు సంబంధించి, పశ్చిమ బెంగాల్ పోలీసులు ఇప్పటికే సూటి పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆరుగురు నిందితులను అరెస్టు చేశారని బెనర్జీ చెప్పారు. దర్యాప్తు నిర్వహించడానికి పశ్చిమ బెంగాల్ నుండి ఒక పోలీసు బృందం ఒడిశాకు వెళ్లిందన్నారు. బెదిరింపులకు, బాధితులుగా మారిన, అమానవీయ ప్రవర్తనకు గురైన ఆ వలస బెంగాలీ మాట్లాడే కుటుంబాలకు తాము గట్టిగా అండగా నిలబడతామని, వారికి సాధ్యమైన సహాయాన్ని అందిస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు మమత శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. సంబల్‌పూర్ ఘటనను ప్రస్తావిస్తూ, ముర్షిదాబాద్‌లోని జంగీపూర్ ప్రాంతానికి చెందిన వలస కార్మికులు బిజెపి పాలిత ఒడిశాలో తీవ్రమైన అకృత్యాలను ఎదుర్కొన్నారని ఆమె అన్నారు. ముర్షిదాబాద్‌లోని జంగీపూర్‌లోని సూటి ప్రాంతానికి చెందిన ఒక యువ వలస కార్మికుడిని డిసెంబర్ 24న సంబల్‌పూర్‌లో మళ్లీ కొట్టి చంపడం చాలా దురదృష్టకరమని ఆమె సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో అన్నారు. ముస్లింలు అధికంగా ఉన్న ముర్షిదాబాద్ నుండి వచ్చిన వలస కార్మికులు ఇప్పుడు భయంతో ఇళ్లకు తిరిగి వస్తున్నారని బెనర్జీ ఆరోపించారు.

## కేరళలో ఎఐ ఫొటో షేర్ చేసిన కాంగ్రెస్ నేత అరెస్టు

**కోజికోడ్ :** శబరిమల బంగారు కేసులో నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టితో కలిసి ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను చిత్రీకరిస్తున్న కృత్రిమ మేధస్సు (ఎఐ) ద్వారా రూపొందించిన ఫోటోను షేర్ చేసిన ఆరోపణలపై శనివారం కాంగ్రెస్ నాయకుడిని అరెస్టు చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడైన ఎన్ సుబ్రహ్మణియన్‌పై కేసు నమోదు చేసిన తర్వాత చెవయూర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అతని అరెస్టును నమోదు చేసి, స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.ముఖ్యమంత్రి, పొట్టి కలిసి ఉన్న ఫోటోను, వారిద్దరి మధ్య ఉన్న సన్నిహిత సంబంధానికి కారణాన్ని ప్రశ్నిస్తూ ఉన్న శీర్షికతో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేసినందుకు అతనిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా, సుబ్రహ్మణియన్ వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి శనివారం ఉదయం పోలీసు బృందం అతని ఇంటికి చేరుకుంది. అనంతరం, వివరణాత్మక విచారణ కోసం అతడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న చిత్రం ఎఐ ద్వారా రూపొందించబడినదని సిపిఐ(ఎం) పేర్కొంది. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లే ముందు, తాను షేర్ చేసిన ఫోటో ఎఐ ద్వారా రూపొందించబడలేదని, ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన వీడియో నుండి తీసుకున్నదని సుబ్రహ్మణియన్ విలేకరులతో అన్నారు. పోలీసులు చెప్పేది ప్రభుత్వ మాటలే. వారు ప్రతిదాన్నీ ఎఐ ద్వారా ముద్ర వేస్తున్నారని ఆ యన ఆరోపించారు.

## హిమాచల్‌లో డాక్టర్ల సమ్మె

- రోగితో ఘర్షణ పడినందుకు డాక్టర్‌ను తొలగించడంపై వైద్యుల సంఘం ఆగ్రహం
- రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిన వైద్య సేవలు



**సిమ్లా :** హిమాచల్ ప్రదేశ్‌లోని అనేక ఆసుపత్రులలో అత్యవసర సేవలు మినహా వైద్య సేవలు నిలిచిపోయాయి. రోగితో ఘర్షణకు దిగిన వైద్యుడిని తొలగించడాన్ని నిరసిస్తూ రెసిడెంట్ వైద్యులు శనివారం నిరవధిక సమ్మెకు దిగారు. 48 గంటల్లోనే వైద్యుడిని తొలగించడం అన్యాయమని, దీనిపై వైద్యుల సంఘాలు ఆగ్రహంతో ఉన్నాయని డాక్టర్లు పేర్కొన్నారు. అయితే డాక్టర్ల సమ్మెతో రోగులు, సహాయకులు, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల నుండి వచ్చేవారు, వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ‘నా తండ్రి చికిత్స కోసం నేను గురువారం సిమ్లా నుండి 125 కిలోమీటర్ల దూరంలో ఉన్న అని నుండి ఇక్కడికి వచ్చాను. కానీ సమ్మె కారణంగా వైద్యులు ఎవరూ అందుబాటులో లేరు. మేము అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నాము’ అని ఒక రోగితో పాటు వచ్చిన కృష్ణన్ సింగ్ ఠాకూర్ అన్నారు. ఇదిలా ఉండగా, సిమ్లా, ధర్మశాల, నహన్, హమీర్‌పూర్, ఉనా, అనేక ఇతర జిల్లాల నుండి సమ్మె కారణంగా వైద్య సేవలు నిలిచిపోయినట్లు నివేదికలు వచ్చాయి. ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ (ఐజిఎంసి), రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల రెసిడెంట్ వైద్యులు శుక్రవారం పెద్ద ఎత్తున సెలవుపై వెళ్లారు. శనివారం నుండి నిరవధిక సమ్మెను ప్రకటించిన రెసిడెంట్ డాక్టర్ల సంఘం, సమ్మె సమయంలో సాధారణ సేవలు, ఎలక్టివ్ ఆపరేషన్ థియేటర్లు, అవుట్ పేషెంట్ విభాగాలు (ఒపిడి) మూసివేయబడతాయని, అత్యవసర సేవలు మాత్రమే పనిచేస్తాయని పేర్కొంది. ‘అత్యవసర సేవలు పనిచేస్తున్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు సహా కన్సల్టెంట్లు ఇండోర్ రోగులకు, ఒపిటికి సేవలు అందిస్తున్నారు. అయితే, ప్రణాళికాబద్ధమైన శస్త్రచికిత్సలకు సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయి’ అని ఐజిఎంసి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ భాటియా శనివారం తెలిపారు. ఐజిఎంసి రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోహైల్ శర్మ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ విషయంపై విచారణ నిర్వహిస్తామని హామీ ఇచ్చారని, అయితే డాక్టర్ తొలగింపు వైద్య వర్గాలకు ప్రతికూల సందేశాన్ని పంపిందని, వారు అవమానంగా, అసురక్షితంగా భావిస్తున్నారని అన్నారు. ‘డాక్టర్ కావడానికి చాలా ప్రయత్నం, పరీక్షలు అవసరం, అతను కూడా ఒక మనిషి. దుష్ప్రవర్తన జరిగిందని మేము అంగీకరిస్తున్నాము, దీనికి డాక్టర్‌ను ఆరు గంటల్లో సస్పెండ్ చేశారు. కానీ క్రమశిక్షణా కమిటీ నివేదిక ఆధారంగా 48 గంటల్లోనే తొలగించడం సమర్థనీయం కాదు. తొలగింపు ఉత్తర్వులను రద్దు చేయడమే మా ఏకైక డిమాండ్’ అని ఆయన అన్నారు. రోగితో శారీరకంగా గొడవకు దిగారనే ఆరోపణలతో డాక్టర్ రాఘవ్ నరులా సేవలను బుధవారం హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం రద్దు చేసింది.

## బెంగాల్‌లో ‘సర్’ విచారణలు

- రాష్ట్రవ్యాప్తంగా 3,234 కేంద్రాల ముందు ప్రజల క్యూ



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) కింద విచారణలు జరుగుతున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 3,234 కేంద్రాల ముందు ప్రజలు క్యూ కట్టారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. 2002 నాటి ఓటర్ల జాబితాతో తమకు సంబంధాన్ని నిరూపించుకోలేని సుమారు 32 లక్షల మంది ‘మ్యాపింగ్ కాని’ ఓటర్లను మొదటి దశలో విచారణకు పిలుస్తామని ఆయన చెప్పారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన మొదటి దశ విచారణల కోసం మొత్తం 4,500 మంది మైక్రో అబ్జర్వర్‌లను నియమించారు. ఓటర్ల గుర్తింపు, చిరునామా రుజువుగా ఆధార్‌తో సహా 12 గుర్తింపు పొందిన పత్రాలలో దేనినైనా సమర్పించవచ్చని ఎన్నికల సంఘం అధికారి తెలిపారు. అయితే, ఆధార్ కార్డును కేవలం ఒకే పత్రంగా అంగీకరించబోమని ఆయన అన్నారు. 85 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు విచారణ శిబిరాలకు వ్యక్తిగతంగా రావాల్సిన అవసరం లేదని, ఎన్నికల సంఘం అధికారులు వారి నివాసాలలోనే ఈ ప్రక్రియను చేపడతారని ఆయన చెప్పారు. ‘ఈ విచారణ ప్రక్రియ 4,500 మందికి పైగా మైక్రో అబ్జర్వర్‌ల పర్యవేక్షణలో జరుగుతోంది. కేంద్రాలలోకి ఇఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, అబ్జర్వర్‌ల వంటి అధీకృత అధికారులను మాత్రమే అనుమతిస్తున్నారు. ప్రతి శిబిరం ముందు ప్రజలు పెద్ద సంఖ్యలో బారులు తీరారు’ అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (ఇసిఒ) కార్యాలయంలోని అధికారి తెలిపారు.సవరణ ప్రక్రియలో పారదర్శకత, కచ్చితత్వాన్ని నిర్ధారించే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకున్నందున, విచారణ కేంద్రాలను ఖరారు చేసిన తర్వాత ఎటువంటి మార్పులకు అనుమతి లేదు. ఎన్నికల సంఘం (ఇసి) డిసెంబర్ 16న ఎస్ఐఆర్ తర్వాత రాష్ట్ర ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించింది. మరణం, వలసలు, గణన ఫారాలను సమర్పించకపోవడం వంటి వివిధ కారణాల వల్ల 58 లక్షలకు పైగా ఓటర్ల పేర్లను తొలగించింది.



సిపిఐ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా కోల్‌కతాలో భారీ ర్యాలీ

## బిజెపి, ఆర్ఎస్ఎస్‌పై దిగ్విజయ్ ప్రశంసలు

కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి

ఆర్ఎస్ఎస్, బిజెపిల సంస్థాగత నిర్మాణం గురించి మాత్రమే చెప్పానని దిగ్విజయ్ వివరణ

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ ఎం పి దిగ్విజయ్ సింగ్ చేసిన సోషల్ మీడియా పోస్ట్ హస్తం పార్టీకి కొత్త తలనొప్పి తెచ్చి పెట్టింది. ప్ర ధాని నరేంద్ర మోదీ పాత ఫొటోను షేర్ చేస్తూ, బిజెపి, ఆర్ఎస్ఎస్ సంస్థాగత బలాన్ని ఆయన ప్ర శంసించడం రాజకీయ వర్గాల్లో పెను దుమారం రే పుతోంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) స మావేశం జరుగుతున్న సమయంలోనే దిగ్విజయ్ సింగ్ ఈ పోస్ట్ చేయడం మరింత ప్రాధాన్యతను సంతరించుకొన్నది. కాంగ్రెస్ సీనియర్ నేత అయిన దిగ్విజయ్ సింగ్ 1990ల నాటి ఓ అరుదైన ఫొ టోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అందులో బిజెపి దిగ్గజం ఎల్‌కె అద్వానీ కుర్చీలో కూ ర్చొని ఉండగా, ఆయన పాదాల చెంతలో నేలపై ఒక సామాన్య కార్యకర్తలా (నేటి ప్రధాని) నరేంద్ర మోదీ కూర్చొన్నారు. ఆ చిత్రం కింద దిగ్విజయ్ సింగ్ ఓ ఆసక్తికరమైన విషయం చెప్పారు. ‘ఒక సమాన్య ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్, జన్‌సంఘ్/బిజెపి కార్యకర్త నేల మీద కూర్చునే స్థాయి నుంచి దేశ ప్రధాని స్థాయికి ఎదిగారంటే, అది ఆ సంస్థ క్రమశిక్షణకు, బలానికి నిదర్శనం’ అని అన్నారు. తాను పెట్టిన ఈ పోస్టు గురించి తీవ్రస్థాయిలో దుమారం చెలరేగిన నేపథ్యంలో దిగ్విజయ్ సింగ్ తాజాగా దీనిపై స్పందించారు. ‘నేను కేవలం ఆర్ఎస్ఎస్, బిజెపిల సంస్థాగత నిర్మాణం గురించి మాత్రమే చెప్పాను. బిజెపి భావజాలాన్ని ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటాను అని స్పష్టం చేశారు.

## మా రాష్ట్ర వ్యవహారాల్లో జోక్యమొద్దు

❑ కేరళ సిఎం విజయన్‌కు కర్ణాటక డిప్యూటీ సిఎం డికె సలహా

**బెంగళూరు:** ఉత్తర బెంగళూరులో ఆక్రమణల తొలగింపు డ్రైవ్‌కు సంబంధించి కర్ణాటక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి కె శివకుమార్ కేరళ ముఖ్యమంత్రికి సలహా ఇచ్చారు. శుక్రవారం కర్ణాటక రాజధానిలో ముస్లిం నివాస ప్రాంతాలను కూల్చివేస్తున్నారనే వార్తలపై విజయన్ తీవ్రంగా విమర్శించారు. ఈ చర్యను దిగ్భ్రాంతికరం, బాధాకరం అని అభివర్ణించారు. తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో విజయన్ చాలా సంవత్సరాలుగా ముస్లిం కుటుంబాలు నివసిస్తున్న ఫకీర్ కాలనీ, వసీం లేఅవుట్‌లను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారనే వార్తలను ప్రస్తావించారు.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS03UA 3795 | Shivaratri Srinivas | MAHINRA BOLLERO MAXI TRUCK PLUS | 2014 |
| 2 | TS12UC 2493 | Shaik Bade Saleem | TATA LPK 909 FBT | 2012 |
| 3 | TS15EE 4967 | Ramesh Gollena | EICHER 380 | 2015 |
| 4 | TS16UA 5182 | Kantharao Peryala | SWARAJ 735FE | 2015 |
| 5 | TS09UA 8838 | Burra Sampath | MARUTHI RITZ DIESEL-P | 2016 |
| 6 | TS03E 0364 | Asari Anil | JOHN DEERE 5310 HARVESTER | 2018 |

AUCTION DATE: 30-12-2025

VENUE : SHRIRAM AUTOMALL KARIMNAGAR, ALUGUNURU, HYDERABAD ROAD, KARIMNAGAR

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

H.No :12-209/1,1st floor, Upstairs of Telangana Grameena Bank, Warangal Road, Huzurabad. Cell : 9866244432




## కంప్యూటర్లకు సరిహద్దులు!



కంప్యూటర్లు దశాబ్దాలుగా వేగం పెరగడం, మెమరీ విస్తరించడం ద్వారా అభివృద్ధి చెందాయి. కానీ భౌతికశాస్త్రం, గణితశాస్త్ర సిద్ధాంతాలు కంప్యూటర్లకు ఒక స్పష్టమైన సరిహద్దును చూపిస్తున్నాయి. కొన్ని క్వాంటం స్థితులు అంతగా సంక్లిష్టంగా విస్తరిస్తాయి కాబట్టి, వాటిని పూర్తిగా వర్ణించడానికి అవసరమైన క్లాసికల్ బిట్ల సంఖ్య అసాధ్యమైన స్థాయికి చేరుతుంది. అలాంటి స్థితులను సిమ్యులేట్ చేయడానికి, సిద్ధాంతపరంగా విశ్వంలో ఉన్న అణువుల సంఖ్యకంటే ఎక్కువ మెమరీ అవసరం అవుతుంది. ఎంత సమయం, ఎంత శక్తి ఉన్నా అది సాధ్యం కాదని ఈ పరిమితి సూచిస్తుంది. ఇది హైప్ లేదా ఊహ కాదు. కాంప్లెక్సిటీ సిద్ధాంతం ద్వారా గణితశాస్త్రవేత్తలు ఈ పరిమితులను కఠినంగా నిరూపించారు. ప్రయోగశాలల్లో కూడా చిన్న స్థాయిలో అయినా, నిజమైన క్వాంటం డివైస్‌లతో ఈ భావనను చూపించారు. క్వాంటం ఎంటాంగిల్‌మెంట్, ఇంటర్‌ఫెరెన్స్ వంటి ప్రభావాల వల్ల కొన్ని ప్యాటర్న్‌లు ఏర్పడతాయి. వాటిని ఎలాంటి షార్ట్‌కట్‌తోనూ క్లాసికల్‌గా కంప్రెస్ చేయలేం. ప్రతి కొత్త కణం వ్యవస్థలో చేరినప్పుడల్లా అవకాశాల సంఖ్య గుణాత్మకంగా పెరుగుతుంది. ఈ విస్తరణ క్లాసికల్ మెషిన్‌ల సామర్థ్యాన్ని దాటిపోతుంది, కానీ క్వాంటం సిస్టమ్‌లు వాటిని సహజంగానే నిర్వహిస్తాయి. ఈ అవగాహన ప్రాముఖ్యత కేవలం బ్రాగింగ్ రైట్స్ వరకే పరిమితం కాదు. క్లాసికల్‌గా సిమ్యులేట్ చేయలేని ఈ క్వాంటం స్థితులు కొత్త రకమైన పదార్థాల రూపకల్పనకు, ఖచ్చితమైన రసాయన మోడల్స్‌కు, అలాగే భద్రమైన కమ్యూనికేషన్ విధానాలకు దారి తీస్తాయి. క్వాంటం కంప్యూటర్లు అన్నింటినీ పరిష్కరించే సాధనాలు కావు... అవి ప్రత్యేకమైన సమస్యలపై మాత్రమే అద్భుతమైన ఆధిక్యతను చూపిస్తాయి. ఈ పరిమితులను అంగీకరించడమే పరిశోధకులను సరైన దిశలో దృష్టి కేంద్రీకరించడానికి సహాయపడుతుంది. కొన్ని సత్యాలు పూర్తిగా కొత్త ఆలోచనా విధానాలను కోరుకుంటాయి. సాధనాలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ, ఈ అరికట్టలేని క్వాంటం స్థితులు శాస్త్రీయ పురోగతికి మార్గనిర్దేశం చేస్తాయి. క్లాసికల్ ఆలోచన చేరలేని స్థలాల్లో కూడా విశ్వం ఓపికగా ఎదురుచూస్తోందని అవి గుర్తు చేస్తాయి.

ఈ మార్పులు విద్య, పరిశ్రమ, శాస్త్రంలో నమ్మకాన్ని కొత్తగా నిర్వచిస్తున్నాయి. పరిశోధక బృందాలు క్వాంటం యంత్రాలను బాధ్యతాయుతంగా నిర్మించడంపై, ఫలితాలను పారదర్శకంగా పంచుకోవడంపై దృష్టి పెడుతున్నాయి. విద్యార్థులను గణితం, భౌతికశాస్త్రం, ఇంజినీరింగ్‌లను కఠినత, ఆశ, కల్పనతో అన్వేషించమని ప్రోత్సహిస్తున్నాయి. పురోగతి ఒక్కసారిగా రాదు.. ప్రశ్నలు, ప్రయోగాలు, ఓపికతో అడుగుఅడుగుగా ముందుకు సాగుతుంది.

## ఇరువైపులా పదునుగల కత్తి ఎఐ



విద్యా రంగంలో కృత్రిమ మేధస్సు (ఎఐ) శక్తివంతమైన సాధనమే అయినప్పటికీ, దాని అనైతిక వినియోగం, ముఖ్యంగా చీటింగ్, డేటా దుర్వినియోగం, గోప్యత ఉల్లంఘనలు ఆందోళనకరంగా గోచరిస్తున్నది. విద్య యొక్క అసలైన లక్ష్యం జ్ఞానం, నైపుణ్యాలు, నైతిక విలువలు, భావోద్వేగ బలం కలిగిన వ్యక్తులను తయారు చేయడమే. కానీ పోటీ పరిగెత్తులో ఈ లక్ష్యం మరుగున పడిపోయి, విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఎఐ ఆవిర్భావం మానవ ప్రగతిలో ఒక కీలక మలుపు. ఇది పరిశ్రమలనే కాకుండా, భవిష్యత్ ఉద్యోగాల స్వరూపాన్నీ మారుస్తోంది. విద్యారంగంలో ఎఐ వినియోగం దీర్ఘకాలిక ప్రభావాలను చూపుతుంది. ఎఐ వల్ల కలిగే లాభాలను ప్రస్తావిస్తే, ప్రతి విద్యార్థి అభ్యాస శైలిని గుర్తించడం, నేర్చుకునే లోపాలను తెలుసుకోవడం, బలాలు–బలహీనతలను విశ్లేషించడం ద్వారా వ్యక్తిగతీకృత అభ్యాసం సాధ్యమవుతోంది. అలాగే, ఉపాధ్యాయుల రోజువారీ పరిపాలనా పనులు తగ్గి, బోధనపై ఎక్కువ సమయం కేటాయించేందుకు ఎఐ సహాయపడుతోంది. అయితే, ఇంటర్నెట్ ద్వారా సమాచారం సులభంగా లభించడం వల్ల స్వీయ అభ్యాసానికి అవకాశం ఉన్నా, నైతిక సమస్యలు కూడా ఉన్నాయి. ఆన్‌లైన్ పరీక్షల్లో ఎఐని చీటింగ్‌కు ఉపయోగిస్తున్న ఘటనలు ఉన్నాయి. అలాగే, పాఠశాలలు డేటా భద్రత, గోప్యత పరిరక్షణకు స్పష్టమైన నియమాలు ఖరారు చేయాల్సిన అవసరం ఉంది. ఎఐని సమర్థంగా వినియోగించాలంటే, ఉపాధ్యాయ శిక్షణ కీలకం. డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి పెట్టినప్పుడే, ఉపాధ్యాయులు ఎఐ పూర్తి సామర్థ్యాన్ని వినియోగించగలుగుతారు. సరైన ముందస్తు చర్యలు, విధానాలు, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెడితే ఎఐనిజంగా విద్యా రంగానికి ఫోర్స్ మల్టిప్లయర్‌గా మారుతుంది.



## పునర్వినియోగ రాకెట్లు!

ఇప్పటి అంతరిక్ష ప్రయోగాల్లో రాకెట్లను మళ్లీ మళ్లీ ఉపయోగించే సాంకేతికత ప్రధాన విప్లవంగా మారింది. గతంలో ఒకసారి ప్రయోగించిన రాకెట్‌ను మళ్లీ వాడడానికి వీలు ఉండేది కాదు. కానీ, ఇప్పుడు ఒకసారి ప్రయోగం తర్వాత రాకెట్ భూమిపైకి తిరిగి రావడంతోపాటు, మళ్లీ ఉపయోగించడానికి వీలుగా ఉంటుంది. ఈ అద్భుత ఆవిష్కరణ కారణంగా రాకెట్ ప్రయోగ ఖర్చు భారీగా తగ్గుతుంది. అంతరిక్ష ప్రయాణాలు మరింత వేగవంతంగా జరుగుతాయి. అంతేకాదు, ప్రయోగాల కాల వ్యవధి గణనీయంగా తగ్గుతుంది. ఉపగ్రహాలు, పరిశోధనా ప్రాజెక్టుల సంఖ్య పెరుగుతుంది. సాధారణ మానవుడు కూడా అంతరిక్షయానం చేసే రోజు వచ్చినా ఆశ్చర్యం లేదు. చైనా, రష్యా, అమెరికాతోపాటు ఐరోపా కూడా ఈ ప్రయోగాల్లో ముందంజ వేస్తున్నాయి.

— బిఎస్‌ఎస్ మైత్రేయి

## యమహో నగరి — హైదరాబాద్ పురి

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) భౌగోళిక పరిధి విస్తరణతో ప్రపంచంలోని మహానగరాల్లో చేరిపోయింది. ఔటర్ రింగ్ రోడ్డుకు లోపల ఉన్న 7 మున్సిపల్ కార్పొరేషన్‌లు, 20 మున్సిపాలిటీల విలీన ప్రక్రియ సజావుగా స్వల్పకాలంలోనే పూర్తికావటంతో జిహెచ్‌ఎంసి క్రిస్మస్‌రోజున అధికారికంగా బృహత్తరమైన జిహెచ్‌ఎంసిగా అవతరించింది. వేగంగా విస్తరిస్తున్న మహానగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు, అన్ని ప్రాంతాలకు సమాన స్థాయిలో సౌకర్యాలు కల్పించే ఉద్దేశ్యంతో ఈ విలీన–విస్తరణ కార్యక్రమం రూపొందించబడింది. ఈ ఖ్యాతి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుంది. రాజకీయంగా ఇది మాస్టర్ స్ట్రోక్. కొత్తగా విలీనమైన కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల ప్రాంతాల్లో దూరదృష్టితో కూడిన మాస్టర్ ప్రణాళికలతో సమతూక అభివృద్ధిని వేగవంతం చేసినపుడే ఈ చర్యకు పరిపూర్ణత. ఊహించటానికే కష్టతరమైనంత భౌగోళిక విస్తృతి సంతరించుకున్న కొత్త జిహెచ్‌ఎంసికి సమర్థవంతమైన పరిపాలన సవాలు కానుంది. భౌగోళిక విస్తీర్ణం 650 చదరపు కిలోమీటర్లనుంచి 2000 చ.కి.మీలకు పెరిగింది. జనాభా 1 కోటి 34లక్షలకుపైగా. పరిపాలనాపరంగా ఆరు జోన్‌లు, 30సర్కిళ్లు, 150 వార్డులు కలిగిన పాత జిహెచ్‌ఎంసి 12జోన్‌లు, 60సర్కిళ్లు, 300వార్డులుగా పునర్నిర్మాణం జరిగింది. దీనితో జిహెచ్‌ఎంసి విస్తీర్ణం, జనాభా రెండింటిరీత్యా భారతదేశం లో అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ అయింది. హైదరాబాద్‌కు ప్రధానమైన మెట్రోపాలిటన్ కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తామని గత టిఆర్‌ఎస్/బిఆర్‌ఎస్ ముఖ్యమంత్రి కెసిఆర్, ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనలు చేశారు. రేవంత్‌రెడ్డి మూసీనది ప్రక్షాళన, సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులు అందులో భాగమే. తెలంగాణాను మూడు భాగాలుచేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి దార్శనిక పత్రంలో (2047) ఒక భాగం ఈ మహా జిహెచ్‌ఎంసి (సియుఆర్‌ఇ–క్యూర్). ఒఆర్‌ఆర్ వెలుపల – ప్రభుత్వం ప్రతిపాదించిన రీజినల్ రింగ్‌రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్)కు మధ్య ప్రాంతం రెండవ అభివృద్ధి ప్రాంతం (పియుఆర్‌ఇ–ప్యూర్), ఆ వెలుపల వ్యవసాయాధారిత గ్రామీణాభివృద్ధి ప్రాంతం (ఆర్‌ఎఆర్‌ఇ–రేర్).

**ప్రజాపక్షం**
**28-12-2025, ఆదివారం**

దేశవ్యాప్తంగా పట్టణీకరణ పెరుగుతోంది. పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలుగా అనాదినుంచీ వర్థిల్లుతున్న ప్రాంతాలు మరీ వేగంగా విస్తరిస్తున్నాయి. నగర పరిసర ప్రాంతాలను, అభివృద్ధి కేంద్రాలను కలుపుతూ విలీనాలు, విస్తరణల రాజకీయ నిర్ణయాలు జరుగుతుంటాయి. అయితే వాటి సమతూక అభివృద్ధి, పౌర సౌకర్యాలు కల్పించటం రాజకీయ నిర్ణయమంత సులభం కాదు. వనరుల సమీకరణ, ప్రాధాన్యతల ప్రకారం కేటాయింపు, అంకితభావంతో పనిచేసే పాలక మండలి, అధికార యంత్రాంగం అవసరం. తెలంగాణా పరిపాలన వ్యవస్థను 33 జిల్లాలుగా ఏర్పరిచినపుడు హైదరాబాద్ జిల్లాను అలాగే ఉంచారు. పాలనా యంత్రాంగం ప్రజలకు చేరువలో ఉండాలంటే శాంతి–భద్రతల నిర్వహణకోసం మూడు పోలీసు కమిషనరేట్‌లు చేసినట్లు హైదరాబాద్ జిల్లాను కనీసం మూడు జిల్లాలు చేయాలని, అలాగే జిహెచ్‌ఎంసిని మూడు–నాలుగు కార్పొరేషన్‌లు చేస్తే బాగుంటుందని అప్పట్లో కొన్ని అభిప్రాయాలు వినిపించాయి. కాని ఇప్పుడు మహా జిహెచ్‌ఎంసితో మహా కేంద్రీకరణ జరిగింది. వచ్చే రెండు–మూడు దశాబ్దాల్లో జనాభా రెండు కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. మౌలిక వసతుల విస్తరణతో ప్రజలకు సంతృప్తికరమైన పురపాలన అందించటం ప్రభుత్వానికి పెద్ద సవాలు. ఈ కృషిలో ప్రభుత్వం విజయవంతం కావాలని ఆశించుదాం!

# అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సిపిఐ



పల్లబ్ సేన్ గుప్తా

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వార్షికోత్సవం దేశం లోపల వందేళ్ల పోరాటాలను స్మరించుకునే సందర్భం మాత్రమే కాదు; అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ ఉద్యమంతో దాని నిలకడైన, సూత్రబద్ధమైన సంబంధాన్ని జ్ఞప్తి చేసుకోవలసిన, పునరుద్ఘాటించాల్సిన సందర్భం కూడా. 1925లో పార్టీ ఏర్పాటైన నాటి నుంచి నేటివరకు, భారతదేశ విప్లవ పోరాటం సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ వ్యవస్థకు, దోపిడీకి వ్యతిరేకంగా, సోషలిజం, శాంతికోసం ప్రపంచవ్యాప్త పోరాటంతో విడదీయరాని సంబంధం కలిగిఉందని సిపిఐ అవగాహన చేసుకుంది.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వ్యాప్తంగా వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రతరమవుతున్న కాలంలో, 1925లో కాన్పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. సిపిఐ ఆరంభం నుంచీ కార్మికవర్గం అంతర్జాతీయతను ముఖ్యసూత్రంగా ఆమోదించింది. భారతదేశంలో బ్రిటీష్ వలసవాద పాలనకు వ్యతిరేకంగా పోరాటం కార్మికవర్గం, పీడిత ప్రజల నాయకత్వంలో ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న విస్తృత పోరాటంలో భాగమని అది గుర్తించింది.

సిపిఐ తన ప్రారంభ సంవత్సరాల్లో, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొమింటర్న్)తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉంది. మార్క్సిజం–లెనినిజంను అవగాహన చేసుకోవటంలో, వలస, అర్ధవలస సమాజాలను విశ్లేషించటంలో, భారతదేశ పరిస్థితులకు అనువైన వ్యూహాలను అభివృద్ధి పరుచుకోవటంలో భారతదేశ కమ్యూనిస్టులకు సహాయకారిగా కొమింటర్న్ ముఖ్యమైన పాత్ర నిర్వర్తించింది. సిపిఐ అంతర్జాతీయ అనుభవంనుంచి నేర్చుకుంటూనే, వలస దేశాల సమస్యలు, వ్యవసాయ పోరాటాలు, ఐక్యసంఘటన ఎత్తుగడలవంటి అంశాలపై చర్చలకు దోహదం చేసింది. ఆ విధంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సమష్టి అవగాహన పరిపుష్టం అయింది.

### అంతర్జాతీయ పార్టీ మహాసభల్లో...

సిపిఐ ఎల్లప్పుడూ సూత్రబద్ధ ప్రాతిపదికపై అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతను బలపరిచింది. కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల – చరిత్రాత్మక 12 పార్టీల మహాసభ(1957), 81 పార్టీల మహాసభ (1960)ల్లో అది నిర్వర్తించిన సకారాత్మక, నిర్మాణాత్మక పాత్రలో అది ప్రతిబింబించింది. నాటి సిపిఐ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అజయ్ ఘోష్ ఆ రెండు సమావేశాల్లోనూ డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యునిగా ముఖ్యమైన పాత్ర నిర్వర్తించారు. 1969లో మాస్కోలో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టు సమావేశంలో కూడా సిపిఐ పాల్గొన్నది. శాంతియుత సహజీవనం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం, సోషలిజం సాధనకు భిన్న మార్గాలను గుర్తించటంపై సమష్టి అవగాహన అభివృద్ధి పరచటంలో ఈ మహాసభలు, సమావేశాలు కీలకమైనవి.

ఈ వేదికల్లో, మార్క్సిజం–లెనినిజంను సిపిఐ దృఢంగా సమర్థించింది. అదే సమయంలో, జాతీయ ప్రత్యేకతలను గుర్తించాలని కూడా వాదించింది; సిద్ధాంతాన్ని నిర్దుష్టమైన పరిస్థితులకు సృజనాత్మకంగా అనువర్తింపజేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. భేదాభిప్రాయాలను అణచివేయకుండా ఐక్యతను పటిష్టవంతం చేయటం, సైద్ధాంతిక సమస్యలను ఒంటెత్తుపోకడ లేదా పిడివాదంతో కాకుండా కామ్రేడ్ తరహా వాదోపవాదాలద్వారా పరిష్కరించుకోవాలనే ధ్యేయం సిపిఐ జోక్యాలకు మార్గదర్శకంగా ఉండింది.

### 'మావోయిజం' పట్ల వ్యతిరేకత

సిపిఐ తన చరిత్ర పొడవునా, మార్క్సిజం–లెనినిజాన్ని ఒక సజీవమైన, అభివృద్ధి చెందుతున్న శాస్త్రంగా గట్టిగా సమర్థించింది. అది రివిజనిజం రూపాలన్నిటినీ, 'అతివాద దుందుడుకుతనాన్ని' అది వ్యతిరేకించింది. ఈ సందర్భంలో, ''మావోయిజం'' అని పిలబడుతున్న దానికి వ్యతిరేకంగా సిపిఐ స్పష్టమైన, సూత్రబద్ధ వైఖరి తీసుకుంది. దానిని మార్క్సిజం – లెనినిజంకు వక్రీకరణగా, కార్మిక వర్గం, విప్లవోద్యమ ప్రయోజనాలకు చేటుచేసే అపమార్గంగా పార్టీ గుర్తించింది. విప్లవ రాజకీయాలను ప్రజా ఉద్యమాలనుండి దూరమైన చెదురుమదురు సాయుధ చర్యలకు లేదా ఒంటెత్తుపోకడ పద్ధతులకు కుదించకూడదని సిపిఐ వాదించింది. అందుకు బదులుగా – మార్క్సిజం – లెనినిజం ప్రధాన సూత్రాలైన ప్రజాపోరాటం, ప్రజాస్వామిక అలయెన్స్‌లు, నిర్దుష్ట పరిస్థితుల గూర్చి కచ్చితమైన విశ్లేషణ ప్రాధాన్యతను అది వక్కాణించింది.

### జాతీయ విముక్తి ఉద్యమాలతో సంఘీభావం

సిపిఐ అంతర్జాతీయ పాత్రలో ప్రముఖ లక్షణం – జాతీయ విముక్తి ఉద్యమాలకు, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు అరమరికలులేని తోడ్పాటు. వలసవాదుల వర్ణవివక్ష, జాతివివక్ష, పీడనకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలతో – కార్మికవర్గ అంతర్జాతీయత మార్గదర్శకంగా అది క్రియాశీలకమైన సంఘీభావం తెలియజేసింది.

ఫ్రెంచివలసవాదులకు వ్యతిరేకంగా, ఆ తర్వాత అమెరికన్ సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా వియత్నాం ప్రజల వీరోచిత పోరాటాన్ని సిపిఐ గట్టిగా బలపరిచింది. భారతదేశంలోపల, అంతర్జాతీయంగా సంఘీభావం సమీకరించింది. జాతివివక్ష, వర్ణవివక్షకు వ్యతిరేకంగా ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్, దక్షిణాఫ్రికా ప్రజలు సాగించిన సుదీర్ఘకాల పోరాటంలో దృఢంగా వారిపక్షం వహించింది.

1971లో బంగ్లాదేశ్ ప్రజలు సాగించిన తమ విముక్తి పోరాట కాలంలో ఆ ప్రజలకు సంఘీభావం సమీకరించటంలో సిపిఐ కూడా




ముఖ్యమైన పాత్ర పోషించింది. వారి స్వయం నిర్ణయాధికార హక్కును, స్వాతంత్ర్య హక్కును గట్టిగా బలపరిచింది. అదేవిధంగా, జెరూసలెం తమ రాజధానిగా స్వతంత్ర రాజ్యంకోసం పాలస్తీనా ప్రజల న్యాయమైన పోరాటాన్ని సిపిఐ నిలకడగా బలపరిచింది. పాలస్తీనాతో ఈ సంఘీభావం నేటికీ కొనసాగుతున్నది. ఇజ్రాయెల్ ఆక్రమణను, దురాక్రమణ యుద్ధాన్ని, అంతర్జాతీయ చట్టం ఉల్లంఘనలను సిపిఐ ఖండిస్తున్నది, ఐక్యరాజ్యసమితి తీర్మానాల ప్రాతిపదికగా న్యాయమైన, శాశ్వత పరిష్కారాన్ని బలపరుస్తున్నది.

### సోవియట్ యూనియన్ పతనం తర్వాత

సోవియట్ యూనియన్, తూర్పుయూరప్‌లో సోషలిస్టు దేశాలు కూలిపోవటం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి తీవ్రమైన ఎదురుదెబ్బ. అది సైద్ధాంతికంగా గందరగోళానికి, నిరుత్సాహానికి దారితీసింది; ''చరిత్ర ముగిసింది'' అని సామ్రాజ్యవాద శక్తులు దూకుడుగా ప్రచారం చేశాయి.

ఈ కష్టకాలంలో, సిపిఐ మార్క్సిజం – లెనినిజంను విడనాడలేదు. అందుకు బదులుగా అది ఎదురుదెబ్బలకు దారితీసిన కారణాలపై గంభీరంగా, ఆత్మవిమర్శనా దృష్టితో విశ్లేషణ జరిపింది. ఆచరణలో వైఫల్యాలు – సోషలిస్టు భావాల శాశ్వత చెల్లుబాటు మధ్యగల తేడాలను వేరుపరచింది. సంక్షోభం మార్క్సిజం – లెనినిజానిది కాదని, దాన్ని అపసవ్యంగా అనువర్తింపజేయటం, సోషలిస్టు సూత్రాల నుంచి పక్కదారి పట్టటానిదని పేర్కొంటూ సిపిఐ మార్క్సిస్టు సిద్ధాంతంలో ఆత్మవిశ్వాసాన్ని పునరుద్ఘాటించింది.

ఈ సైద్ధాంతిక దృఢత్వం సిపిఐ సరికొత్త స్పష్టత, ఆత్మ విశ్వాసంతో జాతీయంగా, అంతర్జాతీయంగా తన కృషి కొనసాగించటానికి దోహద కారి అయ్యింది.

### కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీల అంతర్జాతీయ సమావేశం

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఐక్యతను పునర్నిర్మించే, పటిష్టంచేసే తన నిబద్ధతను వక్కాణిస్తూ సిపిఐ కమ్యూనిస్టు, వర్కర్స్‌పార్టీల అంతర్జాతీయ సమావేశం (ఐఎంసిడబ్ల్యుపి) ఏర్పాటుకు దారి తీసిన చొరవలను చురుకుగా బలపరిచింది. ఈ వేదికలో, దాని ఆరంభ దశల నుంచీ సిపిఐ సకారాత్మకంగా పాల్గొన్నది. సామ్రాజ్యవాదం, నయా ఉదారవాదం, శాంతి, ప్రజాస్వామ్యం, సోషలిజంపై చర్చలకు దోహదం చేసింది. ఈ నిబద్ధతకు ప్రాముఖ్యత గల వ్యక్తీకరణగా, సిపిఐ , సిపిఐ(ఎం) సంయుక్తంగా 2009లో న్యూఢిల్లీలో కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల అంతర్జాతీయ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చేందుకు చొరవ తీసుకున్నాయి. ప్రపంచం నలుమూలల నుంచీ పెద్దసంఖ్యలో పార్టీలు పాల్గొన్నాయి. సామ్రాజ్యవాదానికి, నయా ఉదారవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా సమష్టి స్వరాన్ని అది పటిష్టం చేసింది.

ఐఎంసిడబ్లుపిని సిపిఐ పూర్తిగా బలపరుస్తున్నది. అయితే భారతదేశ వాస్తవికతలు, తమ చారిత్రక అనుభవంతో రూపుదిద్దుకున్న తన సొంత, స్వతంత్ర అవగాహనతో అది ఆ సమావేశాల్లో ఎల్లప్పుడూ పాల్గొంటున్నది. చిత్తశుద్ధితో కూడిన అంతర్జాతీయ ఐక్యతకు ఆవశ్యకమైనటువంటి – పార్టీల మధ్య సమానత్వం, పరస్పర గౌరవం, అంతర్గత వ్యవహారాల్లో బేజోక్యం– సూత్రాలను అది బలపరుస్తున్నది.

### విస్తృత సంబంధాలు

పట్నా, పుదుచ్చేరి, కొల్లాం, చండీఘడ్‌లలో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లకు మినహా సిపిఐ కాంగ్రెస్‌లు (జాతీయ మహాసభ) అన్నింటికీ అనేక దేశాల కమ్యూనిస్టు పార్టీల నుంచి సౌహార్ద్ర ప్రతినిధిబృందాలు హాజరైనాయి. ఇది అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సిపిఐ స్థానానికి ప్రతిబింబం. అలాగే సిపిఐ కూడా సోదర కమ్యూనిస్టు పార్టీల మహాసభలకు ఆహ్వానం అందినపుడు హాజరవుతూ ఉంది. తద్వారా ద్వైపాక్షిక, బహుళపక్ష సంబంధాలు పటిష్టవంతమవుతున్నాయి. ఇవాళ సిపిఐకి 70కి పైగా కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలతో సౌహార్ద్ర సంబంధాలున్నాయి.

### భవిష్యత్‌కు సంకల్పం

సిపిఐ శతాబ్ది వత్సరం ముగింపు సందర్భంగా, దేశంలో పార్టీని మరింత పటిష్టవంతం చేయటానికి, కార్మికులు, కర్షకులు, యువత, మహిళలు, ఇతర పీడిత తరగతులందరితో సంబంధాలను పెంపొందించుకునేందుకు, మతోన్మాదం, నయా ఉదారవాదం, నిరంకుశపెత్తందారీతనాలకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేసేందుకు ప్రతినబూనుతోంది.

అదేసమయంలో, అంతర్జాతీయ సహకారం, సంఘీభావం పట్ల తన నిబద్ధతను సిపిఐ పునరుద్ఘాటిస్తున్నది. సామ్రాజ్యవాద యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలు, వాతావరణ విపత్తు, పెరుగుతున్న అసమానత నేడు మానవజాతి ఎదుర్కొంటున్న సవాళ్లు. అవి ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు, ప్రగతిశీల శక్తుల మధ్య బలమైన సహకారాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

భారత కమ్యూనిస్టుపార్టీ మార్క్సిజం–లెనినిజంలో ఆత్మవిశ్వాసంతో, కార్మికవర్గంలో నమ్మకంతో, కార్మికవర్గ అంతర్జాతీయత పట్ల నిబద్ధతతో రెండవ శతాబ్దకాలంలో ప్రవేశిస్తున్నది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం పునరుజ్జీవం, పురోగతికి, అలాగే సోషలిజం, మానవాళి విముక్తికై చారిత్రక పోరాటం కోసం మరింతగా దోహదం చేసేందుకు కృతనిశ్చయంతో ఉంది.

# జల రాజకీయాలు.. దూషణలు... ఆగేదెన్నడు?

రాజధాని సందడి – బొమ్మగాని కిరణ్‌కుమార్

గడిచిన వారం రోజులుగా రాష్ట్ర రాజకీయాలు నీళ్ళ రాజకీయాలతో భగ్గుమంటున్నాయి. గత ఆదివారం బిఆర్‌ఎస్ శాసనసభాపక్షం, కార్యవర్గ సమావేశం అనంతరం ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో నీటి రాజకీయాన్ని రాజేశారు. ఆ ప్రాజెక్టు 90శాతం పనులు తమ హయాంలోనే పూర్తి చేశామని, కానీ, రెండేళ్ళుగా కాలయాపన చేయడమే కాకుండా, ఇటీవల కేంద్రం నుంచి వెనక్కి వచ్చిన డిపిఆర్‌పై సమాధానం ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆలస్యం చేసిందని ఆరోపణలను సంధించారు. పైగా 90టిఎంసిల ప్రాజెక్టుకు 45 టిఎంసిల మేరకు అంగీకరించిందన్నారు. దీనిపై ఆ ప్రాజెక్టుతో లబ్ధి చేకూరే మూడు ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ సభలు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతామని ప్రకటన చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ, పనిలో పనిగా కెసిఆర్ తన సహజశైలిలో తోలు తీస్తానంటూ చేసిన వ్యాఖ్యలతో విమర్శ వ్యక్తిగత స్థాయికి చేరింది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలుత కాస్త గౌరవంగానే ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న కెసిఆర్ సోమవారం నుండి జరగబోయే శాసనసభ సమావేశాలకు వస్తే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై చర్చకు సిద్ధమేనని ఆహ్వానించారు. పైగా ఆయనను అగౌరవపరిచేలా ఎవరు మాట్లాకుండా చూస్తానని కూడా హామీ ఇచ్చారు. రెండేళ్లుగా రెండుసార్లు (అందులో ఒకసారి ప్రమాణస్వీకారానికి) మాత్రమే శాసనసభకు వచ్చిన ప్రతిపక్ష నాయకుడు కె.చంద్రశేఖర్‌రావును కవ్వించే విధంగా ఈవ్యాఖ్యలు ఉన్నాయి. మరోవైపు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కెసిఆర్ ఆరోపణలపై స్పందిస్తూ బిఆర్‌ఎస్ హయాంలో 90 శాతం పనులు పూర్తయిందే నిజమనుకుంటే, ఒక్క ఎకరానికి కూడా ఎందుకు నీళ్ళివ్వలేదని నిలదీశారు. కెసిఆర్ హయాంలోనే కేంద్రం డిపిఆర్‌ను వెనక్కి పంపిందని, గతంలోనే 45 శాతం టిఎంసికి అంగీకరించినట్లే తాము కూడా డిపిఆర్‌పై స్పందించినట్లు వివరణ ఇచ్చారు.

ఇదంతా ఒక ఎత్తైతే, మరోసారి తెలంగాణ రాజకీయ క్షేత్రంలో రాజకీయ విమర్శలు వ్యక్తిగత స్థాయికి చేరుకోవడం ఆందోళన కలిగించే అంశమే. కెసిఆర్ తిట్లను అస్త్రాలుగా సంధించడంపై మొదటి నుంచి ప్రత్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేసేవారు. ఉద్యమకాలంలోనే ఆయన ఆ భాష వాడారని బిఆర్‌ఎస్ నేతలు సమర్థించేవారు. అయితే, ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కూడా వ్యక్తిగత దూషణలకు పాల్పడిన సందర్భాలు ఉన్నాయి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు అలాంటివే. ఒక దశలో తెలంగాణ ప్రజలు వాటిని ఆస్వాదించిన రోజులు ఉన్నాయి. అలా మాట్లాడితేనే ప్రజలు స్వీకరిస్తారేమోనని విపక్షాలలో కొందరు నాయకులు ఆ బాటలోనే నడిచారు. ప్రతిపక్షంలో ఉండగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అలాగే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రస్తుత కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కూడా తీవ్ర పదజాలంలో దూషించిన ఘటనలు ఉన్నాయి. తాజాగా బిఆర్‌ఎస్ శిబిరం నుంచి వ్యక్తమైన భాషకు స్పందనగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం కొడంగల్‌లో అనియంత్రిత భాషలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై విపక్ష పార్టీ తీవ్రంగా స్పందిస్తుంది. నిజానికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన తరువాత మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావులు ఆయనను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శలు చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో కట్టుతప్పుతున్నాయి కూడా. ఈ దూషణల రణగొణ ధ్వనుల మధ్య అసలు విషయం పక్కకు పోయి మాటలు మిగిలిపోతున్నాయి.

రాజకీయ నాయకుల నుంచి వచ్చిన తిట్ల భాషనే యూట్యూబర్‌లు సైతం స్థిరీకరించుకొని సామాన్య భాషగానే వాడేస్తున్నారు. నేరుగా నాయకులను లైవ్‌లో తిట్టే సంస్కృతి తెలుగునాట సోషల్ మీడియాలో ప్రబలి వికృత రూపం దాల్చింది. ఎంత తిడితే అంత పేరొస్తుందనే భ్రమలో కొందరు తెలిసీ తెలియని వారు కూడా ఆ భాషనే అందుకొని కేసుల బారిన పడడం చూశాం. ఆదర్శంగా నిలవాల్సిన నేతగణం ఇలాంటి భాషను ఉపయోగించడం చూసి భావితరం కూడా అదే ప్రామాణికంగా భావించే దుస్థితి ఏర్పడింది.

ఒకప్పుడు ప్రత్యర్థి పార్టీల వారినైనా సరే అధికారంలో ఉండే నాయకులు అత్యంత గౌరవప్రదంగా, బహువచనంలో సంబోధించే సంప్రదాయం ఉండేది. కానీ, ఇప్పుడా పరిస్థితి లేకుండా పోవడం పట్ల విజ్ఞులు ఆవేద న చెందుతున్నారు. ఈ భాష కారణంగా నాయకులు పరస్పరం తారసపడినా చూసుకునే పరిస్థితి లేదు. ఇది సమాజానికి మంచిది కాదు.

### నీటి కయ్యాలు తీరేదెన్నడో?

ఇక నీటి జగడాల విషయానికి వస్తే, ఒకటి పొరుగు రాష్ట్రాలతో వాటా పంపిణీపై పోరాటం, మరొకటి ఘనత దక్కించుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పోరాటం. విచిత్రమేమిటంటే 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఐదేళ్ళ కాలంలో ప్రాజెక్టులను పూర్తి చేసేలా జలయజ్ఞం కార్యక్రమాన్ని చేపట్టారు. కానీ, అందులో చాలా ప్రాజెక్టులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇందుకు ప్రధాన కారణం, ఎవరు అధికారంలో ఉన్నా, వారి స్వీయచిత్తం ప్రకారం ప్రాజెక్టుల రూపురేఖలు మార్చుకుంటూ, రీఇంజినీరింగ్ పేరుతో మార్పులు చేస్తూ పోయారు. అలాగే, ఎవరిష్టమొచ్చినట్లు వారు ప్రాధాన్యతలు నిర్ణయించుకున్నారు. ఫలితంగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా కెసిఆర్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు వారి పదేళ్ళ కాలంలో పూర్తి కాలేదు. పూర్తయిన కాళేశ్వరం కూడా నీటి ప్రవాహాన్ని తట్టుకొని నిలబడలేకపోయింది. మరొకవైపు కృష్ణా జలాలపై ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయి. పాలమూరు – రంగారెడ్డి వంటి ప్రాజెక్టును పూర్తికాకముందే అప్పటి ఎన్నికలకు ముందు ప్రారంభించేసి మమా అనిపించారు. ఇవన్నీ పరిశీలిస్తే, ప్రాజెక్టుల రూపకల్పన, ప్రాధాన్యతా క్రమంలో చేపట్టే విషయంలో ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లకపోవడమనేది ఒక ప్రధాన కారణం. రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా ప్రాజెక్టులపై ఇరిగేషన్ ఇంజనీర్లు, నిపుణులతో వర్క్‌షాప్ నిర్వహించి, కావాల్సిన సమగ్ర ప్రణాళికను రూపకల్పన చేయాలి. దానిని రాజకీయ పార్టీలతో చర్చించి ఏకాభిప్రాయాన్ని సాధించి, ఎవరు అధికారంలో ఉన్నా కొనసాగించే విధంగా సంకల్పించాలి. అప్పుడే సమష్టి నిర్ణయాలతో పూర్తవడమే కాకుండా, పొరుగు రాష్ట్రాలతో జలజగడాల విషయంలో కూడా ఏకతాటిపై నిలిచే అవకాశం ఉంటుంది. అలా కాకుండా, నీటి ప్రాజెక్టుల అంశంలో రాజకీయాలు చూస్తే, ప్రజలను భ్రమలలో పెట్టి కాలక్షేపం చేస్తున్నట్లే లెక్క. పరస్పర విమర్శలు చేసుకునేందుకు ఇరు పక్షాలకు అవసరమైనన్ని లెక్కలు, అందులో బొక్కలు సిద్ధంగా ఉంటాయి. వాటిపై ఆరోపణలు చేసుకోవడం ద్వారా సమయం వృథానే తప్ప ప్రయోజనం శూన్యమే. ఇప్పటికైనా ఆ దిశగా సోమవారం నుంచి ప్రారంభమయ్యే శాసనసభ శీతాకాల సమావేశాలలో చర్చలు జరిగి, రాష్ట్ర నీటి ప్రయోజనాలే పరమావధిగా చర్చలు జరిగి ఏకాభిప్రాయం సాధించాల్సి న అవసరం ఉంది. అలాగే నాయకుల భాషకు సంబంధించి కూడా తామంతట తామే లక్ష్మణరేఖ గీసుకుంటే సమాజానికి మంచిదే గాక, రాజకీయాలపై గౌరవం పెరుగుతుంది.

## పేద కుటుంబాలకు అండ డాక్టర్ సంపత్‌కుమార్



**ప్రజాపక్షం/తాండూరు:** పేద కుటుంబాలకు బీవిజి పౌండేషన్ వ్యవస్థాపకులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్ అండగా నిలుస్తున్నారు. కుటుంబ పెద్దను కోల్పోయి శోక సంద్రంలో ఉన్న నిరుపేద కుటుంబానికి ఆపద సమయంలో ఆర్థికంగా ఆదుకోని అండగా నిలిచారు. తాండూరు మున్సిపల్ పరిధి 8వ వార్డు ఇందిరమ్మ కాలనికి చెందిన గురువయ్య స్వామి గద్వాల సుశీలమ్మ అకాల మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న డాక్టర్ సంపత్‌కుమార్ వెంటనే స్పందించిన వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించి ప్రగాఢ సానుభూతి తెలియచేయడంతో పాటు అంత్యక్రియల నిమిత్తం వీరశైవ సమాజం సభ్యులు గూలి పరమేశ్వర్, అల్లమ్ సంతోష్‌కుమార్, శ్రీకాంత్ ద్వారా డాక్టర్ సంపత్‌కుమార్ ఆర్థిక సహాయం అందజేశారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్ అన్నారు. శనివారం అలియాబాద్ గ్రామానికి చెందిన వైల ఎల్లయ్యకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ద్వార మంజూరైన రూ.30 వేల చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరు సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్పవరంగా మారిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కమఠం కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నాటకారి బాబు, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ స్వప్న రమేష్

**ప్రజాపక్షం/బంట్వారం :** బంట్వారం మండల పరిధిలో ఉన్న మంగ్రాస్‌పల్లి గ్రామం నూతన పంచాయతీగా ఏర్పడడంతో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీకి ఎస్సీ మహిళ అభ్యర్థికి కేటాయించడంతో అక్కడ స్వంత్ర్య అభ్యర్థిగా బరిలో నిలిచి స్వప్న రమేష్ విజయం సాధించారు. గ్రామాభివృద్ధిని దృషిలో ఉంచుకోని మంగ్రాస్‌పల్లి స్వతంత్ర్య అభ్యర్థిగా సర్పంచుగా గెలుపోందిన స్వప్న రమేష్ శనివారం తెలంగాణ శాసన సభ స్పికర్, వికారాబాద్ శాసన సభ సభ్యులు గడ్డం ప్రసాద్ కూమార్ ను మర్యద పూర్వకంగా కలసి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే మాత్రమే రాజాకీయాలు గ్రామాలను అభివద్ధి పరిచేందుకు రాజాకీయాలకు అతీతంగా కలసి కట్టుగా గ్రామాలను అభివద్ధి చేసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులకు అన్ని విధాలుగా ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, నూతన పంచాయతీలకు అవసరమైన నిధులు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కోన్నారు. అర్హులైన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిచాలని తెలిపారు. గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దె విధంగా గ్రామ సర్పంచులు పని చేయాలన్నారు. ఈ కార్యకరమంలో నూతన పాలకవర్గ సభ్యులు ప్రజా ప్రతినిధులు నాయకులు గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

## తల్లిదండ్రులను గౌరవించడమే నిజమైన సంస్కారం



**కూకట్‌పల్లి/ప్రజాపక్షం :** తల్లిదండ్రులను గౌరవిస్తూ, వారిని మన సొంత పిల్లల మాదిరిగా చూసుకోవాలని, రాబోయే తరాలకు మనమే ఆదర్శంగా నిలవాలని సీనియర్ జర్నలిస్ట్ రాహుల్ ప్రదీప్ అన్నారు. కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలో తమ తల్లిదండ్రులు దాసరి శ్రీనివాసరావు ప్రసన్నల జ్ఞాపకార్థం ప్రతి శనివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమం నేటితో 28వ వారానికి చేరుకుందని తెలిపారు. అమ్మానాన్నల పేరుతో ప్రతివారం దాదాపు వెయ్యి మందికి అన్నదానం చేస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులే మనకు ప్రత్యక్ష దైవమని, వారికి ఎలాంటి కష్టం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. ఈ అన్నదాన కార్యక్రమం ద్వారా మానవత్వం, సేవాభావం, కుటుంబ విలువలు బలపడుతున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## విధుల్లో ఉన్న ఆపరేటర్ ప్రమాదవశాత్తు మృతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కంపెనీలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సాయిలు తెలిపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలోని కుషాయిగూడ పారిశ్రామికవాడలోని వెట్ ఇండియా ఫార్మాస్యూటికల్ కంపెనీలో మాన్యుఫాక్చర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కుషాయిగూడ హనుమాన్‌నగర్‌కు చెందిన నల్ల వెంకటరావు(51)ప్రతి రోజు విధుల్లో భాగంగా శనివారం ఉదయం మిషన్ ఆపరేటింగ్ చేస్తుండగా కళ్లు తిరిగి పడిపోయాడు. మిషన్‌కు ఉన్న రాడ్ తగిలి మృతి చెందాడని పోలీసులు తెలిపారు.



## చమ్‌కౌర్ అమరవీరులకు నివాళులు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** చమ్‌కౌర్ యుద్ధ అమరవీరులు బాబా అజిత్ సింగ్ జీ, బాబా జుజార్ సింగ్‌జీ, బాబా జోరవర్ సింగ్‌జీ, బాబా ఫతే సింగ్‌జీ ఈ డబ్ల్యూస్ కాలనీ చౌరస్తాలో అమరవీరుల చిత్రపటానికి స్థానిక సిక్కులు పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. బాదంపాలు, అరటి పండ్లు, నీళ్ళ బాటిళ్లను నందం గణేష్ బాబు ఆధ్వర్యంలో ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్ గౌడ్, బిజెపి అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముల్లి జంగయ్య యాదవ్, బిజెపి మేడ్చల్ జిల్లా కార్యదర్శి విప్పుల హనుమాన్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, కొమ్మిడి శివప్రదీప్ రెడ్డి, జెఎసి నాయకులు బచ్చు నాగేష్ గుప్త, బర్ల దేవేందర్ ముదిరాజ్, సిక్కుల కుల సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ అయ్యప్పస్వామి ఆలయ 34వ వార్షికోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో 34వ వార్షికోత్సవ మండల పూజ సందర్భంగా శనివారం రెండవ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వద్దేపల్లి రాజేశ్వరరావు, యామిని దంపతులచే మహాన్యాస పారాయణము, అయ్యప్ప స్వామివారికి శత రుద్రాభిషేకం, వాస్తు పూజ, వాస్తు హోమాలు, వాస్తు బలి వంటి విశేష పూజా కార్యక్రమాలు వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆలయ పరిసరాలు ఆధ్మాత్మిక వాతావరణంతో నిండిపోయాయి. అనంతరం ఆలయ చైర్మన్ వద్దేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన శ్రీ అయ్యప్పస్వామి ఉత్సవమూర్తికి ఏనుగు అంబారిపై కూకట్‌పల్లి గ్రామ పురవీధులలో ఘనంగా ఊరేగింపు మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 31వ తేదీన జరగనున్న పడిపూజలో ప్రజలందరూ కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# జిహెచ్‌ఎంసి సర్కిల్ కొత్త డిసిల బాధ్యతల స్వీకారం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిహెచ్‌ఎంసి గ్రేటర్ విస్తరణలో భాగంగా పరిపాలనా సౌలభ్యం కోసం మేడ్చల్ జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయాలకు డిప్యూటీ కమిషనర్లుగా నియమించారు. ఉప్పల్ సర్కిల్ కార్యాలయ డిసి రాజు, కూకట్‌పల్లి డిసి బి.గంగాధర్, గాజులరామారం డిసి వి నరసింహ, బోడుప్పల్ డిసి ఎ.శైలజ, దుండిగల్ డిసి ఎన్. వెంకటేశ్వరనాయక్, నిజాంపేట డిసి ఎండి శాబిర్ అలీ, కొంపల్లి డిసిగా ఎన్ కృష్ణారెడ్డిలు అదే స్థానంలో కొనసాగనున్నారు.





పోచారం విధులు నిర్వహిస్తున్న ఎస్. నిత్యానంద్‌ను నాచారం డిసిగా, జవహర్‌నగర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎన్. వసంతను కీసర డిసిగా, జాయింట్ కమిషనర్ సానిటేషన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్. సుదాంశ్‌ను మేడ్చల్ డిసిగా, ఎల్‌బినగర్ డిసిగా ఉన్న బి.గోపాలరావును మౌలాలి డిసి గా, గోషామహల్ పిఒగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీహరిని కాప్రా డిసిగా, సానిటేషన్ విభాగ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న తిప్పర్తి యాదయ్యను ఆల్వాల్ డిసిగా నియమితులయ్యారు.

**ఆల్వాల్, కాప్రా డిసిలుగా ...**

ఆల్వాల్ డిసిగా నియమితులైన తిప్పర్తి యాదయ్య శనివారం ఆల్వాల్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకొన్నారు..ఏఐటియుసి మున్సిపల్ యూనియన్ నుండి రాష్ట్ర మున్సిపల్ సంఘం అధ్యక్షుడు కె.రవిచంద్రన్, జిల్లా అధ్యక్షులు హరినాథరావు, జిల్లా మున్సిపల్ సంఘ కార్యదర్శి బిఐ శ్రీనివాస్, ఏఐటియుసి వంగాల శ్రీనివాస్, డిప్యూటి కార్యదర్శి మహేందర్, వర్కింగ్ ప్రసిడెంట్ డిఎన్ శేఖర్, ఆల్వాల్ సర్కిల్ అధ్యక్షుడు కౌసర్, ఆల్వాల్ మున్సిపల్ సంఘ డిప్యూటి సెక్రటరీ నరేందర్, జిల్లా నాయకుడు జె. తిరుపతి, కె శ్రీనివాసరావు తదితరులు నూతన డిసిని కల్సి అభినందనలు తెలిపారు.

**కాప్రా డిసిగా శ్రీహరి బాధ్యతల స్వీకరణ**

నూతనంగా కాప్రా సర్కిల్ డిసిగా నియమితులైన పి. శ్రీహరి శనివారం బాధ్యతలు శనివారం స్వీకరించారు. అనంతరం ఆయన సర్కిల్ అధికారులతో ముచ్చటించి సర్కిల్ పరిధిలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తూ ప్రసా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

జిహెచ్‌ఎంసి నూతన సర్కిల్‌గా ఏర్పడిన ఘట్‌కేసర్ కార్యాలయ డిసిగా ఇప్పటి వరకు ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పంజాల రాజేష్, కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా నూతనంగా ఏర్పాటైన బోడుప్పల్ సర్కిల్ కార్యాలయ డిసిగా ఎ.శైలజ శనివారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యాయానికి సంబంధించిన 4 డివిజన్లకు అసిస్టెంట్ కమిషనర్లు నియమితులు కానున్నారన్నారు. త్వరలో పరిపాలనా విధి విధానాలు పూర్తవుతాయని, ప్రజాభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తానన్నారు.

**ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా వాణి**

జిహెచ్‌ఎంసి పరిధిలోని ఉప్పల్ జోన్‌కు సంబంధించి నూతనంగా ఏర్పాటైన ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా వాణి శనివారం ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన పంజాల రాజేష్, కార్యాలయ సిబ్బంది నూతన బాధ్యతలు చేపట్టిన సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణికి స్వాగతం పలుకుతూ పూల బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.




**కీసర డిప్యూటీ కమిషనర్‌గా వసంత పదవీ బాధ్యతలు**

**నాగారం:** కీసర సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా వసంత నియమితులయ్యారు. శనివారం ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిసిని అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండి పాలన అందించడమే తన ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె అన్నారు.



## ప్రత్యేక చొరవ చూపి పనిచేస్తేనే సంతృప్తిని కలిగిస్తుంది : ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపి పనిచేయడం వల్ల ఎంతో సంతృప్తిని కలిగిస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ రాష్ట ఎన్నికల కార్యదర్శిగా బదిలీపై వెళ్తున్న సందర్భంగా రెవెన్యూ, వివిద శాఖల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలలో భాగంగా ప్రజలకు అంకిత భావంతో సేవలందించాలన్నారు. బదిలీపై వెళ్తున్న లింగ్యానాయక్ రెవెన్యూ సమస్యల పరిష్కారంలోప్రత్యేక చొరవ చూపారని కలెక్టర్ తెలిపారు. ప్రతి సమస్యను క్షణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కరించడంలో తన వంతు కృషి ఎంతో ఉందని అన్నారు. బదిలీపై వెళ్లున్న అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో పనిచేయడం వల్ల మంచి అనుభూతిని పొందానన్నారు. జిల్లాలోని నాయకులు, ప్రజలు తమ సహాయ సహకారాలు అందించడం వల్ల ఉద్యోగ ధర్మాన్ని కూడా ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహించగలిగానని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డిఆర్ఒ మంగీలాల్, జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్, కమలాకర్‌రెడ్డి, వివిధ సిబ్బంది, పాల్గొన్నారు.

**కోట్‌పల్లి ఆయకట్టు రైతులకు ప్రభుత్వం పంట సెలవు**

కోట్‌పల్లి ఆయకట్టు రైతులకు ప్రభుత్వం పంట సెలవు దినంగా ప్రకటించిందనిజిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. 1967లో స్థాపించబడిన కోట్‌పల్లి ప్రాజెక్టు సంవత్సరాలుగా చిన్న చిన్న మరమ్మత్తులు , నిర్మాణ పనులు చేయడం జరిగింది కాని ఆధునీకరించబడలేదన్నారు. ఆధునీకరణ పనులు కాంక్రీట్ సిమెంట్ లైనింగ్, గైడ్ వాల్స్ నిర్మాణం నిర్మాణాల బలోపేతం అవసరం ఉందని తెలిపారు. 2025–26 రబీ సీజన్‌లో కూడి కాలువ, ప్రాజెక్టు ఆధునికీరణపనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కూడికాలువలో 24కిలోమీటర్ల పొడుగునా ఆధునీకరణ పనులు జరుగుతాయన్నారు. 2025–26 యాసంగి సీజన్ కోసం వరి పంట సాగును నిలిపివేయాలని రైతులను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అభ్యర్థించారు.

## అసౌకర్యం కలుగకుండా పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే మర్రి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూస్తూ పనులు పూర్తి చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సూచించారు. శనివారం వేర్వేరు గా తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆర్‌కె పురం ఫ్లైఓవర్ నిర్మాణ పనులు, సత్తిరెడ్డి కాలనీ డ్రైనేజి పైప్‌లైన్ అవుట్‌లెట్ నిర్మాణ పనుల విషయమై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్‌కె పురం ఫ్లైఓవర్ నిర్మాణంతో ఇళ్లు, దుకాణాలు కోల్పోయే స్థితిలో ఉన్న పల్లవి విల్లా అపార్ట్‌మెంట్ నివాసితులకు నష్టం వాటిల్లకుండా చూడాలని, ప్రజా ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ఫ్లైఓవర్ డిజైన్ ఉండాలన్నారు. ఆర్‌కె పురం ఫ్లైఓవర్ నిర్మాణా న్ని ఆర్‌కె పురం ఆర్మీ స్కూల్ నుండి మిలిటరీ హాస్పిటల్ సమీపం ఆర్మీ భూమిలో రోడ్డు వెడల్పు చేసి పొడిగించే అంశంపై అన్ని కోణాల్లో సవివరంగా పరిశీలించాల ని అధికారులను ఆదేశించారు. దీర్ఘ కాలిక ప్రయోజనాలు చేకూరేలా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సత్తిరెడ్డి కాలనీ నుండి వయా ఇందిరానగర్ మీదుగా లాలాపేట నాల వరకు ప్రతిపాదన 600 మిమి దయా పైప్‌లైన్ అవుట్‌లెట్ నిర్మాణం రోడ్డు ఎత్తు పెరగకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఈ విషయమై డిప్యూటి మేయర్, తార్నాక కార్పొరేటర్ శోభన్‌రెడ్డిని సంప్రదించి శాశ్వత పరిష్కార దిశగా ముందుకెళ్లారన్నారు. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి సర్కిల్ అధికారులు డిఇ లౌక్య, ఎఇ సత్యలక్ష్మి, టౌన్ ప్లానింగ్ అధికారులు విబి శ్రీనివాస్, జిహెచ్‌ఎంసి ప్రాజెక్టు అధికారులు ఎఇ ప్రశాంత్, బిఆర్‌ఎస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యార్థులు శ్రద్ధతో చదివి తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామని దాతలు బెజగం ఆనందరావు, చింతల శ్రీనివాస్‌రెడ్డి, బరెంకబావి రవీందర్‌రెడ్డి, సింగం రామారావులు అన్నారు. శనివారం జిహెచ్‌ఎంసి పరిధిలోని దేవరయాంజాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జడ్పిహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలేష్, కల్యాణిల అధ్యక్షతన ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సముద్రాల లక్ష్మయ్య జ్ఞాపకార్థం దాతలు బహుమతులను అందజేశారు.

అనంతరం దాతలు బెజగం ఆనందరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టిఏ మెంబర్ జైపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాలేష్, కల్యాణి, పాఠశాల చైర్మన్ కట్ట మీనాకుమారి, గ్రామస్థుల్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## విద్యా సదస్సుకు పెద్ద ఎత్తున విద్యాభిమానులు

### టిఎస్‌యుటిఎఫ్ మండల అధ్యక్షుడు తిరుమలేష్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రాష్ట్ర విద్యా సదస్సును ఉపాధ్యాయులు, విద్యాభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని టిస్‌యుటిఎఫ్ శామీర్‌పేట మండల అధ్యక్షుడు తిరుమలేష్ పిలుపు నిచ్చారు. శనివారం జడ్పిహెచ్‌ఎస్ తూంకుంటలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు మాంగళ్య ఫంక్షన్ హాల్ హైద్రాబాద్ రోడ్డు జనగామ జిల్లాలో 28, 29న నిర్వహించతలపెట్టిన ఉపాధ్యాయుల మహాప్రదర్శనలో భాగంగా రాష్ట్ర విద్యా సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, వనజ, శ్రీనివాస్‌రెడ్డి, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## నట్టల నివారణ మందులు తప్పక వేయాలి

### ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను తప్పక వేయించాలని నట్టల నివారణ మందులను వాడటం వలన జీవాల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ అన్నారు. శనివారం అలియాబాద్ మున్సిపాలిటీ తుర్కపల్లిలో గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం ఆధ్వర్యంలో మొదటి విడత నట్టల నివారణ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్, మేకలు, గొర్రెల పెంపకం దారుల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎక్కాల దేవి కొమురయ్యలు మాట్లాడుతూ గొర్రెలకు, మేకలకు ప్రతి సంవత్సరంలో నాలుగుసార్లు నట్టల నివారణ మందులను వేయించాలని చెప్పారు. నట్టల నివారణ మందులు వేయడం వలన పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. జీవాలు బరువు కూడ పెరుగుతాయని చెప్పారు. మరణాల రేటు తగ్గుతుందని అన్నారు. అనంతరం పశు వైద్యాధికారి బిక్యానాయక్ మాట్లాడుతూ జీవాల పెంపకం దారులకు జీవాలకు వచ్చే రోగాలు, వాటి నివారణకు వాడే మందులపై అవగాహన కల్పించారు. పశువైద్యాధికారులు డాక్టర్ భాస్కర్, బసవరాజు, జగదీశ్వరి, గ్రామ జనరల్ సెక్రటరి చీరల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు వెంకటేశం, రాజు, నర్సింలు, మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను పూర్తి చేయాలి




**ప్రజాపక్షం/వికారాబాద్ :** పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్ పట్టణంలో పర్యటించారు. ముందుగా పాంకేత్ నగర్‌లో నిరుపయోగంగా మరిన జిమ్ పార్క్‌ను మరమ్మత్తులు చేసి వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలని అధికారులను కోరారు. జిల్లా ప్రభుత్వం ఆసుపత్రుల పరస్థితి దారుణంగా ఉంది అని అన్నారు. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి మంజురైన సెంట్రల్ డ్రక్స్ స్టార్, దయాలసిస్ సెంటర్, దయాగ్నొస్టిక్స్ సెంటర్, బ్లడ్ బ్యాంక్, ఫ్రిడ్జ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవసరమైన పరికరాలు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ వసతులులేక పేషెంట్లు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వస్తుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంద్ ఉన్న సమయంలో మంజూరు చేయించిన జనరేటర్ కాంగ్రెస్ ప్రభుత్వం 2సంవత్సరాలు అయినా ఇప్పటి వరకు రాలేదు అని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో 'అమ్మ ఒడి' పథకం ద్వారా ఒక్క రూపాయి ఖర్చులేకుండా గర్భవతుల, బాలింతల సంరక్షణ కోసం ప్రభుత్వ వాహనాలు పెట్టి ఇంటినుండి ఆసుపత్రికి వచ్చి, అవసరమైన అన్ని పరీక్షలు ఉచితంగా చేసి తిరిగివారిని ఇంటి దగ్గర దింపేది. కెసిఆర్ న్యూట్రిషన్ కిట్, తల్లి బిడ్డ సంరక్షణ కోసం కెసిఆర్ కిట్ అందించి వారి ఆరోగ్యం మీద దృష్టి సారించాలని అన్నారు.. అనంతరం బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.

## మౌలాలి సర్కిల్ కార్యాలయం ఏర్పాటు హర్షదాయకం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మహా గ్రేటర్‌గా విస్తరించిన జిహెచ్‌ఎంసి పునర్విభజనలో భాగంగా నూతనంగా మౌలాలి సర్కిల్‌ను ఏర్పాటు చేయటం హర్షించదగిందని, ప్రజాభివృద్ధి పనులకు ఉపయోగకరంగా ఉంటుందని మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీతా శేఖర్ యాదవ్ అన్నారు. వినాయకనగర్, బలరాంనగర్, కాకతీయనగర్, నేరేడ్‌మెట్, మౌలాలి డివిజన్లతో కలిపి జిహెచ్‌ఎంసి మౌలాలి సర్కిల్ కార్యాలయం అనుకూలంగా ఉంటుందన్నారు.

## రాజీవ్ కాలనీలో పోలీసుల తనిఖీలు

* బెల్టు షాపులపై దాడులు
* 153మద్యం సీసాల స్వాధీనం

**ప్రజాపక్షం/తాండూరు:** పట్టణ శివారులోని రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో యాలాల పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అయితే ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ కాలనీలో బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు చేపడుతున్నారన్న ఆరోణలు ఉన్నాయి. దీనిపై స్పందించిన పోలీసులు అక్రమంగా మద్యం విక్రహిస్తున్న బెల్టు షాపులపై దాడులు చేసిన పోలీసులు 153 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గత రెండు రోజుల క్రితం మద్యం మత్తులో యువకుల వీరంతో మరో వ్యక్తి కత్తిపోట్లతో బలైన విషయం తెలిసిందే. దీంతో కాలనీ వాసు లు సైతం విచ్చల విడిగా మద్యం, గంజాయి విక్రయాలు సాగుతున్నాయని, వీటిని అరికట్టాలని పోలీసులకు విన్నవించుకున్న విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి ఆధ్వర్యాన శనివారం తాండూరు పట్టణ శివారులోని రాజీవ్ కాలనీలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా కాలనీలో అక్రమంగా కొనసాగుతున్న బెల్టుషాపులపై దాడులు చేసిన పోలీసులు 153 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో రాజీవ్ కాలనీకి చెందిన మాల వెంకటప్ప వద్ద 71ఒక మద్యం బాటిళ్లు, సగ్గం నారాయణ వద్ద 82 బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఇక ముందు ఎవ్వరైన బెల్టు షాపులు నిర్వహిస్తు అక్రమంగా మద్యం విక్రయాలను చేపడితే చర్యలు తప్పని హెచ్చరించారు.



## 'నిప్పులవాగు' ఖరీదుకై సెలెక్షన్ కమిటీ సమావేశం



ప్రజాపక్షం/రంగారెడ్డి: ముఖ్యమంత్రి,విద్యాశాఖ వారి ఉత్తర్వులతో ప్రముఖ రచయిత కీశే అందెశ్రీ రచించిన 'నిప్పులవాగు' పుస్తకం ఖరీదు చేయుటకు శనివారం జిల్లా స్థాయి బుక్ సెలెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి,డి ఇ ఒ సుసింధ్రరావు,డి పి ఆర్ ఒ బాలీశ్వరీ,వయోజన విద్యా డిడి పిజివి రాణి కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాం : కార్పొరేటర్



ప్రజాపక్షం/ఎల్బీనగర్: బివిఎన్.రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి,సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం బివిఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో రూ.34.00 లక్షలతో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డ పనులను బివిఎన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కాలనీ వాసులతో కలిసి పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ త్వరలోనే అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఎఇ కార్తీక్, పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, కాలనీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# జిహెచ్‌ఎంసిలో 60 సర్కిల్‌లకు డిప్యూటీ కమిషనర్‌ల నియామకం

### ఉత్తర్వులు జారీ చేసిన జిహెచ్‌ఎంసి కమిషనర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్‌లోని 60 సర్కిళ్లకు డిప్యూటీ కమిషనర్లను నియమిస్తూ జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శనివారం డిప్యూటీ కమిషనర్‌లుగా అధికారులు బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఇకా గ్రేటర్ వ్యాప్తంగా పౌర సేవలు సులభంగా, వేగంగా అందే అవకాశం ఏర్పడటమే కాకుండా, అభివృద్ధి మరింత వేగిరం కానుంది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) పరిధిలోకి 20 పురపాలికలు, 7మున్సిపల్ కార్పొరేషన్లు కలిపి మొత్తం 27 పట్టణ స్థానిక సంస్థలను (యూఎల్ బిలు) విలీనం చేయడంతో 650 చదరపు కిలోమీటర్ల గా ఉన్న విస్తీర్ణం 2,053 చదరపు కిలోమీటర్లకు పెరగగా, జనాభా 1.34 కోట్లకు మంది గ్రేటర్ పరిధిలోకి వచ్చారు. దీంతో విస్తీర్ణం పరంగా జనాభా పరంగా దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా జిహెచ్‌ఎంసి అవతరించింది.

#### క్షేత్రస్థాయిలో జోనల్ కమిషనర్‌ల తనిఖీ

కొత్తగా బాధ్యతలు చేపట్టిన పలువురు జోనల్ కమిషనర్లు శనివారం ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పనులను పరిశీలించారు. చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ముసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించగా, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ దోమలగూడలో పర్యటించి నూతనంగా నిర్మిస్తున్న సర్కిల్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. అదేవిధంగా మల్కాజ్ గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ పారిశుద్ధ్య పనులను, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ఉప్పల్ కూడలి నుండి వరంగల్ రహదారి మార్గంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, డిప్యూటీ కమిషనర్‌లు పారిశుద్ధ్య పనులు జరుగుతున్న తీరును క్షేత్ర స్థాయిలో సమీక్షించారు.

#### 29 నుంచి జిహెచ్‌ఎంసిలో పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ : ఆర్‌వి కర్ణన్

గ్రేటర్ హైదరాబాద్ పరిసరాలను మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ఈ నెల 29వ తేదీ నుంచి మరోసారి పరిశుద్ధ్యప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టనున్నట్లు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ తెలిపారు. శనివారం సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి జోన్లలో జోనల్ కమిషనర్‌లు రవి కిరణ్, సంచిత్ గంగ్వార్‌లతో కలిసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ పారిశుద్ధ్య ప్రత్యేకడ్రైవ్ పూర్తిగా విజయవంతం అయ్యేలా పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కమిషనర్ ఆర్‌వి కర్ణన్ జోనల్ కమిషనర్ల, డిప్యూటీ కమిషనర్లుకు సూచించారు. ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో దీర్ఘకాలంగా పేరుకుపోయిన వ్యర్థాలు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సికింద్రాబాద్ జోనల్ పరిధిలోని గాంధీ ఆసుపత్రి, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో ప్రజా భద్రత, పారిశుద్ధ్యం, పాదచారుల మౌలిక సదుపాయాలకు సంబంధించిన పరిస్థితులను కమిషనర్ నిర్వహించారు. తనిఖీ సమయంలో పునరావాస కేంద్రాలకు తరలించిన కుక్కలు చుట్టుపక్కల ప్రాంతాల నుండి ఆసుపత్రి ప్రాంగణంలోకి తిరిగి ప్రవేశిస్తున్నట్లు గుర్తించిన కమిషనర్ ఈ సమస్యను వెంటనే పరిష్కరించడానికి చీఫ్ వెటర్నరీ ఆఫీసర్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్‌తో కలిసి సంయుక్త తనిఖీ నిర్వహించాలని ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలోని కుక్కలను పట్టుకుని ఎనిమల్ కేర్ సెంటర్ లకు తరలించడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. డిప్యూటీ డైరెక్టర్ స్థాయి వెటర్నరీ అధికారులు తమ పరిధిలోని అన్ని ఆసుపత్రులు, పాఠశాలలు, జనసమ్మర్థక ప్రదేశాలలో రోజువారీగా వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని, వీధి కుక్కలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కుక్క కాటు ఘటనలు జరిగితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వీధి కుక్కల బెడద పై వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పాదచారుల సౌకర్యాలను కమిషనర్ సమీక్షించారు. ఫుట్ పాత్‌లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించడం ద్వారా ఫుట్‌పాత్‌లను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. మల్కాజ్ గిరి జోనల్ పరిధిలోని ఓల్డ్ అల్వాల్ లో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ లను కమిషనర్ పరిశీలించారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా మానిటర్ చేయాలని అధికారులకు సూచించారు. రోడ్లను, వీధులను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## శ్యామ్‌రావు తండాకు శాశ్వత విద్యుత్ సమస్య పరిష్కారం



ప్రజాపక్షం/కేశంపేట : ఏళ్ల తరబడి విద్యుత్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తండా వాసులకు విద్యుత్ సమస్య నుండి విముక్తి కల్పించారు. శనివారం కేశంపేట మండల పరిధిలోని నిర్ధవెల్లి పంచాయతీ పరిధిలోరి శ్యామ్‌రావు తండాలో సర్పంచ్ భాస్కర్ గౌడ్ నూతన విద్యుత్ లైన్లకు శ్రీకారం చుట్టారు. తండాలో అనునిత్యం విద్యుత్ సమస్య ఉండేదని, సర్పంచ్‌గా భాస్కర్ గౌడ్ ఎన్నికైన నేపథ్యంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకువెళ్ళారు. దాంతో శాశ్వత పరిష్కారానికి అవసరమైన రీ కండక్టింగ్ వైర్‌ను అంధించేందుకు చర్యలు తీసుకున్నారు. దాంతో వెనువెంటనే విద్యుత్ లైన్ పనులు మొదలు పెట్టారు. విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు పనులు మొదలు పెట్టడం ఎంతో సంతోషంగా ఉందని తండా వాసులు సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు సర్పంచ్ భాస్కర్ గౌడ్‌ను ప్రత్యేకంగా అభినంధించారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ లక్ష్మ య్య, ఆపరేటర్ నరసింహా, యువకులు బోడ మల్లేష్, బద్దునాయక్, శేఖర్, రాజేందర్‌లు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం



ప్రజాపక్షం/షాద్‌నగర్ : వాహన సామర్థ్యానికి మంచి ధాన్యం బస్తాలను వేసుకొని వస్తున్న ట్రాక్టర్ ఉన్న ఫలంగా ఒక్కసారి బోల్తా పండింది. శనివారం మధ్యాహ్నం షాద్‌నగర్ చౌరస్తా సమీపంలోని ఎస్‌బిఐ బ్యాంక్ వద్ద పాత జాతీయ రహదారిపై వరిధాన్యం బస్తా బోల్తా పడటంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ట్రాక్టర్ బోల్తా పడిన నేపథ్యంలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపవడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయాన్ని గమనించిన షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు హుటాహుటిక ఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై కిందపడిన వరిధాన్యం బస్తాలాను మరో లారీ తీసుకువచ్చి అక్కడి నుండి తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ట్రాఫిక్ పోలీసులు స్వయంగా వరిధాన్యం బస్తాలను లారీలో వేయడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలోనే కాకుండా సామాజిక బాధ్యతతో సేవలు అంధించడం అభినందనీయమంటూ ప్రజలందరు పేర్కొంటున్నారు. ఇలాగే మున్ముందు మరెన్నొ సేవా కార్యక్రమాలను చేసేందుకు కృషి చేయాలని ఆకాక్షించారు.

## హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



ప్రజాపక్షం/షాద్‌నగర్: హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అల్లాను వేడుకుంటున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాసంలో అజ్మీర్‌లోని హజ్రత్ ఖాజా నవాబ్ ఉర్సు ఉత్సవాల సందర్భంగా చాధర్‌ను భక్తులకు అంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అల్లా అశీస్సులు ప్రజలందరిపై ఉండటమే కాకుండా పాడి పంటలు బాగా పండి అన్నదాతలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. భగవంతుడి అశీస్సులు లేకుండా మనమేమి చేయలేమని, వారి అశీస్సులతో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. చాధర్‌ను దర్గాకు తీసుకువెళ్తున్న సయ్యద్ హబీబ్‌చ మహ్మద్ హామీద్, జాంగీర్, సయ్యద్ షబ్బీర్ తదితర నిర్వాహకులను ప్రత్యేకంగా అభినంధించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు ముబారక్ అలీఖాన్‌తోపాటు కార్యకర్తలు ఉన్నారు.

## యాచకులకు వంశీ అన్నదానం



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: అసలే చలి కాలం.. అర్థకాలితో అలమటిస్తున్న యాచకులకు అన్నదానం చేశారు. రాత్రి సమయాల్లో షాద్‌నగర్ ఆర్‌టిసి బస్టాండ్ పరిపరాలు, ప్రధాన మొయిన్ రోడ్డు, రైల్వే స్టేషన్లలో ఉన్న యాచకులతో పాటు ప్రయాణికులకు సైతం అన్నదానం చేశారు. రాత్రి సమయాల్లో ఎలాంటి రవాణా సౌకర్యం లేకుండా బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన ప్రయాణికులకు, యాచకులకు గత మూడు రోజులుగా రాత్రి సమయాల్లో అన్నదాన ప్యాకెట్లను అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచిపోయారు. పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యులు వావిలాల సుజీన్ కుమారులు వావిలాల వంశీ, చేతన్‌లు రాత్రి సమయాల్లో చలికి వణుకుతు అర్థ ఆకాలితో అలమటిస్తున్న వారి జీవన వేతలు,బాధలు చూడలేక యాచకుల ఆకాలి తీర్చేందుకు అన్నం ప్యాకెట్లను అంధించారు. ఇద్దరు యువకులు స్వయంగా ముందుకు వచ్చి సమాజ సేవ చేస్తున్న దాన్ని చూసిన తోటి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్నతనంలోనే సమాజ సేవ చేసేందుకు యువకులు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని, మున్ముందు ఇలాంటి సేవా కార్యక్రమాలను మరెన్నో చేసేందుకు కృషి చేయాలని ప్రజలందరు ఆకాంక్షిస్తున్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన దొంతాన్‌పల్లి సర్పంచ్

ప్రజాపక్షం/శంకర్ పల్లి:మండల పరిధిలో ని మండలం దొంతాన్ పల్లి బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ సర్పంచ్ అబ్దుల్ అజిత్ మహమ్మద్ శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.సర్పంచ్ తో పాటు గ్రామ ఉపసర్పంచ్ బాసుపల్లి బాలకృష్ణ, వారితో పాటు వార్డు సభ్యులు ప్రభాకర్,అనిల్ గౌడ్,డేవిడ్, చిట్టి రాజు,గీతా శ్రీనివాస్ వారి అనుచరులు పదిమంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే గారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## ముదిరాజ్ సర్పంచ్‌ల సన్మాన సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం / ఖైరతాబాద్ : రాజకీయపార్టీలకతీతంగా ముదిరాజ్ సర్పంచ్‌ల సన్మాన సభ ఈ నెల 30న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్టు ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముదిరాజ్ సంఘంజెఏసి కన్వీనర్ గుండ్లపల్లి శ్రీనివాస్, చైర్మన్, న్యాయవాది ఆర్.వినోద్‌కుమార్ పలువురు నేతలతో కలిసి సభకు సంబంధించిన పోస్టర్‌ను జ్ఞానేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు ముఖ్యఅతిథులుగా మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపి ఈటల రాజేందర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ ఎంఎల్‌సి కాసాని జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ నేత నీలం మధు హాజరవుతారని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ముదిరాజ్ సర్పంచ్‌లు, వార్డు సభ్యులంతా సభకు హాజరుకావాలని సూచించారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం నేతలు మద్దెల సతీశ్, గొడుగు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, లక్ష్మ ణ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో సెట్స్‌పైకి పద్మావ్యూహం



ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్ మెట్ : కెఆర్ సినీ ప్రొడక్షన్ కొత్త సినిమా పద్మావ్యూహం యొక్క ముహూర్తం ఇటీవల జరిగింది. ఈ సందర్భంలో ప్రముఖ నటుడు ఉపేంద్ర చేతుల మీదుగా మూవీ గ్లింప్స్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత కుమార్ సీవీ మాట్లాడుతూ, మూవీ త్వరలో ప్రారంభమవుతుందని, రామోజీ ఫిలిమ్ సిటీ పరిసరాల్లో కూడా షూటింగ్ చేసే అవకాశం ఉందని తెలియజేశారు. మూవీ డైరెక్టర్లు. ఈశ్వర్ చల్ల, వి.బాల మురళి నాయక్ మాట్లాడుతూ, హీరోగా హర్షిత్ శెట్టి, హీరోయిన్‌గా మాణికరాజ్ నటిస్తారన్నారు. సినిమా మార్చి నెలలో షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. మూవీ కో డైరెక్టర్‌లు: సంతోష్, శివగంగా, ఇతర ముఖ్య అంశాలను త్వరలో ప్రకటిస్తామని డైరెక్టర్లు తెలిపారు.నిర్మాత కుమార్ సీవీ కూడా సినిమా విజయం కోసం ఆయనవైపు శుభాకాంక్షలు తెలిపారు.

## బిసి న్యాయవాదుల హక్కుల సాధనకు పోరాడుతాం

### మీడియాతో సల్ల వినోద్‌కుమార్, జ్యోతి దేవరకొండ



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : బిసి న్యాయవాదుల హక్కుల సాధనకు, సంక్షేమం కోసం పోరాడుతామని బిసి న్యాయవాదుల సంక్షేమం సంఘం రం గారెడ్డి జిల్లా అధ్యక్షులు సల్ల వినోద్ కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతి దేవరకొండ తెలిపారు. శనివారం హైదరాబాద్ బషీర్ బాగ్‌లో జరిగిన బిసి న్యాయవాదుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బిసి న్యాయవాదుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అ ధ్యక్షులుగా సల్ల వినోద్ కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా జ్యోతి దేవరకొండను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీధర్ దూకుంట్ల ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన సల్ల వినోద్ కుమార్ మా ట్లాడుతూ బిసి న్యాయవాదుల అభ్యున్నతికి పాటుపడతామన్నారు. జ్యో తి దేవరకొండ మాట్లాడుతూ మహిళా న్యాయవాదుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సందీప్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజ్ కుమార్ ఎన్నికయ్యారు.



## జడ్జిల నియామకాల్లో రిజర్వేషన్లు తేవాలి

### కేంద్రానికి ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

ప్రజాపక్షం/ఖైరతాబాద్ :ఎస్‌సి, ఎస్‌టి, బిసిల జనాభా ప్రాతిపదికన జడ్జిల నియామకాలలో రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ బిసి న్యాయవాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నూతన సంవత్సరం క్యాలెండర్, సంఘం' లోగో' ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కొలిజయం పద్ధతిని రద్దు చేసి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరహాలో జుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసి జడ్జిల నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యాయ వ్యవస్థలో జరుగుతున్న అన్యాయంపై ప్రజాస్వామ్యపద్ధతిలో పోరాడాలని పిలుపునిచ్చారు. కోర్టులపై ఎస్‌సి, ఎస్‌టి, బిసిల వ్యతిరేక ముద్ర పడకూడదన్నారు. ప్రతి జూనియర్ అడ్వకేట్‌కు నెలకు రూ.20 వేల చొప్పున స్టైఫండ్ చెల్లించాలని ఆర్.కృష్ణయ్య కోరారు. ఈ సభలో సంఘం రాష్ట్ర కన్వీనర్ డి. శ్రీధర్, బిసి నేతలు నీల వెంకటేష్, సుభాష్, సి. రాజేందర్ ముదిరాజ్, రాజ్ కుమార్, వంశీకృష్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అర్చకుడిపై దాడి చేసిన నిందితున్ని వెంటనే అరెస్ట్ చేయాలి



ప్రజాపక్షం/ సరూర్‌నగర్ : సురేష్ శర్మపై అకారణంగా దాడి చేసిన వెంకటేశ్వరరెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య క్రమశిక్షణ కమిటి కన్వీనర్ వక్కలంక శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. శనివారం సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలెం గ్రామానికి చెందిన సమాఖ్య ప్రతినిధులు స్వామి దేవాలయ అర్చకులు సురేష్‌శర్మపై దాడి చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిచే రాష్ట్ర స్థాయిలో నిరసన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ కార్యదర్శి దుర్గి శ్రీకాంత్, వావిలాల రాజశేఖరశర్మ, మురళీరావు, రాజశేఖర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బిసిలకు ప్రాధాన్యత ఇవ్వాలి

### బిసి జనసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప



ప్రజాపక్షం/షాద్‌నగర్ : వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బీసిలకు తగిన ప్రాధాన్యత ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసి జనసేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప డిమాండ్ చేశారు. శనివారం షాద్‌నగర్‌లో బీసి జనసేన ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కత్తి చంద్రశేఖర్ అప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో బీసిలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత ఇచ్చి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీల నాయకులు బీసిలకు కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయని, దాంతో బీసిలు పూర్తిగా వెనకబడి పోతున్నారని వివరించారు. బీసిలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బీసిలకు సీట్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్‌ను సైతం కలువనున్నట్లు తెలిపారు. బీసిలు ఐక్యంగా ఉంటేనే సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల నేతలు బీసిలకు రిజర్వేషన్లు విధిగా కల్పించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సమావేశంలో బీసి జనసేన నేతలు జక్కుల జలజ, స్రవంతి రాజ్, భాగ్యలక్ష్మీ గౌడ్, మేకల వెంకటేష్, తంగడపల్లి శంకర్, చందులాల్ జమాల్‌పుర్, మొగిలేటి నరసింహాలు పాల్గొన్నారు.

## బిసిల ఐక్యత చాటడానికే జన భోజనాల మహోత్సవం

### బిసి ఉద్యమ నేతల పిలుపు

ప్రజాపక్షం/హయత్ నగర్: బిసిల ఐక్యతే బలం రాజ్యాధికారం లక్ష్యం అన్న నినాదంతో నేడు ఆదివారం నిర్వహిస్తున్న బిసి జన భోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా పలువురు బిసి ఉద్యమ నేతలు పిలుపునిచ్చారు శనివారం నాడు సాయంత్రం ఆటోనగర్ అనన్య రిసార్ట్స్‌లో బిసి భోజన మహోత్సవ ఏర్పాట్లను పలువురు బిసి ఉద్యమ నేతలు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు బీసీ ఉద్యమ నేతలు మాట్లాడుతూ... బిసిల ఐక్యత చాటడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు అన్నారు. బిసి ఉద్యమాన్ని భవిష్యత్తులో మరింత బలోపేతం చేయడానికి ఈ సందర్భంగా ప్రణాళికలు కూడా రూపొందిస్తామని వారు చెప్పారు ఈ కార్యక్రమానికి పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎంపిలు,ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, రాష్ట్ర,జాతీయ బిసి సంఘాల నేతలు ,ఉద్యమ నేతలు హాజరవుతున్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో బిసి జన భోజన నిర్వహణ కమిటీ సభ్యులు కూరెళ్ల వేములయ్య గౌడ్ , బొమ్మ రఘురాం నేత చామకూర రాజు, కేవి గౌడ్ విశ్వనాథులు పుష్పగిరి, దుస్స యాదగిరి నేత,ఎన్ శ్రీనివాస్ గౌడ్ పూల నాగరాజు వంశరాజ్ రామచంద్ర,జే బి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## వైకుంఠ ఏకాదశికి భక్తులు తరలాలి

### రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి మున్సిపల్ ఉద్దెమర్రిలోని శ్రీ విష్ణు శివాలయంలో వైకుంఠ ఏకాదశికి ఉత్తర ద్వార దర్శనానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారని భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి దర్శనం చేసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శనివారం ఉద్దెమర్రిలోని అతి పురాతణమైన అక్కన్న మాదన్నలు నిర్మించిన ఆలయంలో తన అల్లుడు డాక్టర్ శ్వేత శ్రీకాంత్‌గౌడ్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనానికి దేవస్థాన కమిటీ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల ప్రజలు, భక్తులు తరలివచ్చి ఉత్తర ద్వార దర్శనం చేసుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నక్క ప్రభాకర్‌గౌడ్ కుటుంబ సభ్యులు, ఆలయ చైర్మన్ ప్రసాద్, విష్ణుగౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తుంకి వెంకటేష్, శ్రవన్, నర్సింలు, రవీందర్‌గౌడ్, జయాల పాండు, అంజనేయులు ఆలయ కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలకు నట్టల నివారణ మాత్రలు



ప్రజాపక్షం/యాచారం : నట్టల నివారణ మందులు గోర్రేలకు, మేకలకు వేయించాలని గడ్డమల్లాయగూడ గ్రామ సర్పంచ్ అచ్చన మంగ అన్నారు. శనివారం గ్రామంలో నట్టల నివారణ మందు గోర్రేలకు వేసారు. ఈసంధర్భంగా అమే మాట్లాడుతూ సిజనల్ వ్యాదులు రాకుండా గోర్రేల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ఈనెల 26 నుండి జనవరి 1 వరకు మందులు పంపిణి చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గౌర లక్ష్మ ణ్,వార్డు సభ్యులు కాలే వేంకటేశ్, వరికుప్పల మమత,బొడ్డు శ్రీశైలం,దండు శ్రీశైలం,రైతు వరికుప్పల జంగయ్య ,గునగల్ పశు వైద్య కేంద్రం లైవ్ స్టాక్ అసిస్టెంట్ చెన్నోజి కృష్ణ తదితరులు పాల్గోన్నారు.

# క్రీడ

# ఎన్నాళ్లో వేచిన విజయం!



**ఆసీస్ గడ్డపై గెలిచిన ఇంగ్లండ్.. నాలుగో టెస్టులో 4 వికెట్ల తేడాతో విక్టరీ**

ఆస్ట్రేలియా గడ్డపై ఆ దేశాన్నే ఓడించింది ఇంగ్లండ్. సుమారు 14 ఏళ్ల విరామం తర్వాత ఆసీస్ పిచ్‌పై టెస్టుల్లో ఇంగ్లండ్ జట్టు విజయం సాధించింది. మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగో టెస్టులో ఇంగ్లండ్ నాలుగు వికెట్ల తేడాతో అసాధారణ విజయాన్ని నమోదు చేసింది. కేవలం రెండు రోజుల్లోనే బాక్సింగ్ డే మ్యాచ్ ముగియడం గమనార్హం. ఆసీస్, ఇంగ్లండ్ మధ్య జరిగిన పెర్త్ టెస్టు కూడా రెండు రోజుల్లో ముగిసిన విషయం తెలిసిందే. అయితే పెర్త్ టెస్టులో ఆస్ట్రేలియా విక్టరీ కొట్టగా, శనివారం మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్ స్వీట్ విక్టరీ నమోదు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో 175 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లండ్ ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకున్నది. వాస్తవానికి ఈ మ్యాచ్ కూడా హోరాహోరీగా సాగింది. ఆస్ట్రేలియా బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. టార్గెట్ చిన్నదే అయినా.. ఇంగ్లండ్ క్రికెటర్లు తెగ ఇబ్బందిపడాల్సి వచ్చింది. పేస్ అటాక్‌తో ఆస్ట్రేలియా బౌలర్లు చమటలు పట్టించింది. శనివారం రెండో రోజు ఆస్ట్రేలియా తన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 132 రన్స్ కే ఆలౌటైంది. ఇంగ్లండ బౌలర్లలో బ్రౌడన్ కార్సే 4, స్టోక్స్ 3, టాంగే రెండు వికెట్లు తీసుకున్నారు. నిజానికి యాషెస్ సిరీస్‌ను ఇప్పటికే ఆస్ట్రేలియా సొంతం చేసుకున్నది. కానీ ప్రస్తుతం ఆధిపత్యాన్ని 31కి తగ్గించింది ఇంగ్లండ్. ఆస్ట్రేలియా తన స్వంత గడ్డపై ఓడించేందుకు ఇంగ్లండ్‌కు 15 ఏళ్లు పట్టింది. ఇన్నేళ్లలో ఇంగ్లండ్ 16 టెస్టుల్లో ఓడగా, రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకున్నది. రెండు రోజుల్లోనే ముగిసిన పెర్త్ టెస్టులో మొత్తం 847 బంతులు వేయగా, ఇక మెల్‌బోర్న్ టెస్టులో 852 బాల్స్ పడ్డాయి. 2011లో సిడ్నీలో జరిగిన టెస్టులో చివరిసారి ఇంగ్లండ్ విజయం సాధించింది. మెల్‌బోర్న్ పిచ్‌పై విమర్శలు వస్తున్నాయి. తొలి రోజే ఆ పిచ్‌పై 20 వికెట్లు కూలాయి. ఇక రెండో రోజు కూడా 16 వికెట్లు పడ్డాయి. దీంతో పిచ్‌ను మేనేజ్ చేస్తున్న తీరును విమర్శిస్తున్నారు.

## త్వరలోనే టీమిండియాకు కొత్త కోచ్..

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27ను సిరీస్ సమంతో ఆరంభించిన భారత్ అనూహ్యంగా తడబడుతోంది. స్వదేశంలో వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేసిన శుబ్‌మన్ గిల్ సేన.. దక్షిణాఫ్రికా చేతిలో చిత్తుగా ఓడింది. రెండు మ్యాచుల్లో ఓటమితో కోచ్ గౌతం గంభీర్‌ను తప్పించాలనే డిమాండ్లు వచ్చాయి. ప్రయోగాల పేరుతో భారత టెస్టు క్రికెట్‌ను నాశనం చేస్తున్న గౌతీ బదులు సుదీర్ఘ ఫార్మాట్‌లో అనుభవజ్ఞుడైన వీవీఎస్ లక్ష్మణ్‌కు బాధ్యతలు అప్పగిస్తారని కథనాలు వస్తున్నాయి. సఫారీల దెబ్బకు రెండు టెస్టుల్లో ఓడిన తర్వాత బిసిసిఐ పెద్దలు మాజీ సొగసరి బ్యాటర్‌ను సంప్రదించారని సమాచారం. సొంతగడ్డపై సింహంలా గర్జించే భారత జట్టు గంభీర్ కోచింగ్‌లో విఫలమవుతోంది. న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌ను మరుకవ ముందే దక్షిణాఫ్రికా 20తో సిరీస్ కొల్లగొట్టింది. ఒకప్పుడు అజేయ శక్తిగా దూసుకెళ్లిన టీమిండియాను గంభీర్ పరాజయాల తోవ తొక్కిండానే విమర్శలు వచ్చాయి. దాంతో.. గౌతీని వైట్‌బాల్‌కే పరిమితం చేసి టెస్టులకు కొత్త కోచ్ ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే మాజీ టెస్టు స్పెషలిస్ట్ లక్ష్మణ్‌ను బిసిసిఐ సంప్రదించిందని టాక్. అయితే.. అతడు మాత్రం బెంగళూరలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు హెడ్‌గా ఉండేందుకే ఇష్ట పడుతున్నాట. అయినా సరే వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా ప్రదర్శనను బట్టి గంభీర్‌ను కొనసాగించాలా? వద్దా? అనే నిర్ణయానికి వస్తామని బిసిసిఐ సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.

## భారత అండర్–19 కెప్టెన్‌గా వైభవ్!

ఐపిఎల్‌లో సెంచరీతో క్రికెట్ సంచలనంగా పేరొందిన వైభవ్ సూర్యవంశీకి ప్రమోషన్ వచ్చింది. ఇటీవల వరుస సెంచరీలతో దుమ్మురేపుతున్న ఈ యంగ్‌స్టర్‌ను ఏకంగా అండర్ 19 కెప్టెన్సీ వరించింది. వచ్చే ఏడాది జరుగనున్న అండర్19 ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌లో టీమిండియాకు ఈ చిచ్చరపిడుగు సారథ్యం వహించనున్నాడు. ఈ విషయాన్ని శనివారం సెలెక్టర్లు వరల్డ్ కప్ స్క్వాడ్ ప్రకటన సందర్భంగా వెల్లడించారు. ఈమధ్య కాలంలో శతకాల మోతతో అలరిస్తున్న వైభవ్ సూర్యవంశీ సీనియర్ జట్టులోకి ఎంట్రీ ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ప్రతిభావంతుడైన వైభవ్‌కు వరుసగా అవకాశాలు ఇస్తున్న సెలెక్టర్లు అండర్ 19 ప్రపంచకప్ స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. అంతకంటే ముందు దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు అతడికి కెప్టెన్సీ కట్టబెట్టారు. జనవరి 3 నుంచి 7 వరకూ జరిగే దక్షిణాఫ్రికా సిరీస్‌కు రెగ్యులర్ సారథి ఆయుష్ మాత్రే, వైస్ కెప్టెన్ విహాన్ మల్హోత్రాలు దూరమయ్యారు. మణికట్టు గాయంతో బాధపడుతున్న వీరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకున్నాక వరల్డ్ కప్ కోసం జట్టుతో కలుస్తారు. దాంతో.. వీరిద్దరి గైర్హాజరీలో సఫారీ టూర్‌కు వైభవ్‌కు పగ్గాలు అప్పగించారు సెలెక్టర్లు. అతడికి డిప్యూటీగా అరోన్ జార్జ్ వ్యవహరిస్తాడు.

**భారత స్క్వాడ్ (దక్షిణాఫ్రికా పర్యటనకు) :**

వైభవ్ సూర్యవంశీ(కెప్టెన్), అరోన్ జార్జ్(వైస్ కెప్టెన్), వేదాంత్ త్రివేది, అభిగ్యాన్ కుందు(వికెట్ కీపర్), హర్వన్ష్ సింగ్(వికెట్ కీపర్), ఆర్.ఎస్ అంబ్రిస్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్,



మొహమ్మద్ ఎనాన్, హెనిల్ పటేల్, దీపేశ్, కిషన్ కుమార్ సింగ్, ఉద్ధవ్ మోహన్, యువరాజ్ గొహిల్, రాముల్ కుమార్.

**భారత స్క్వాడ్ (అండర్ –19 ప్రపంచకప్):**

ఆయుష్ మాత్రే (కెప్టెన్), విహాన్ మల్హోత్రా(వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అరోన్ జార్జ్, వేదాంత్ త్రివేది, అభిగ్యాన్ కుందు(వికెట్ కీపర్), హర్వన్ష్ సింగ్(వికెట్ కీపర్), ఆర్.ఎస్ అంబ్రిస్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్, మొహమ్మద్ ఎనాన్, హెనిల్ పటేల్, దీపేశ్, కిషన్ కుమార్ సింగ్, ఉద్ధవ్ మోహన్.




# మార్కెట్లను రీసెట్ చేసిన 2025

ఈ ఏడాది కేవలం భారత దేశంలోనేగాక, యావత్ ప్రపంచంలోనూ స్టాక్ మార్కెట్లు అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న పలు నిర్ణయాలు, ప్రత్యేకించి వాణిజ్య యుద్ధానికి దారితీసే టారిఫ్‌లు మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేశాయి. బలమైన ఆర్థిక వృద్ధి ఒకవైపు, ఊహించని పరిణామాలు మరోవైపు స్టాక్ మార్కెట్‌ను రెండు భిన్నమైన కోణాల్లో ఆవిష్కరించాయి. ఆర్థిక వృద్ధి కొనసాగినప్పటికీ, స్టాక్ మార్కెట్‌లో అతిగా పెరిగిన విలువలకి కళ్లెం వేసిన సంవత్సరంగా 2025ని చెప్పుకోవచ్చు. తయారీ, బ్యాంకింగ్, స్టార్టప్‌లలో దృఢత కనిపించింది, ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతల మధ్యనైనా వ్యాపారం తట్టుకుని నిలిచింది. భారత స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధి, 2025 ఆర్థిక సంవత్సరంలో సుమారుగా 6.5 శాతం దగ్గర, చివరి త్రైమాసికంలో సుమారు 7.4 శాతం వద్ద నిలిచింది. భారత్‌ను వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిపింది. బహుపాక్షిక సంస్థల అంచనాల ప్రకారం 2025–26లో ఆర్థిక వృద్ధి సుమారు 6.2%–6.9 శాతం మధ్య ఉండొచ్చని, దీనికి అంతర్గత డిమాండ్ ప్రభుత్వ మూలధన వ్యయం, తగ్గుతున్న ద్రవ్యోల్బణం బలంగా తోడయ్యాయని భావిస్తున్నారు. 2026కి ప్రధాన సవాలుగా తక్కువ ఆదాయ పట్టణ–గ్రామీణ వర్గాల్లో వినియోగం మళ్లీ బలపడటం అవసరమని ఆర్థిక విశ్లేషణలు సూచిస్తున్నాయి.

### మార్కెట్లు.. ఫైనాన్స్

అనేక సంవత్సరాల బుల్ రన్ తరువాత, 2025లో చిన్న–మధ్యస్థ షేర్లలో వాల్యుయేషన్ రీసెట్ జరిగింది. నిఫ్టీ50 సుమారు 8–9 శాతం లాభంతో సంవత్సరం ముగించగా, మిడ్‌క్యాప్ సూచీలు తక్కువ సింగిల్ డిజిట్ లాభాలు మాత్రమే చూపాయి. చాలా స్మాల్‌క్యాప్‌లు అయితే మైనస్‌లోనే ముగిశాయి. బిఎస్‌ఇ 500లో దాదాపు మూడో వంతు కంపెనీలు 2025లో 20శాతానికిపైగా పడిపోయాయి. అదే సమయంలో నియంత్రణ సడలింపులు, వడ్డీ/జిఎస్‌టి తగ్గింపుల మద్దతుతో ఫైనాన్షియల్స్, ఆటో రంగం బలంగా ర్యాలీ చేశాయి. భారత బ్యాంకింగ్ రంగంపై గ్లోబల్ ఇన్వెస్టర్ల ఆకర్షణ పెరిగి, సంవత్సరంలో సుమారు 14–15 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు భారత ఫైనాన్షియల్ కంపెనీల్లోకి వచ్చాయని అంచనాలు చూపుతున్నాయి. మొత్తం 14 రంగాల్లో అమలవుతున్న ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్‌ఐ) పథకాల ద్వారా 2025 మధ్య నాటికి సుమారు రూ. 1.88 లక్షల కోట్లు ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చి, రూ. 17 లక్షల కోట్లకు పైగా అదనపు ఉత్పత్తి సాధించినట్లు అధికారిక సమీక్షలు చెబుతున్నాయి. ఈ పథకాల వల్ల దాదాపు 12.3 లక్షల ప్రత్యక్ష–పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడి, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఫార్మా, టెలికాం ఎక్విప్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో కలిపి రూ. 7.5 లక్షల కోట్లకుపైగా ఎగుమతులు జరిగాయని అంచనా. వ్యాపార సౌలభ్యంపై దృష్టిపెట్టి 47,000కు పైగా కంప్లయెన్స్ నిబంధనలను సవరించడం, డిజిటైజ్ చేయడం, డీక్రిమినలైజ్ చేయడం లేదా రద్దు చేయడం జరిగింది. నేషనల్ సింగిల్ విండో సిస్టమ్ ద్వారా 11.5 లక్షలకుపైగా అప్లికేషన్లు ప్రాసెస్ అయ్యాయి.

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ 85,041.45 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 84,929.36 పాయింట్లు. లాభం 112.09 పాయింట్లు). జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్): నిఫ్టీ 26,042.30 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 25,966.40 పాయింట్లు. లాభం 75,90 పాయింట్లు).

## బులియన్ మార్కెట్..



భారత ఈ ఏడాది బులియన్ మార్కెట్‌ను సంక్షిప్తంగా చూస్తే.. బంగారం ధరలు చరిత్రాత్మక గరిష్ఠాలకు చేరి, ఆస్తి సంరక్షణకు 'సురక్షిత' పెట్టుబడిగా మరింత బలమైన ఇమేజ్ పొందిన సంవత్సరం, కానీ ఈ ధరలే నగల వినియోగాన్ని బాగా తగ్గించాయి. భారత్‌లో 24 క్యారెట్ బంగారం ధర సగటున 80 శాతం పెరగడం గమనార్హం. డిసెంబర్ చివరి నాటికి గ్రాముకు రేట్లు రికార్డు స్థాయిల దగ్గర ఉండటంతో, బంగారం సూపర్ బుల్ రన్ దశలో ఉందని విశ్లేషకులు పేర్కొన్నారు. రికార్డు స్థాయి ధరల వల్ల మొత్తం వార్షిక బంగారం డిమాండ్ 600–700 టన్నుల మధ్య, ఐదు సంవత్సరాల కనిష్ఠానికి పడిపోయే అవకాశం ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేసింది. 2025 మూడో త్రైమాసికంలో పరిమాణ పరంగా డిమాండ్ దాదాపు 16 శాతం తగ్గినా, విలువ పరంగా ఖర్చు సుమారు 23 శాతం పెరగడం, బంగారం ధరల విపరీతమైన పెరుగుదలను ప్రతిబింబించింది. పెళ్లి, పండుగలతో నగల కొనుగోలు కొంత నిలకడగా ఉన్నా, రోజువారీ/లగ్జరీ నగల కొనుగోలు గణనీయంగా తగ్గింది. ఇక్కడి పెట్టుబడిదారులు ఇటిఎఫ్‌లు, సావరిన్ గోల్డ్ బాండ్లు, డిజిటల్ గోల్డ్ వంటివాటిమార్గంగా పెట్టుబడి డిమాండ్‌ను 20 శాతానికిపైగా పెంచి, మొత్తం డిమాండ్‌లో పెట్టుబడి వాటాను చారిత్రాత్మకంగా ఉన్నంత గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లారు. వచ్చే ఏడాది క్రమంగా పరిస్థితి మెరుగుపడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## రూపాయి దారుణ పతనం

డాలర్‌తో పోలిస్తే, 2025లో రూపాయి గణనీయంగా బలహీనమై, సుమారుగా 4.7 నుంచి 5 శాతం వరకు క్షీణించి, ఒక్క దశలో డాలర్‌కు 90 రూపాయల సైకలాజికల్ స్థాయిని దాటిన ఏడాది గా నిలిచింది. అమెరికా వడ్డీ రేట్లు, గ్లోబల్ అనిశ్చితి కారణంగా డాలర్ బలపడటం, అలాగే భారత స్టాక్‌మార్కెట్‌లో విదేశీ పెట్టుబడుల (ఎఫ్‌పిఐ) బయటకు వెళ్లివేత రూపాయిపై ఒత్తిడి తెచ్చాయి. భారత్ వాణిజ్య లోటు పెరగడం, అమెరికా విధించిన అధిక టారిఫ్‌లు, ఆర్‌బిఐ విదేశీ చలామణి మార్కెట్లో జోక్యం కొంత తగ్గించడం వంటి కారకాలు కలిసివచ్చి రూపాయి మరింత బలహీనమయ్యింది. రూపాయి మారకం విలువ తగ్గడంతో దిగుమతి ఖర్చులు పెరిగాయి. క్రూడ్ ఆయిల్, ఎలక్ట్రానిక్స్, ఎరువులు, మెడికల్ ఎక్విప్‌మెంట్ లాంటి కీలక దిగుమతులు ఖరీదై, ద్రవ్యోల్బణంపై పైదిశ ఒత్తిడి పెంచాయి.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

# వందేళ్లుగా పేదల పక్షాన నిలబడ్డ ఘనత సిపిఐదే

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ**






**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** వందేళ్లుగా పేద ప్రజల పక్షాన నిలబడ్డ ఘనత ఎర్రజెండా సిపిఐ దేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ అన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా లహరిగార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మొదటగా స్థానిక సంతబజార్ పురవీధుల మీదుగా వంద మీటర్ల ఎర్రజెండాతో పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి బస్టాండు సమీపంలో సిపిఐ జెండాను ఆవిష్కరించారు. లహరిగార్డెన్‌లో ఏర్పాటుచేసిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల్‌నర్సింహ్మ మాట్లాడుతూ గత వందేళ్లుగా పేదప్రజలపక్షాన నిలబడి అనేక పోరాటాలు చేసిన ఘనత సిపిఐకే దక్కుతుందన్నారు. కష్టజీవుల వెన్నంటే సిపిఐ నిలుస్తుందని, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిందని, అనేక మంది జైలుజీవితం గడిపారని వివరించారు. తెలంగాణలో జరిగిన నిజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి కోసం జరిగిన పోరాటంలో 4500ల మంది కమ్యూనిస్టులు రక్తార్పణ చేశారని తెలిపారు. సిపిఐ చరిత్ర సిపిఐ పుట్టిన నాటి నుండి నేటివరకు చేసిన పోరాటా లు, త్యాగాలు జయాలు, అపజయాలు నాగపూర్ నగరంలో సిపిఐ పురుడు పోసుకున్నదన్నారు. నేటికి భారతదేశ వ్యాప్తంగా గ్రామగ్రామాన సభ్యత్వంలేని ఎర్రజెండాగా విరజిల్లుతుంటే ప్రజల తరపున నిరంతరం పోరాటాలను నిర్వహిస్తూ ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ప్రజల అవసరాలు తీర్చడంకోసం పూర్తిగా సిపిఐ ఉందన్నారు. అధికారం ఉన్న లేకున్నా ప్రజల మధ్యలో ఉంటామన్నారు. సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు ఖమ్మం పట్టణంలో జరిగే జనవరి 18న దేశవ్యాప్త బహిరంగ సభను లక్షలాదిమందితో ఖమ్మంలో జరుగుతుందని, జిల్లాల నుండి వందలాదిగా పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జి, సిపిఐరాష్ట్ర కార్యవర్గసభ్యురాలు చాయాదేవి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్లవెంకటయ్య, కేశవులుగౌడ్, సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ ఎండి ఫయాజ్, నాగర్‌కర్నూల్ జిల్లాకార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, పెబ్బేటి విజయుడు, ఆర్.ఇందిరమ్మ, సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు హుస్సేనయ్య, సిపిఐజిల్లా సమితి సభ్యులు శివశంకర్, కృష్ణాజి, మర్యాదవెంకటయ్య, బండిలక్ష్మి పతి, బిజ్జశ్రీనివాసులు, డాక్టర్ శ్రీనివాసులు, కొత్త రామస్వామి పాల్గొన్నారు.

# చెరువులను తలపిస్తున్న మురికి కాలువలు



**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు**

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని కొత్త గుండ్లపల్లి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, మురికి కాలువలు చెరువులను తలపిస్తున్నాయని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు విమర్శించారు. శనివారం ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా 8వ వార్డులో మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య జెండా ఆవిష్కరణ చేసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా 5, 6, 7, 8 వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల మధ్య మురికి నీరు నిలిచి ఉండటంతో ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో భాగంగా పలు కీలక సమస్యలను నాయకులు 8వ వార్డులోని వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరిందని, అది ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రతి వార్డులో కరెంటు లైన్లు కిందకు వేలాడుతూ ప్రమాదాలకు సంకేతంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అమృత పథకం కింద సీసీ రోడ్లు తవ్వి పైపులు వేయకుండా వదిలేశారని, దీనివల్ల వృద్ధులు, పిల్లలు నడవలేక కింద పడి గాయపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భర్త చనిపోయి ఏళ్లు గడుస్తున్నా, అర్హులైన మహిళలకు వితంతు పెన్షన్లు అంద క ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వార్డుల పర్యటనలో సేకరించిన ప్రజా సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 29, సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు శ్రీరాములు ప్రకటించారు. ఈ ధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లపల్లి మహేందర్, మున్సిపల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, నాయకులు పేరబోయిన బంగారు, ముక్కెర్ల పెంటయ్య, గుండు వెంకటేష్, రాయగిరి బాలకిషన్, మాటూరి మల్లయ్య, పబ్బాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య ఉద్యమ ప్రత్యక్ష పోరాటంలో పాల్గొన్న చరిత్ర సిపిఐది

**జనవరి 18న ఖమ్మంలో జరగనున్న సిపిఐ వందేళ్ల సంబరాలకు అధిక సంఖ్యలో తరలిరండి : బాలకిషన్**

**ప్రజాపక్షం/జడ్చర్ల :** ఖమ్మం పట్టణ కేంద్రంలో జనవరి 18,2026 జరగబోయే సిపిఐ వందేళ్ల సంబరాలకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిసెంబర్ 26, 2025 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జడ్చర్ల మండలంలోని నసురుల్లాబాద్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో జెండా ఎగురేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఖమ్మం పట్టణ కేంద్రంలో జనవరి 18న ఐదు లక్షల జనాభాతో దేశంలోని అన్ని రాష్ట్రాలలో ప్రతినిధులతో పాటు 40 దేశాల అతిథులు కూడా పాల్గొంటారని తెలిపారు. భారత దేశంలో సిపిఐ ఆవిర్భావం నుంచి ఎంతోమంది ప్రాణాలు త్యాగం చేసి పేద ప్రజల హక్కుల కోసం కార్మికుల చట్టాల గురించి స్వాతంత్ర ఉద్యమంలో ముందుభాగాన ఉండి అనేక ప్రత్యక్ష పోరాటంలో పాల్గొన్న ఘన చరిత్ర సిపిఐదని. ఈ పోరాటం చరిత్రను భవిష్యత్తు తరాలకు అందిస్తూ రాబోయే కాలంలో దేశంలో అన్ని కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేస్తూ గత పోరాటాల స్ఫూర్తితో భవిష్యత్తులో ప్రజా సంఘాల నిర్మాణం ప్రజా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాగి కృష్ణయ్య, నస్రుల్లాబాద్ గ్రామ సర్పంచి నిర్మల, బాలస్వామి, ఉపసర్పంచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు భూపాలపల్లిలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల పైలాన్ ఆవిష్కరణ






**హాజరుకానున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ● సిపిఐ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్**

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్ కుమార్ మాట్లాడుతూ, దేశంలో అనేక పార్టీలు ఆవిర్భవించాయని, అధికారంలో ఉంటే ఉంటాయి లేదంటే కనుమరుగతాయని, ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ 1925లో ఏర్పాటు చేయడం జరిగిందని, 2025లో 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందని తెలిపారు. 100 సంవత్సరాలలో పేదల పక్షాన భూ పోరాటం చేసి లక్షల ఎకరాలు పంపిణీ చేసి, ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేసిన ఘనత సిపిఐ దని కొనియాడారు. ఈ 100 సంవత్సరాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ముందు శత వసంతాల పైలాన్ ఆవిష్కరించడం జరుగుతుందని, ఈ పైలా న్ ఆవిష్కరణకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సిపిఐ రాష్ట్ర సహా య కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాస రావు ముఖ్యఅతిథిగా హాజరై పైలాన్‌ను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. స్వలా భం కోసం కాకుండా ప్రజల పక్షాన నిత్యం పోరాడే కమ్యూనిజం అజరామం అని ఆయన కొనియాడారు. అ ణచివేత, అవినీతి, పేదరికం, దోపిడి ఉన్నంతకాలం క మ్యూనిజం ఉంటుందని, కమ్యూని జానికి మరణం లేద ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ నెల 28న జరిగే పైలాన్ ఆవిష్కరణకు సిపిఐ పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాలు, రైతుకూలీ, సింగరేణి కార్మిక ట్రేడ్ యూనియన్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని పైలాన్ ఆవిష్కరణను విజయవంతం చేయాలని కోరిమిరాజ్ కుమా ర్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహా య కార్యదర్శి సుధాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, సోతుకు ప్రవీణ్ కుమార్, కే.సతీష్, జోసెఫ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## సిఎంఆర్ఎఫ్ పేదలకు వరం

### జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సియంఆర్ఎఫ్) పథకం ఒక వరం లాంటిదని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ, కల్వరాల గ్రామ ఉపసర్పంచ్ తడకల రంగమ్మ అన్నారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో కల్వరాల గ్రామానికి చెందిన ఆరుగురు బాధితులకు మొత్తం రూ.1,21,500/ విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులకు చెక్కులను నేరుగా అందజేశారు. గ్రామానికి చెందిన గురుక అశోక్ కుమార్‌కు రూ.60,000, సుజాతకు రూ.30,000, పాశమోని రాముడుకు రూ.15,500 బరికెల అలివేలుకు రూ.16,000 చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బందేల శ్రీకాంత్, పోచమోని ఆంజనేయులు, పూరు సాయి ప్రసాద్, పోచమోని సరిత, మల్లేష్, పుట్ట లక్ష్మీ, మధు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మాజీ ఆర్మీ జవాన్ మృతి



**ప్రజాపక్షం/మక్తల్:** వారం రోజుల క్రితం మక్తల్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంజీవ్ మాజీ ఆర్మీ సిపాయి హైదరాబాదులో కార్పోరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మక్తల్ నుండి స్వగ్రామమైన మాగనూరు మండలంలోని కొత్తపల్లి గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా తిల్లాపురం గ్రామ స్టేజీ వద్ద మృతుడు సంజీవ్ టిప్పర్ మోటార్ బైక్‌ను ఢీకొనడంతో తలకు తీవ్రంగా గాయమైంది. మక్తల్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యంకై హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కార్పోరేటర్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స పొందుతుండగా ఇటీవల మంత్రి వాకిటి శ్రీహరి పరామర్శించి, వైద్యానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారని బంధువులు తెలిపారు.

## స్పందించిన ఉన్నతాధికారులు



**ప్రజాపక్షం/పెబ్బేరు:** పెబ్బేరు మండలం వై.శాఖపూర్ నూతన సర్పంచ్ కె.ఎన్.నికిత వైద్య విద్యార్థిని ఈ నెల 23న వనపర్తి జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గ్రామంలో పలు సమస్యలపై వినతిపత్రం అందజేయగా స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ యాదయ్య, ఎంపీఓ రోజా శనివారం వై.శాఖాపూర్ గ్రామానికి వచ్చి సర్పంచు, వార్డు సభ్యులను కలిసి గ్రామ సచివాలయంలో ఉన్న సమస్యలపై చర్చించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

## చైనా మాంజాపై పంజా



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాన్ చౌరస్తా, మార్కెట్ ఏరియా, రామ మందిర్ కూడళ్లలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ అప్పయ్య, ఎస్సై సీనయ్య, సిబ్బంది కలిసి ‘‘చైనా మాంజాపై పంజా’’ అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైనా మాంజా వల్ల ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులు, వాహనదారులు, పక్షులకు ప్రాణాపాయం ఏర్పడుతోందని, గతంలో అనేక ప్రమాదాలు జరిగినట్లు ప్రజలకు వివరించారు. అనంతరం ఇన్స్పెక్టర్ అప్పయ్య వన్‌టౌన్ పరిధిలో చైనా మాంజా అమ్ముతున్న షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ ప్రజల ప్రాణాల రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని, చైనా మాంజా వల్ల జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా కఠిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎవరైనా చైనా మాంజా అమ్ముతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

## కొత్త జీఓతో ఎలాంటి నష్టం లేదు

### టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** రాష్ట్ర ప్రభుత్వ ఇటీవల జారీ చేసిన నూతన అక్రెడిటేషన్ జీవో వృతిపరమైన జర్నలిస్టులకు ఎలాంటి నష్టం కలిగించేదిగా లేదని, దీని పై కావాలని జరుగుతున్న దుష్ప్రచారాలను జర్నలిస్టులు విశ్వసించవద్దని టియుడబ్ల్యూజే (ఐజేయు) నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం నారాయణపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, జర్నలిస్టుల అక్రెడిటేషన్ కు సంబందించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్గదర్శకాలు గతంలో ఉన్న లోపాలను సరిదిద్దే దిశగా రూపొందించబడ్డాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో జర్నలిస్టుల సంక్షేమానికి మరింత బలమైన విధానాలు తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోందని, ఈ అంశంపై టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కమిటీ స్పష్టమైన సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. అంతిమంగా, నూతన జీవోపై పనిగట్టుకుని జరుగుతున్న దుష్ప్రచారాన్ని జర్నలిస్టులు నమ్మవద్దని, వాస్తవాలను గుర్తించి ఐక్యతతో ముందుకు సాగాలని కోయిలకొండ నారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## యువకులకు కౌన్సిలింగ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్ నగర్ టౌన్ పరిధిలో షీటీం సిబ్బంది మహిళల భద్రత, బాలికల రక్షణ, ఈవ్ టీజింగ్ నిరోధక చర్యల్లో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. డిసెంబర్ నెలలో టౌన్ పరిధిలోని వివిధ పార్కులు, పాఠశాలలు, కళాశాలలు, జనసంచారం ఉన్న ప్రదేశాల్లో సందేహాస్పదంగా తిరుగుతూ అమ్మాయిలను వేధిస్తున్న 18 మంది యువకులను గుర్తించి, వారిని షిటీం కేంద్రానికి పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమెన్ పి.ఎస్. ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మైనర్ బాలికలను వేధించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, ఇటువంటి చర్యలు భవిష్యత్ జీవితం, ఉద్యోగ అవకాశాలు, కుటుంబంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పూర్తి స్థాయిలో పాల్గొన్నారు. మహిళలు, బాలికల భద్రతకు భరోసా కల్పించే దిశగా షీటీం నిత్యం తనిఖీలు, పహారా, అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తుందనరి జిల్లా పోలీసు శాఖ తెలిపింది.

## మౌలిక వసతుల పరిష్కారానికి హామీ

**ప్రజాపక్షం/పుల్గర్‌చర్ల:** పుల్గర్‌చర్ల గ్రామ నూతన సర్పంచు బత్తుల బాలరాజు శనివారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులపై హెడ్ మాస్టర్ చిన్న వెంకటయ్యతో పాటు ఉపాధ్యాయులు అలివేల సురేష్, రాఘవ తదితరులతో చర్చించారు. పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల సమస్యలను గుర్తించి, వాటిని తక్షణమే పరిష్కరిస్తామని సర్పంచ్ బాలరాజు హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజనం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఉపసర్పంచ్ జుర్రు చెన్నమ్మ, వార్డు మెంబర్ గణేష్, పాఠశాల మాజీ చైర్మన్ గుజ్జుల శేఖర్, గణపతి, నరేష్ పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కులు రక్షించాలి

### హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వి. శ్రావణ్ కుమార్
### నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** కక్షిదారులకు సత్వర న్యాయం అందాలని, రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని న్యాయవాదులు, న్యాయ మూర్తులను రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి, మహబూబ్ నగర్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, జడ్జిస్ ఎస్.వి. శ్రావణ్ కుమార్ అన్నారు. శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో రూ.81 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన కోర్టు భవన సముదాయంకు ఆయన హైకోర్ట్ న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ బి.విజయ్ సేన్ రెడ్డి, జస్టిస్ టి. మాధవి, జస్టిస్ నందికొండ నర్సింగరావులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జసిస్ ఎస్.వి. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం 2 ఎకరాల 5 గంటల స్థలంలో సరిపోని విధంగా ఉందని, నూతన కోర్టు భవన సముదాయం విశాలంగా నిర్మించాలని ప్రభుత్వం 14 నవంబర్ 2024లో ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. 10 ఎకరాల 5 గుంటల స్థలంలో జిల్లా కేంద్రంలో పాలమూరు యూనివర్సిటీ కి దగ్గర బండమీది పల్లిలో రూ.81కోట్లతో భవనం శనివారం శంకుస్థాపన చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ భవనాన్ని 24 నెలల కాలంలో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. నూతన కోర్టు భవన సముదాయంతో కోర్టుకు వచ్చే కక్షిదారులకు సత్వర న్యాయం లభించాలని, ఈ దిశగా న్యాయవాదులు, న్యాయమూర్తులు సమర్థవంతంగా పని చేయాలనరి అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనతో కోర్టులు పెండింగ్ కేసులు తగ్గించే విధంగా న్యాయవాదులు కృషి చేయాలని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 16, జడ్చర్లలో 3 కోర్టులు మొత్తం 19 కోర్టులు ఉన్నాయని తెలిపారు. జిల్లాను కలెక్టర్, ఎస్పీ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహిళలు కావడం గొప్ప విషయమని తెలిపారు. హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ నూతన కోర్టు భవన సముదాయం శంకుస్థాపన చేసుకోవడం కక్షిదారులు, న్యాయవాదుల చిరకాల కోరిక నెరవేరిన సందర్భంగా వర్ణించారు. పాలమూరు జిల్లా అసలు పేరు రుక్మాపూర్ అని, 1890లో మహబూబ్‌నగర్‌గా మారిందని తెలిపారు. హైకోర్ట్‌లో 27 నుండి 42కు న్యాయమూర్తులు పెరిగినప్పటికీ 2,33,000 కేసులు పెండింగ్‌లో నున్నట్లు తెలిపారు. జిల్లా కోర్టు 18 ,446 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అమెరికాలో 97 శాతం కేసులు ట్రయల్‌కు వెళ్లవని, అప్పీలేట్ కోర్ట్‌కు వెళ్ళే కేసులు కేవలం ఒక శాతం మాత్రమే అని తెలిపారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ అండ్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎన్. ప్రేమలత, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి. జానకి, అదనపు సోలిసిటర్ జనరల్ నరసింహ శర్మ, డిప్యూటీ సోలిసిటర్ జనరల్ భూజంగ రావు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ చైర్మన్ అనంత రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## ఉదండాపూర్ నిర్వాసితులకు కెసిఆర్ క్షమాపణ చెప్పాలి

### పాలమూరు ప్రాజెక్టుపై కెసిఆర్‌కు అనిరుధ్ రెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/జడ్చర్ల:** పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై మొసలి కన్నీరు కారుస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉదండాపూర్ నిర్వాసితులకు క్షమాపణ చెప్పిన తర్వాతనే పాలమూరులో సభ పెట్టాలని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి డిమాండు చేశారు. పాలమూరు ప్రాజెక్టుపై ఆందోళనలు చేస్తామని, భారీ బహిరంగ సభను కూడా నిర్వహిస్తామని కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడిన అనిరుధ్ రెడ్డి పాలమూరు ప్రాజెక్టు ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులు అప్పట్లో సీఎంగా ఉన్న కేసీఆర్ ను కలవబోతే వారిని కలవకపోగా ఎందుకు అరెస్టు చేయించి పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో పెట్టించారని ప్రశ్నించారు. కేసీఆర్ తాను కుర్చీ వేసుకుని కూర్చొని ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చినా ఆ తర్వాత ఈ ప్రాజెక్టును గాలికి వదిలేసారని విమర్శించారు. గతంలో నార్లాపూర్‌కు వెళ్లి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయిపోయిందని ప్రకటించిన కేసీఆర్ ఇప్పుడు ప్రాజెక్టులో 70 శాతమే పూర్తయిందని, మరో 30 శాతం పనులు కాలేదని ఇప్పుడు మాట ఎందుకు మార్చారని అనిరుధ్‌రెడ్డి నిలదీశారు. కేసీఆర్ అవలంభించిన ద్వంద విధానం కారణంగా పాలమూరు ప్రాజెక్టు పూర్తి కాలేదన్నారు. అందుకే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై మాట్లాడడానికి కేసీఆర్ పాలమూరుకు రావడానికి ముందే ఉదండాపూర్ నిర్వాసితులకు క్షమాపణ చెప్పాలని అనిరుధ్‌రెడ్డి డిమాండు చేశారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా వారిని రోడ్డు మీదికి తెచ్చిన ఘనత బీఆర్ఎస్ నాయకులదని దుయ్యబట్టారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని దశలవారిగా చెల్లించడంతో పాటుగా పరిహారం మొత్తాన్ని అదనంగా రూ.145 కోట్లకు పెంచారని అనిరుధ్‌రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్ల కోసమే పాలమూరు ప్రాజెక్టును గాలికి వదిలేసిన కేసీఆర్ ఉదండాపూర్ నిర్వాసితులకు, పాలమూరు ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతనే ఇక్కడ సభ పెట్టాలని అనిరుధ్‌రెడ్డి పునరుద్ఘాటించారు.



## భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామి మండల పడిపూజ



మంత్రోపదేశం పొందిన వాకిటి శ్రీధర్ స్వామి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** మండల పూజ మహోత్సవంలో భాగంగా అయ్యప్ప స్వామి నామస్మరణతో భక్తులు పారవశ్యంలో మునిగితేలారు. లోకా సమస్త సుఖినిభవంతు అనే నినాదంతో వాకిటి, నందిమల్ల ప్రాంతాల్లో పడిపూజ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. రోజంతా ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉదయం నుంచే స్వామి వారికి విశేష అభిషేకాలు, పల్లకిసేవ, చక్రస్నానం, సహస్ర అర్చన వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం అన్నం అయ్యప్ప బిక్ష కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. రాత్రి వేళలో దేదీప్యమానంగా వెలిగించిన పదునెట్టంబడి (18 మెట్ల) పూజ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా గురుస్వాములు వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్ పడి వెలిగించి, లోక కళ్యాణం కోసం, ప్రజలంతా అష్టైశ్వర్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శాస్త్రోక్తంగా పూజా ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ శర్మ సిద్దాంతి, గురుస్వామి ముత్తు కృష్ణ ఆధ్వర్యంలో గణేష, షణ్ముఖ, లక్ష్మీ పూజలు జరిగాయి. వాకిటి రాధా శ్రీధర్, నందిమల్ల శారద అశోక్ దంపతులు భక్తి శ్రద్దలతో ఈ పూజల్లో పాల్గొన్న అనంతరం గురుస్వామి ముత్తు కృష్ణ, వాకిటి శ్రీధర్ స్వామికి మంత్రోపదేశం చేసి, మంత్ర దండాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు వంగూరు ప్రమోద్ రెడ్డి, మాజీ జడ్పిచైర్మన్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని వాకిటి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకల్లో చీర్ల కృష్ణ, పాపిరెడ్డి, అమరవాది నరేందర్, రఘుమారెడ్డి, కరెంటు వెంకటయ్య, అంబరీష్, గోపి, వెంకటేశ్, నాగరాజు, అనిల్ గురుస్వాములు, మాజీ ఆలయ అధ్యక్షులు మారం బాలేశ్వరయ్య, నాగేష్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సామాజిక న్యాయమే కాంగ్రెస్ ఎజెండా

### పదేళ్లు కష్టపడ్డ కార్యకర్తకు న్యాయం చేస్తాం
### రాష్ట్ర మత్స్య కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** కాంగ్రెస్ పార్టీ కోసం గడిచిన పదేళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తూ, గత ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు ఎదుర్కొని, అనేక హింసలకు గురి కాబడిన కార్యకర్తలకు ఊరట కలుగుతుందన్నారు. పార్టీ జెండాను నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు 90% న్యాయం చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర మత్స్య కార్పోరేషన్ చైర్మన్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ అబ్జర్వర్ మెట్టు సాయికుమార్ అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో నియమించిన కాంగ్రెస్ పార్టీ కమిటీలు గ్రామ, మండల, పట్టణ స్థాయిలో ఉన్న అధ్యక్షులను ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల, కార్మిక, వ్యవసాయ పలు కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు పదవికాలం దగ్గర పడడంతో వారి పదవులు రద్దవుతున్నారని ఆయన తెలిపారు. త్వరలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని మంత్రుల, ఎమ్మెల్యేల, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల సమక్షంలో వారి పదవుల స్థానంలో జనవరి మొదటి వారంలో ప్రజల కోసం పనిచేసే కార్యకర్తలను ఎన్నుకొని వారికి పదవులు ఇస్తామన్నారు. పదవులు కొన్నే ఉంటాయి. ఆశించే వాళ్లు చాలే ఉంటారని, నిబద్ధతతో పని చేసిన కార్యకర్తలకు ఎల్లప్పుడు వారి స్థానం పదిలంగా ఉంటుందన్నారు. చాలా మటుకు కాంగ్రెస్ పార్టీలో పైరవీల వ్యవస్థ ఉండదన్నారు. క్షేత్రస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు ఎవరైనా కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చే నిబంధనలకు లోబడి పని చేసే వాళ్లందరూ కాంగ్రెస్ కుటుంబ సభ్యులేనని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రెటరీ నందిమల్ల యాదయ్య, పీసీసీ డేటీగేట్ శంకర్ ప్రసాద్, మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్రీలత, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షులు రాజేందర్ ప్రసాద్ యాదవ్, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు ధనలక్ష్మి, జిల్లా కాంగ్రెస్ మీడియా కన్వీనర్ నందిమల్ల చంద్రమౌళి, పసుపుల తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కదిరే రాములు, మాజీ కౌన్సిలర్ బ్రహ్మాచారీ, బి.కృష్ణ, కోళ్ల వెంకటేశ్, ఎండి బాబా, దివాకర్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు గణేష్, ఎన్ఎస్‌యుఐ రోహిత్, మాజీ యూత్ కాంగ్రెస్ నాయకులు జయకర్ నూతన సర్పంచులు త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశైలం నుంచి నీళ్లను తీసుకుంటే శాశ్వతంగా జలవివాదమే



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రాష్ట్రానికి కావాల్సిన సాగు, తాగునీరుకోసం శ్రీశైలం నుండి నీళ్లను తీసుకుంటే శాశ్వత జలవివాదమే ఏర్పడుతుందని, జూరాల ప్రాంతం నుండి నీళ్లను తీసుకుంటే ఎంతో బాగుంటుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం జాగృతి జనం బాటలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హిమాలయ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాలు అని, పాలమూరు జిల్లా వనరులు ఉన్న అభివృద్ధిలో ముందంజలో ఉండలేకపోతుందని, రాష్ట్రంలోగల కృష్ణానది నుండి మన వాటా నీటిని సాధించడంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆమె గుర్తుచేశారు. 1904 సంవత్సరం నుండి నాగర్‌కర్నూల్‌లో రైలుకూత వినపడలేదని, గద్వాల మాచర్ల రైల్వేలైన్‌ను ఇప్పటివరకు పూర్తిచేయలేదని, తెలంగాణ వచ్చిన 12 ఏళ్ల తర్వాతకూడా రైలుమార్గం రాకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎంపి ఆ ప్రాజెక్టును పూర్తిచేయించే బాధ్యత తీసుకోవాలని, ఇక్కడ రైలుమార్గం వస్తే జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో గల నాలుగు నియోజకవర్గాలలో 36శాతం అటవీ భూములేనని, ఎన్నో వనరులు ఉన్న ఈప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిబిర్స్ అనేసంస్థ 14 ఏళ్లక్రితం ఇక్కడ మైనింగ్ చేస్తామంటే సాంబశివుడితో కలిసి ఇక్కడ మైనింగ్ చేయకుండా అడ్డుకున్నామన్నారు. తెలంగాణ ఆవిర్భావంతర్వాతకూడా కృష్ణా జలాల్లో ఈజిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. కృష్ణానది మహబూబ్‌నగర్ జిల్లాలో 308 కిలోమీటర్లు పారుతుందన్నారు. అదేవిధంగా వట్టెం రిజర్వాయర్‌కు సంబంధించి కాల్వలు, దాని వ్యవస్థ ఎక్కడ పూర్తికాలేదన్నారు. తెలంగాణవచ్చాక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 6లక్షల ఎకరాలకు నీళ్లిచ్చామని బిఆర్ఎస్ చెబుతోంది కాని మహబూబ్‌నగర్‌లో 25లక్షల ఎకరాల పంటలు పండే భూములున్నాయన్నారు. కేవలం 12 ఏళ్లలో ఆరున్నర లక్షల ఎకరాలకే నీళ్లు ఇచ్చారన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడితే నల్లమల బిడ్డను అని చెప్పుకుంటారు, పాలమూరు రంగారెడ్డి కోసం ఈ ముఖ్యమంత్రి ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. నాగర్‌కర్నూల్‌లో 73వేల నాలుగువందల ఎకరాలకు నీళ్లు రావాల్సి ఉంటే చుక్క నీరు రాలేదన్నారు. నాగర్‌కర్నూల్‌లో రింగ్‌రోడ్డు పూర్తి చేయాల్సిన అవసరముందన్నారు. దుందుభిలో బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఇసుక దోపిడీ ఇప్పుడు మరింత ఎక్కువ అయిందన్నారు. సిఎం ఫొటోలు పెట్టుకొని మరి ఇసుక దోపిడి చేస్తున్నారన్నారు.

## నారాయణపేట్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా ఇంచార్జీ (ఎఫ్ఏసి) కలెక్టర్గా ప్రతీక్ జైన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఈనెల 17 నుంచి వచ్చే నెల (2026 జనవరి) 11 వరకు లాంగ్ లీవ్ పెట్టడంతో జిల్లా ఇంచార్జీ కలెక్టర్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తూ సీఎస్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేవారు. ఈనెల 27 నుంచి వచ్చే నెల జనవరి 11 వరకు జిల్లా ఇంచార్జీ కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

## పేదల పక్షాన వందేళ్ల పోరాట చరిత్ర



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** దేశంలో ప్రజల పక్షాన వందేళ్లుగా పోరాడుతున్న చరిత్ర సిపిఐ కి మాత్రమే ఉందని మారే పార్టీకి లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంక గోపాల్ అన్నారు. వీపనగండ్ల మండలం బొల్లారంలో రాత్రి సిపిఐ 101వ ఆవిర్భావ వేడుకలను పార్టీ అధ్వర్యంలో నిర్వహించారు. దేవాలయం కట్ట వద్ద కామ్రేడ్ రంజాన్ అలీన పతాకాన్ని ఆవిష్కరించగా, గాంధీ నగర్‌లో మల్లెమోని కృష్ణయ్య ఎర్రజెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఐ పార్టీ పుట్టినరోజు నుంచి దేశ స్వాతంత్రం కోసం తెలంగాణ విముక్తి కోసం పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘ పోరాటాలు సాగిస్తూ వచ్చిందన్నారు. కార్మికులు కార్చికర్షకులు పీడిత తాడిత వర్గాల కోసం ఎన్నో చట్టాలను సాధించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండు చేశారు. సిపిఐ వందేళ్ల వార్షికోత్సవ వేడుకలు ఖమ్మంలో జనవరి 18న లక్షలాది మందితో నిర్వహిస్తున్నారని మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి ఎం.కురుమయ్య, ఐప్సో జిల్లా సమన్వయకర్త శివ, సిపిఐ నేతలు వేమన్న, వెంకటయ్య, రామచంద్రయ్య, మధు, జ్యోతి, కావాలి శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు

### మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి



**ప్రజాపక్షం/ మక్తల్ :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మక్తల్ మండల కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్సై భాగ్య లక్ష్మి రెడ్డి తెలిపారు. శనివారం మక్తల్ బస్టాండ్ ప్రదాన చౌరస్తాలలో మక్తల్ పోలీసులు నరేష్, శ్రీహరిలు ఆకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ఫ్రింట్ డివైస్‌తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా దయల్ 100కి సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆర్మీకి ఎంపికైన యువకుడికి సన్మానం

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలోని కె.భాను ప్రకాష్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కావడం బెంగళూరులో ట్రైనింగ్ ముగించుకొని గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు యువకులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా రజక సంఘాల అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని యువకులు ప్రభుత్వ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగాలకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. యువకుడు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భాను ప్రకాష్ ఈనెల 31 వ తేదీ తిరిగి తన విధులు నిర్వహించడానికి సిక్కిం చెన్నై బోర్డర్‌కి వెళ్ళనున్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు ఉపాధ్యక్షులు, యువకులు పాల్గొన్నారు.

**భాను ప్రకాష్.. ఇండియన్ ఆర్మీ జవాన్**

దేశ రక్షణ కోసం వెళ్ళడం నాకు ఎంతో సంతోషంగా ఉందని నేను నా భారత దేశ సరిహద్దుల్లో సేవలు అందించడానికి ప్రోత్సహించినందుకు నా తల్లిదండ్రులకు పాదాభివందనాలు అని భాను ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు.





# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## క్రిస్మస్ రోజు రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన సరైంది కాదు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : క్రిస్మస్ రోజు రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన సరైంది కాదని, దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, మత స్వేచ్ఛపై పెరుగుతున్న ముప్పుపట్ల తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని నల్లాలబావి సెంటర్ వద్ద నియోజక వర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవ. జలగం జేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వం, స్వేచ్ఛ, మత స్వాతంత్రంపై మతోన్మాదులు దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఆర్టికల్స్ 2528ల ద్వారా కలిగిన మతపరమైన హక్కులు ప్రజాశాంతి, ఆరోగ్యం, నైతికతకు లోబడి ఉన్నప్పటికి, ప్రస్తుతం ఈ హక్కులను కాలరాస్తున్న పరిస్థితి నెలకొని ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మోజెస్, బొక్క ఏలియా రాజు, వరికుప్పల మత్తయి, పంది మార్కు, బానోతు సుధాకర్, రెడ్డిపల్లి ప్రేమ్‌సాగర్, పుల్లూరు బోయాజ్, ధరావత్ మంగ్యనాయక్ పాల్గొన్నారు.



## జూన్ నాటికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులు పూర్తి

పనులు పరిశీలించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా కేంద్రం సమీపంలో ఎస్ఎల్‌బిసి కాలనీ వద్ద చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను తొందరగా పూర్తి చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఆమె యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు.వచ్చే విద్యా సంవత్సరం అకాడమీ జూన్‌లో ప్రారంభమయ్యే నాటికి తరగతి గదులు,విద్యార్థులు ఉండేందుకు డార్మెట్రీ, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ఎంట్రన్స్ గ్రౌండ్,క్రికెట్ గ్రౌండ్,త్రాగునీరు,ఆట స్థలాల తో సహా పూర్తి చేయాలని ఇంజనీర్,కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఇందుకు పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని,అలాగే పనులు నాణ్యత ప్రమాణాలతో ఉండాలని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని,దీనిని దృష్టిలో ఉంచుకొని పాఠశాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు.నల్లగొండ ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, తహసీల్దార్ పరుశురాం,ఇంజినీర్,కాంట్రాక్టర్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఎపికె ఫైల్స్ అత్యంత ప్రమాదం

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ్మా

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మొబైల్ ఫోన్స్‌కు వాట్సప్ గ్రూపుల ద్వారా, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఎపికె ఫైల్స్ అత్యంత ప్రమాదకరమైనవని జిల్లా ఎస్‌పి కె నరసింహ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఏపికె ఫైల్స్ ద్వారా మొబైల్ హ్యాక్ చేసి ఆర్థిక నష్టాన్ని కలిగించేందుకు సైబర్ మోసగాళ్ళ ఎత్తుగడ మాత్రమేనన్నారు. ఆర్‌టిఏ చాలానా, టిఎస్ పోలీస్ చలాన్, ప్రభుత్వ పథకాలు అంటూ వాట్సప్ గ్రూపుల ద్వారా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేసి వాటిని మొబైల్ ఫోన్స్‌లో డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రేరేపిస్తారని పేర్కొన్నారు. ఫైల్స్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేస్తే సైబర్ మోసగాళ్ళ ఆధీనంలోకి వెళ్తుందన్నారు. ఆ సమయంలో మీ మొబైల్‌ను వినియోగించి మీ బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బును దొంగలిస్తారు, ఇలాంటి ఏపికై ఫైల్స్‌ను ఎవరూ నమ్మవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు, సందేశాలు అందిన వెంటనే వాటిని పోలీస్ శాఖకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సైబర్ మోసగాళ్ల పన్నాగాలకు లోనుకాకుండా మీ భద్రత కోసం అప్రమత్తంగా ఉండాలన్నారు.

## నూతన సంవత్సర వేడుకలకు జాగ్రత్తలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : నూతన సంవత్సర వేడకలు నిర్వహించే వారు జాగ్రత్తలు పాటించాలని సూర్యాపేట సబ్ డివిజన్ డిఎస్‌పి ప్రసన్న కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు, పెద్దలు అందరూ వారి ఇండ్లలో ఉత్సవాలను జరుపుకుంటూ పోలీసు వారి సూచనలను పాటించాలని అన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండ సూర్యాపేట డివిజన్ పరిధిలో భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి వేడుకలు నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిత్యం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని చెప్పారు. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది, వేడుకలు జరుపుకునే వారు కుటుంబంతో కలిసి ఇంట్లోనే ఉత్సవాలు జరుపుకోవడం మంచిదన్నారు.

## మత్తులో రోడ్లపై వాహనాలు నడపొద్దు

నూతన సంవత్సర వేడుకలపై అంక్షలు : ఎస్‌పి

**ప్రజాపక్షం/నలగొండ టౌన్** : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మత్తులో రోడ్లపై వేగంగా,ఇష్టారాజ్యాంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులు కాకూడదని జిల్లా యస్పి శరత్ చంద్ర పవార్ వాహనదారులకు సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలో భాగంగా అప్రమత్తమై పక్కా కార్యాచరణతో రంగంలోనికి దిగుతున్నారని నూతన సంవత్సర వేడుకలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఏవరైన అతిక్రమించినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ,మిర్యాలగూడ దేవరకొండ,డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో ముఖ్యంగా నూతన సంవత్సర వేడుకలను ఎక్కువ నిర్వహించే అవకాశం ఉంటుందని ఈ వేడుకల సందర్భంగా ప్రతీ వాహనాదారుడు తూ.చ తప్పకుండా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోనున్నారని తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో సాయంత్రం 6 గంటల నుండి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేసి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## రాజేష్ కుటుంబానికి మాదిగ లాయర్స్ ఫెడరేషన్ అండ



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణానికి చెందిన దళిత యువకుడు కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు మాదిగ లాయర్స్ పెడరేషన్ అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు డపుకు మల్లయ్య అన్నా రు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అదేశాల మేరకు శనివారం కోదాడ పట్టణంలోని రాజేష్ నివాసానికి సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నుంచి మాదిగ న్యాయవాదులు వెళ్లి తల్లి లలితమ్మను పరమార్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూరల్ సిఐ ప్రతాపలింగంపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయడం జరిగిందని, అదే విధంగా చిలుకూరు ఎస్ఐ సురేష్ రెడ్డిపై కేసు నమోదు చేసినప్పటికీ నేటి వరకు సస్పెండ్ చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ఎస్ఐని సస్పెండ్ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజేష్ కుటుంబానికి రావాల్సిన ప్రయోజనాలు అన్ని అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఏపూరి రాజు, దిరిశనపు దావీద్, న్యాయవాదులు మందుల శ్రీనివాస్, మీసాల శ్రీనివాస్, నవీన్, అంజిబాబు, వంశీ, రాజేష్ తమ్ముడు కర్ల కమల్, కుదుముల వెంకటయ్య, కాంతారావు పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్-శ్రీశైలం లాంచి యాత్రకు విశేష ఆదరణ...

ఐదవ వారం పూర్తి - భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి

**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి లాంచి ద్వారా నిర్వహిస్తున్న పవిత్ర యాత్ర యత్రికుల విశేష స్పందనతో విజయవంతంగా కొనసాగుతోంది. ప్రతి శనివారం క్రమబద్ధమైన షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్న ఈ యాత్ర నేటితో ఐదవ వారం పూర్తి చేసుకుంది. ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు నాగార్జునసాగర్ నుంచి బయలుదేరుతున్న లాంచ్ యాత్ర యాత్రికులు ప్రశాంతమైన జల ప్రయాణాన్ని ఆస్వాదించడంతో పాటు ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతున్నారు. ప్రయాణంలో తీసుకుంటున్న భద్రతా చర్యలు, నిర్వాహకులు కల్పిస్తున్న సౌకర్యాలు యాత్రికులను ఆకట్టుకుంటున్నాయని భక్తులు తమ అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు.శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఈ లాంచి యాత్ర రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. పరిస్థితులు అనుకూలిస్తే రానున్న వారాల్లో కూడా ఇదే విధంగా యాత్ర ను కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**రిజర్వాయర్ నీటిమట్టం 560 అడుగులవరకు మాత్రమే సాధ్యం**

ఇదిలా ఉండగా, నాగార్జునసాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగుల నుంచి 560 అడుగుల మధ్య ఉన్నప్పుడే ఈ యాత్ర నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలంగాణ పర్యాటకశాఖ స్పష్టం చేసింది. శనివారం సాయంత్రానికి సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 565 అడుగులకు చేరుకుంది. నీటిమట్టం మరో ఐదు అడుగులు తగ్గితే లాంచి యాత్రను కొనసాగించడం సాధ్యం కాదని తెలంగాణ పర్యాటకశాఖ అధికారులు పేర్కొన్నారు. భక్తుల విశేష ఆదరణతో సాగుతున్న ఈ పవిత్ర జలయాత్ర ఇంకా కొనసాగాలని యాత్రికులు ఆకాంక్షిస్తున్నారు.



# ప్రజల నమ్మకమే సర్పంచ్‌ల బలం

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రజల కోసం నిబద్ధతతో పనిచేసే నాయకత్వానికే గ్రామాల్లో స్థిరమైన ఆదరణ లభిస్తుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.శనివారం నకిరేకల్ పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీతో నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచ్,వార్డ్ మెంబర్లమ ఆత్మీయ సన్మాన సభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రజా ప్రతినిధి అంటే హోదా కాదు, బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపించినప్పుడు వారి నమ్మకాన్ని నిలబెట్టేలా,ప్రజల సమస్యలను తమవిగా భావించి పరిష్కారానికి కృషి చేసినప్పుడు మాత్రమే విశ్వాసం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.అలాంటి నిజాయితీతో ప్రజల కోసం పనిచేసే సర్పంచులను ప్రజలే నిలబెడతారని,అదే గ్రామ పాలనకు నిజమైన బలమని ఆయన పేర్కొన్నారు. భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ గ్రామల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని వారు పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం బిఆర్ఎస్ అధికారంలోకి రాదన్నారు. పార్టీకి నష్టం చేసిన వారిని ఉపేక్షించమని స్పష్టం చేశారు. రానున్న ఎంపిటిసి జడ్‌పిటిసి ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని,నకిరేకల్ మున్సిపాలిటీ 20 వార్డులు, చిట్యాల 12 వార్డులులో కాంగ్రెస్ జెండా ఎగరాలని,ఏ ఎన్నిక అయినా రాష్ట్రంలో కాంగ్రెస్‌ని గెలిపించాలన్నారు. ఈకార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, కాంగ్రెస్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్ నేత,బిసిఫైనాన్ కార్పొరేషన్ మాజి చైర్మన్ పూజార్ల సాంబయ్య,కాంగ్రెస్ట్ మేనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్, నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో సర్పంచ్‌లు భాగస్వామ్యం కావాలి

భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

రాజకీయాలకు అతీతంగా 968 మంది సర్పంచులకు 'స్వీట్ బాక్సులు'



**ప్రజాపక్షం/యాదాద్రి** : రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమైన 'ప్రజా పాలన' విజయవంతం కావాలంటే క్షేత్రస్థాయిలో సర్పంచుల భాగస్వామ్యం ఎంతో కీలకమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. నూతన సంవత్సర, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని ఆయన తన నియోజకవర్గ పరిధిలో ఒక వినూత్నమైన సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. భువనగిరి లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 968 గ్రామ పంచాయతీల నూతన సర్పంచులకు ఎంపీ స్వీట్ బాక్సులను, గ్రీటింగ్ కార్డులను పంపించారు. సాధారణంగా రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వైరుధ్యాలు సహజం. కానీ ఎంపీ చామల కిరణ్ రెడ్డి పార్టీలకతీతంగా అందరు సర్పంచులను గౌరవించాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచులతో పాటు బిఆర్ఎస్, బిజెపి , స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన వారందరికీ వ్యక్తిగతంగా ఈ కానుకలను చేరవేశారు.

**ప్రత్యేక ఆకర్షణగా జగదీష్ రెడ్డి తండ్రికి శుభాకాంక్షలు**

బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తండ్రి, నాగారం సర్పంచ్ అయిన గుంటకండ్ల రామచంద్రారెడ్డికి కూడా ఎంపీ చామల స్వీట్ బాక్స్ పంపించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. రాజకీయ విభేదాలు పక్కన పెట్టి, పదవిలో ఉన్న ప్రజా ప్రతినిధులను గౌరవించే ఈ సంస్కృతిపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

**తెలంగాణ రైజింగ్‌లో గ్రామాల పాత్రే కీలకం**

'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలి. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే గ్రామాలు బాగుండాలి. అందుకే రాజకీయాలకు తావు లేకుండా సర్పంచులందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.' అని గ్రీటింగ్ కార్డులో ఎంపీ చాముల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తమ గ్రామాల అభివృద్ధికి ఎంపీ సహకారం ఉంటుందని భరోసా కల్పించినందుకు, పండుగ వేళ తమను గుర్తుపెట్టుకుని శుభాకాంక్షలు తెలిపినందుకు నూతన సర్పంచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ స్వీట్ బాక్సుల పంపిణీ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# నియోజకవర్గాన్ని కొడంగల్‌గా తీర్చిదిద్దుతా

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ నియోజకవర్గాన్ని సిఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్ మాదిరిగా అభివృద్ధి చేస్తానని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నూతన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌ల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్‌లను శాలువా, మెమోంటోలతో సన్మానించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామాల నూతన పాలకవర్గాలకు సూచించారు. నిత్యం గ్రామాల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజలు ఇచ్చిన గుర్తింపును నిలబెట్టుకోవాలన్నారు. గ్రామాభివృద్ధి చేయడంతో పాటు పల్లెల్లో పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ప్రజల సంతోషమే లక్ష్యంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, త్వరలో మిగిలిన హామీలను కూడా అమలు చేస్తామన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో జరిగిన మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుందని తెలిపారు. 180 చోట్ల అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు గెలుపొందగా, కేవలం 50 స్థానాల్లో బిజెపి, బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారని అన్నారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు, నూతన సర్పంచ్‌లు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## బిసి రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే సహించం : జెఎసి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తే సహించేది లేదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ గతంలో సీఎం రేవంత్‌రెడ్డి రిజర్వేషన్లు పెంచిన తరువాతనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చి అసెంబ్లీ సమావేశాల్లో ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని అనడం మంచి పద్ధతి కాదన్నారు. ఈనెల 29నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లేలా అసెంబ్లీ వేదికగా ఒక రాజకీయ కార్యాచరణ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉంటామని అసెంబ్లీలో ప్రకటించిన రాజకీయ పార్టీలు ఇప్పుడు మాట మార్చి వ్యవహరిస్తున్నాయని, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒకవైపు బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్‌రావు డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, గుండెబోయిన నాగేశ్వర్‌రావుయాదవ్, బంటు కవిత, కుమ్మరికుంట్ల సుధాకర్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు నేత హనుమంతు కుటుంబ సభ్యులకు సిపిఐ నేతలు పరామర్శ

నేడు పుల్లెంలలో హనుమంతు అంత్యక్రియలు




**ప్రజాపక్షం/చండూరు:** ఒడిశాలోని కందమాల్ జిల్లా చరపాడ్ అడవుల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ,ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శి పాక హనుమంతు అలియాస్ ఉయితే గణేష్ మరణించారు. పాక హనుమంతు స్వస్థలం నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామం. పాక హనుమంతు డెడ్‌బాడికి ఆదివారం పుల్లెంల గ్రామంలో అంత్యక్రియలు జరుగనున్నాయి. సిపిఐ జాతీయ కార్యదర్శి మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శనివారం పుల్లెంల గ్రామంలో పాక హనుమంతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పాక చంద్రయ్య మొదటి నుండి సిపిఐ పార్టీకి చెందిన కుటుంబం అని ,పుల్లెంల గ్రామంలో సిపిఐ నిర్మాణంలో ముందుండి నడిపంచిన వారిలో ఒకరని ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం గుర్తు చేశారు. పాక చంద్రయ్య ఎట్టమ్మ దంపతుల ఆరుగురు సంతానంలో హనుమంతు ఒకరని అన్నారు. 1981లో నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో రాడికల్ స్టుడెంట్ యూనియన్‌లో చేరి పని చేశాడని అన్నారు. అప్పుడు జరిగిన ఏబివిపి నాయకుడు శ్రీనివాస్ హత్య కేసులో పాక హనుమంతు కూడా నిందితుడు అని తేలడంతో , ఆ హత్య తర్వాత ఆయన పీపుల్స్‌వార్ పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆయన తిరిగి రాలేదు. గత మూడు సంవత్సరాల క్రితం తల్లిదండ్రులు మరణించప్పుడు కూడా వారి అంత్యక్రియలకు రాలేదు. పార్టీలో అంచలంచలుగా ఎదిగి కేంద్ర కమిటీ సభ్యుడుగా గుర్తింపుతెచ్చుకున్నాడు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య , ఆర్.అంజాచారి, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , మండల పార్టీ సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు, పుల్లెంల సర్పంచ్ ముక్కాముల వెంకన్న, ఉప సర్పంచ్ సిహెచ్ ఊషయ్య, దోనిపాముల ఉపసర్పంచ్ తిప్పర్తి రాములు, శివర్ల లింగస్వామి, ఎండి కరీం, గడ్డం నవీన్ , పాక హనుమంతు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పటిష్టతకు ప్రతీ కార్యకర్తకూ పదవులు

పిసిసి పరిశీలకులు బిజ్జి చత్రురావు, మానాల మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట** : కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పాటుపడ్డ ప్రతి కార్యకర్తకు పదవులు వస్తాయని అన్ని మండలాల నుంచి డిసిసి కార్యవర్గ ఎన్నిక కూర్పు చేస్తున్నామని పిసిసి పరిశీలకులు బిజ్జి చత్రురావు, మానాల మోహన్ రెడ్డిలు అన్నారు. శనివారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (రెడ్‌హౌస్)లో ఏర్పాటు చేసిన డిసిసి నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జనవరి ఒకటో తేది వరకు జిల్లా కమిటి పూర్తి అవుతుందని పదవులు రానివారు సహకరించి కార్యవర్గానికి బాసటగా నిలువాలన్నారు. అందరి సహకారంతోనే సూర్యాపేట జిల్లాలో అత్యధిక గ్రామ పంచాయితీ స్థానాలను గెలుపొందామని ఈ విజయంలో గెలుపొందిన వారి కంటే గెలుపుకు కృషి చేసిన వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నియోజక వర్గంలో రెండు ఉపాధ్యక్షులు, నాలుగు జనరల్ సెక్రటరీలు, మండలానికో సెక్రటరీ నియమించి డిసిసి కమిటిని పూర్తి చేస్తామన్నారు. గ్రామస్థాయిలో నేతలను బలోపేతం చేసే దిశగా అన్ని మండలాలకు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ పార్టీ కమిటిలు వేయకుండా కార్యకర్తలతో గులాం గిరి చేయించుకున్నారు. మన పార్టీకి అన్ని రకాల కార్యవర్గాలు ఉన్నాయని ప్రజాస్వామ్యబద్ధంగా కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్తుందన్నారు. నూతన కార్యవర్గం అందరిని కలుపుకొని పనిచేస్తూ రాబోయే జడ్‌పిటిసి, ఎంపిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయాలన్నారు. పదవులు రాలేదని బాధపడవద్దని కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఎలాంటి అవకాశాలు వస్తాయో ఎవరూ చెప్పలేరన్నారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తూ ముఖ్యంగా మహిళలకు 20శాతం పదవులు కేటాయించనున్నట్లు తెలిపారు. గత పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ కుటుంబ సభ్యులతో కుటుంబపాలన కొనసాగించాడన్నారు. లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని స్వయాన ఆయన కుమార్తె చెప్పిందని తెలిపారు. కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులే కాకుండా వారి కుటుంబ సభ్యుడిగా ఉండే మరో తిమింగలం సూర్యాపేట శాసనసభ్యులు జగదీష్‌రెడ్డి అన్నారు. పదేండ్లలో జరిగిన అవినీతిలో జగదీష్‌రెడ్డికి కూడా భాగం ఉందని సామాన్య వ్యక్తిగా ఉన్న జగదీష్‌రెడ్డికి వందల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ప్రతి కార్యకర్త విజయమని పదవులు రానివారు అధైర్యపడకుండా శక్తివంచన లేకుండా పనిచేసే పార్టీ పటిష్టతను పెంపొందించాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, కక్కిరేణి శ్రీనివాస్, అబ్దుల్ రహీం, కుమ్మరికుంట్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# రీల్

## ఇది ఎప్పటికీ స్పెషల్ ఫిలిం

-సక్సెస్ మీట్‌లో రోషన్



శ్రీకాంత్ కొడుకు రోషన్ హీరోగా ఇటీవల విడుదలైన సినిమా ఛాంపియన్. స్వప్న సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ హీరోయిన్. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో రోషన్ మాట్లాడుతూ.. ఛాంపియన్ సినిమా నాకు చాలా స్పెషల్. ఈ ప్రాజెక్టుకి నేను ఎమోషనల్ అటాచ్ అయ్యాను. తనకి సినిమా అంటే చాలా పాషన్. సినిమా కోసం ఏమైనా చేస్తారు. సినిమాని ఇండస్ట్రీలో చాలా మంది సపోర్ట్ చేశారు. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఛాంపియన్ ఎప్పటికీ నాకు స్పెషల్ ఫిలిం. నాకు ఈ స్క్రిప్ట్ ఇచ్చిన ప్రదీప్‌కి థాంక్యూ. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమా మా అందరికీ స్పెషల్. అందరూ కూడా ఫ్యామిలీతో కలిసి వెళ్లి చూడాలని కోరుకుంటున్నాను. హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ ఛాంపియన్ నా మొదటి తెలుగు సినిమా. థియేటర్స్‌లో కూర్చుని ఆడియన్స్ రియాక్షన్ చూస్తున్నప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. గిర గిరా నా ఫేవరెట్ సాంగ్. మిక్కీ అద్భుతమైన ఆల్బమ్ క్రియేట్ చేశారు. చంద్రకళ పాత్ర ఇచ్చిన ప్రదీప్ కి థాంక్యూ అన్నారు. ఈ సక్సెస్ మీట్‌లో డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం, ప్రొడ్యూసర్ స్వప్న దత్, సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ తదితరులు పాల్గొన్నారు.

## 30న 'మెగా విక్టరీ' మాస్ సాంగ్



మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ కలిసి నటిస్తున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న అప్డేట్ ఇప్పుడు వచ్చేసింది. ఈ చిత్రంలోని థర్డ్ సింగిల్ 'మెగా విక్టరీ మాస్ సాంగ్'ను 30న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రోమోను రిలీజ్ చేశారు. చిరంజీవి, వెంకటేష్ కలసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఇదే తొలిసారి. ఇద్దరి అభిమానులను దృష్టిలో పెట్టుకుని అనిల్ రావిపూడి మాస్ పాటను చిత్రీకరించారు. ఇందులో చిరంజీవి సరసన నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది. వెంకటేష్ చాలా కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. షైన్ స్క్రీన్స్, గోల్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గరపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని భారీగా నిర్మిస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్రాన్ని జనవరి 12న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ఈ గెలుపు నాది కాదు

- సంజనా గల్రానీ



'ఓ ఐదేళ్ల క్రితం నా ప్రమేయం లేకుండా జరిగిన ఓ సంఘటన నా జీవితాన్ని, కెరీర్‌ని ఒక కుదుపు కుదిపేసింది. అయితే స్వతహా నేను ఫైటర్‌ని. అందుకే ప్రతికూల పరిస్థితులతో నేను పెద్ద పోరాటమే చేశాను. చివరికి విజేతగా నిలిచాను' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు బిగ్‌బాస్ సీజన్9లో టాప్ 5 ఫైనలిస్ట్‌గా నిలిచిన ప్రముఖ హీరోయిన్ సంజనా గల్రానీ. ఒడిదుడుకుల్లో తన వెన్నంటి నిలిచిన తన కుటుంబానికి, శ్రేయోభిలాషులకు, అభిమానులకు ఆమె ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బిగ్‌బాస్ సీజన్ 9లో టాప్ 5 ఫైనలిస్ట్‌గా నిలిచిన సంజన మీడియాతో ప్రత్యేకంగా సమావేశమై, బిగ్‌బాస్ అనుభవాలను పంచుకున్నారు. బిగ్‌బాస్ నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని, ఈ అనుభవంతో తన కెరీర్‌లో ఫ్రెష్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేయనున్నానని ఆమె తెలిపారు. ఇకపై తెలుగు సినిమాలపై మరింత దృష్టి సారిస్తానని తెలిపారు.

## జనవరి 1న హిందీలో 'శంబాల'




ఆది సాయి కుమార్ నటించిన 'శంబాల' ప్రస్తుతం బ్లాక్ బస్టర్ టాక్‌తో దూసుకుపోతోంది. విడుదలైన అన్ని చోట్ల పాజిటివ్ రెస్పాన్స్‌తో, హౌస్ ఫుల్ కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఈ మిస్టికల్ థ్రిల్లర్ ప్రస్తుతం థియేటర్లో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. డిసెంబర్ 25న విడుదలైన ఈ చిత్రానికి ప్రస్తుతం అన్ని చోట్ల నుంచి డిమాండ్ ఏర్పడింది. ఈ క్రమంలో జనవరి 1న హిందీలో ఈ సినిమాని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హిందీ వెర్షన్ ప్రస్తుతం సెన్సార్ సర్టిఫికేషన్ కోసం వేచి ఉందని నిర్మాతలు మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు తెలిపారు. ఓవర్సీస్‌లోనూ 'శంబాల' దూసుకుపోతోంది. ఇక అంతే కాకుండా 'శంబాల'కి ప్రీమియర్లు, డే వన్, రెండో రోజు ఇలా అన్నీ కలిపి చూస్తే మొత్తంగా 5.4 కోట్ల గ్రాస్ వచ్చాయి.

## త్వరలో ఓటీటీలోకి 'కికి'



భారతీయ అనిమేషన్ చిత్రాలు కూడా ఇప్పుడు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తెరకెక్కిన ఇండియన్ అనిమేషన్ సినిమా 'కికి అండ్ కొకొ'. పిల్లలకు పిల్లల మనసున్న పెద్దలకు నచ్చేలా రూపొందుతున్న యానిమేషన్ మూవీ 'కికి అండ్ కొకొ'. ఈ చిత్రాన్ని ఇనికా స్టూడియోస్ మన ముందుకు తీసుకొస్తోంది. ఈ యానిమేషన్ చిత్రానికి ధరణి నిర్మాత కాగా పి.నారాయణన్ దర్శకత్వం వహిస్తున్నారు. బాలనటి శ్రీనిక కొకొ పాత్రలో నటిస్తోంది. మీనా చాబ్రియా సీయీవోగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న యానిమేషన్ మూవీ 'కికి అండ్ కొకొ' త్వరలో థియేటర్స్‌తో పాటు 9 భాషల్లో ఓటీటీలోకి రాబోతోంది. శనివారం జరిగిన భారతీయ అన్ని భాషల్లోనే కాకుండా ప్రపంచవ్యప్తంగా పలు భాషల్లో ఈ చిత్రం విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో ఈ చిత్రానికి సంబంధించిన టిజర్ విడుదల ప్రెస్‌మీట్‌లో ఈ యానిమేషన్ మూవీ హైలైట్స్ తెలిపారు చిత్రబృందం.

## 'వానర' టైటిల్ 'వనవీర'గా మార్పు



అవినాష్ తిరువీధుల హీరోగా, దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'వనవీర'. ఈ చిత్రంలో సిమ్రాన్ చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. నందు ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. 'వనవీర' చిత్రాన్ని శంతను పత్తి సమర్పణలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ బ్యానర్‌పై అవినాష్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్, వివేక్ సాగర్ మ్యూజిక్ అందించారు. మైథలాజికల్ రూరల్ డ్రామా కథతో తెరకెక్కిన 'వనవీర' సినిమా న్యూ ఇయర్ సందర్భంగా జనవరి 1న థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. నటుడు హర్ష, నటుడు బాబీ, డీవోపీ ఛోటా కె ప్రసాద్, హీరోయిన్ సిమ్రాన్ చౌదరి, నిర్మాత శంతను పత్తి, ప్రొడ్యూసర్ రాజేష్ దండా పాల్గొన్నారు.

## అమెరికాలో 'షో'లు పెరుగుతున్నాయ్

నటుడు శివాజీ



లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందించిన తాజా చిత్రం 'దండోరా'. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, అదితి భావరాజు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ సినిమాకు మురళీకాంత్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం డిసెంబర్ 25న విడుదలైన సందర్భంగా 'దండోరా' మూవీ సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ మీట్‌లో నటుడు శివాజీ మాట్లాడుతూ.. హనుమాన్ ప్రొడ్యూసర్ ఈ సినిమా చూసి ప్రొడ్యూస్ చేయటానికి వచ్చారు. నీలకంఠగారైతే తరాలకొకసారే ఇలాంటి సినిమా వస్తుందన్నారు. ఈ సినిమా గురించి 2026 మొత్తం మాట్లాడుకుంటారు. నార్త్ అమెరికాలో షోలో బాగా పెరిగాయి. ఒక షో పెట్టినవాళ్లు.. మూడు షోస్‌కు పెంచారు. మలయాళ సినిమా డైరెక్టర్స్, మారి సెల్వరాజ్ వంటి డైరెక్టర్‌తో పోల్చి మురళీకాంత్ గురించి మాట్లాడుతున్నారంటే.. మాకు చాలా గర్వంగా ఉంది. ప్రతీ క్యారెక్టర్ చూస్తే అద్భుతమైన నటులు వస్తున్నారని తెలుస్తుంది. ప్రతి పాత్ర బాగా కుదిరింది. ఈ సినిమా షూటింగ్ చేస్తున్నన్ని రోజులు నేను రోజుకి 2 గంటలే పడుకునేవాడిని. ఇందులో నాకు కొడుకు, కూతురు.. పాత్రలుంటాయి. వాటిని బ్యాలెన్స్ చేయాలంటే పాత్రలో ఆ లుక్ కనిపించాలి. డైరెక్టర్ అడగకపోయినా నేను కష్టపడ్డాను. అందరూ ప్రాణం పెట్టి చేసిన సినిమా ఇది. అందరూ ఈ సినిమాను భుజాలకెత్తుకున్నారన్నారు.

## 'శ్రీనివాస మంగాపురం' తొలి షెడ్యూల్ పూర్తి



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేష్ బాబు కుమారుడు, సూపర్ స్టార్ మహేష్ బాబు అన్న కొడుకు జయ కృష్ణ ఘట్టమనేని నటిస్తున్న లవ్ స్టోరీ 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమాతో జయకృష్ణ హీరోగా లాంచ్ అవుతున్నారు. అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను వైజయంతి మూవీస్ అశ్విని దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు బ్యానర్‌పై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. చిత్ర బృందం ఇప్పుడు 30 రోజుల పాటు సాగిన మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసింది. ఈ షెడ్యూల్లో 30 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఈ షెడ్యూల్లో చిత్ర బృందం మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో కీలక సన్నివేశాలు, అద్భుతమైన పాటలు, ముఖ్యమైన టాకీ పార్ట్‌ను చిత్రీకరించింది. పూర్తి ఉత్సాహంతో వున్న చిత్ర బృందం త్వరలో ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయడానికి సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి జి.వి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. తదుపరి షెడ్యూల్ సంక్రాంతి తర్వాత ప్రారంభం కానుంది.

## 'ఈషా' సక్సెస్ మీట్



నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై 'ఈషా' అనే హారర్ థ్రిల్లర్ను ఇటీవల విడుదల చేశారు. అఖిల్‌రాజ్ త్రిగుణ్ హీరోలుగా నడిచిన ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. ఈ చిత్రాన్ని హెచ్వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేవిల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వం వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత బన్నీవాస్ మాట్లాడుతూ ఒక సినిమా హిట్ అనడానికి వసూళ్లు ప్రామాణికం, ఈ చిత్రం మొదటిరోజు రెండు కోట్ల 20 లక్షలు గ్రాస్‌ను వసూలు చేసింది. చిన్న చిత్రాల్లో ఇది రికార్డు. చాలా చిన్న బడ్జెట్‌తో తీసిన చిత్రమిది. రెండో రోజు కలెక్షన్లు ఈసినిమా తగ్గలేదు. ఈ హాలీడేస్‌లో ఈ సినిమా గట్టి వసూళ్లు ఉంటాయి. ఈ సినిమాపై ఎవరికైనా సందేహాలు ఉంటే ఈ చిత్రం వసూళ్లు చూస్తే వాళ్ల సందేహాలు తీరిపోతాయి. ఫైనల్‌గా బాక్సాఫీస్ విన్నర్‌గా నిలిచిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ సినిమాగా చెప్పుకోవచ్చు. ఇక ఆడియన్స్ థియేటర్స్‌కు వచ్చి ఈషా సినిమాను ఎంకరైజ్ చేయడం ఆనందంగా ఉందన్నారు.



## 'వందేమాతరం' గేయం స్వాతంత్ర్య పోరాటానికి ప్రాణం

కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: 'వందేమాతరం' గేయం భారత దేశ స్వాతంత్ర్య పోరాటానికి ప్రాణం పోసిందని, కులం, మతం, ప్రాంతం అనే బేదాలను పక్కన పెట్టి 'దేశమే ప్రథమం అనే భావనను పెంపొందించిందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. వందేమాతర గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని వివేక వర్ధిని కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో దేశభక్తి భావనను పెంపొందించేందుకు వందేమాతరం ఒక ప్రేరణాత్మకమైన రణనినాదంగా నిలిచిందన్నారు. ఎందరో మహానుభావులు, వందేమాతరం స్ఫూర్తితో నిజాంకు వ్యతిరేకంగా పోరాడారని, అనేక త్యాగాలు చేశారన్నారు. హైదరాబాద్ సంస్థానంలో వందేమాతర ఉద్యమంలో విభిన్న భావ జాలాలు కలిగిన అనేక సంఘాలన్నీ, రాజకీయ భావ జాలాన్ని పక్కనపెట్టి 'ఐక్యపోరాటాన్ని' ప్రారంభించాయని వివరించారు. 'వందేమాతరం' చరిత్రను అంద రూ తెలుసుకుని స్ఫూర్తిని పొందాలని కిషన్ రెడ్డి తెలిపారు. వందేమాతర నినాదం రెండు పదాలు మాత్రమే కాదని, దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించేందుకు పెద్దలు పడిన తపన, తాపత్రయానికి, వారు చేసిన స్వార్థం లేని త్యాగానికి, భరత జాతి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు.

## అన్ని క్రీడలకూ ప్రభుత్వం ప్రోత్సాహం



మంత్రి వాకటి శ్రీహరి

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో అన్ని క్రీడలకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం ఇస్తుందని తెలంగాణ క్రీడా శాఖ మంత్రి వాకటి శ్రీహరి అన్నారు. యువత పెడదోవ పట్టకుండా క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. పుణె వేదికగా జరగబోతున్న గ్లోబల్ సైక్లింగ్ ఈవెంట్ ట్రోఫీ టూర్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ టూర్‌కు సంబంధించిన ట్రోఫీ, జెర్సీలను శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇలాంటి గ్లోబల్ ఈవెంట్ ఇండియాలో జరగడం గర్వకారణమన్నారు. బజాజ్ పుణే గ్రాండ్ టూర్ భారత్‌లో తొలి, యుసి ఐ క్లాస్ 2.2 అంతర్జాతీయ స్టేజ్ సైక్లింగ్ రేస్ రూపకల్పన చేసిన నిర్వాహకులను అభినందించారు. పూణే నుండి ప్రారంభమైన ఈ పోటీలో యుసిఐలో నమోదు అయిన జాతీయ, అంతర్జాతీయ జట్లు పాల్గొంటున్నాయని, కార్యక్రమం ద్వారా భారత్ ప్రొఫెషనల్ గ్లోబల్ రోడ్ సైక్లింగ్ వ్యవస్థలో అధికారికంగా అడుగు పెట్టడం సంతోషదాయకమన్నారు. ముమ్ముందు తెలంగాణ రాష్ట్రం నుండి కూడా ఈ పోటీలను ప్రారంభించడానికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ పూణే గ్రాండ్ టూర్ ప్రారంభించడం అభినందనీయమని, ప్రభుత్వాలు ఏవైనా క్రీడలను ప్రోత్సహిస్తున్నందుకు అభినందనలు తెలపాల్సిందేనన్నారు. భవిష్యత్తులో భారత్.. ప్రపంచ స్థాయి యుసిఐ ఆమోదిత స్టేజ్ రేస్‌లను నిర్వహించగల సామర్థ్యాన్ని సాధించేందుకు ఇది తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. బజాజ్ పుణే గ్రాండ్ టూర్‌కు 40కి పైగా దేశాల నుంచి పాల్గొనడం గర్వకారణం అని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో క్రీడలకు, క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణలో ఏ లాంటి క్రీడా ఈవెంట్ నిర్వహించినా ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మల్లా రెడ్డి, రేస్ టెక్నికల్ డైరెక్టర్ పినాకి బైసాక్, అథ్లెట్స్ కమిషన్ ఆఫ్ సిఎఫ్ఐ మ్యాక్స్‌వెల్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆటా' సేవలతో తెలుగు సంస్కృతికి ప్రపంచ గుర్తింపు

ఆటా వేడుకలు గ్రాండ్ ఫినాలేలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : తెలుగు భాషకు, సంసృతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొస్తున్న అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) సేవలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో 'ఆటా వేడుకలు–2025 గ్రాండ్ ఫినాలే' అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు వారు తమ మూలాలను మరవకుండా సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తరతరాలకు అందించడం అభినందనీయమన్నారు. 'ఆటా' నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, విద్యా, వైద్య, సామాజిక సేవా రంగాల్లో చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు ఆటా అవార్డులు ప్రదానం చేశారు. ఈ సం దర్భంగా 'ఆటా జీవిత సాఫల్య పురస్కారం'ను ప్రముఖ దర్శకులు ఏ.కోదండరాం రెడ్డికి గవర్నర్ అందజేశారు. ఈ వేడుకలకు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు, ఎంఎల్‌ఏ మల్లారెడ్డి, కార్పొరేషన్ చైర్మెన్లు నరసింహారెడ్డి, పటేల్ రమేష్ రెడ్డి ఆటా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో ఆటా అధ్యక్షులు జయంత్ చల్లా, కాబోయే అధ్యక్షులు సతీష్ రామసహాయం రెడ్డి, రీజినల్ కో–ఆర్డినేటర్ వేణుగోపాల్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## 'విబి-జిరామ్‌జి'ని వ్యతిరేకిస్తున్నాం

ఉపాధి హామీ పథకం రాష్ట్ర ఉద్యోగుల జెఏసి ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్: మహాత్మాగాంధీ జాతీ య గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్ చట్టాన్ని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్ర ఉద్యోగుల జెఏసి వ్యతిరేకించింది. అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని వెల్లడించింది. ఈ మేరకు జెఏసి చైర్మన్ ఎల బద్రి లింగయ్య ఆధ్వర్యంలో జెఏసి ప్రతినిధులు రాష్ట్రపంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కను హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా కొత్త చట్టం ద్వారా ఉపాధి హామీ పథకం అసలు లక్ష్యాలను నిర్వీర్యం చేసే ప్రమాదం ఉందని, కూలీలకు హామీ ఉన్న ఉపాధి, వేతన భద్రత దెబ్బతింటుందని జెఏసి ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. 60:40 శాతం నిష్పత్తి విధించడం వల్లఈ పథకం అమలు కష్టసాధ్యమవుతుందని తెలిపారు. ఉపాధి హామీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని జెఏసి ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర జెఏసి నాయకులు మోహన్ రావు, అంజిరెడ్డి, రాజశేఖర్, మురహరి విజయకుమార్, వెంకటరామరెడ్డి, గిరి గౌడ్, రామకృష్ణ, రఘు, గురు చరణ్ సింగ్, కృష్ణ గౌడ్ తదితరులు ఉన్నారు.

## దొంగల హల్‌చల్ (మొదటి పేజీ తరువాయి)

నాలుగు లక్షలు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా నాల్గవ టౌన్ పరిధిలోని ఆర్యనగర్ ప్రాంతంలోని డీసీబీ బ్యాంకు ఏటిఎంలో దొంగలు చొరబడి 27 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను కట్ చేసి దాదాపు 30 లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఇన్‌చార్జి ఎం.రాజేష్ చంద్ర సంఘటన స్థలాన్ని పర్యవేక్షించారు. ఎటిఎంల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి చోరీ జరిగిన విధానం, ప్రవేశ నిష్క్రమణ మార్గాలను అధ్యయనం చేశారు. ఎటిఎంలోపలి పరిసర ప్రాంతాల సీసీటీవీ దృశ్యాలను సేకరించి విశ్లేషణకు ఆదేశించారు. క్లూస్‌టీమ్, సాంకేతిక నిపుణులు, స్థానిక పోలీస్ బృందాలతో ఐదు ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. రాత్రివేళ్లో ముఖ్యంగా ఎటిఎంలు, బ్యాంకులు, జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో మొబైల్ పెట్రోలింగ్ పెంచారు. జిల్లాలో ప్రవేశ నిష్క్రమణ పాయింట్లలో చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసి వాహనాల తనికీలు ముమ్మరం చేశారు. ఎటిఎం భద్రతను బలోపేతం చేయడానికి బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకుని అలారం వ్యవస్థలు అదనపు సీసీటీవీలు లైటింగ్ మెరుగుదలపై సూచనలు ఇచ్చారు. జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసుశాఖ అప్రమత్తంగా ఉందని ప్రజలకు భరోసా కల్పించారు. నిందితుల గుర్తింపు, పట్టుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని దర్యాప్తు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్యలతో నగరంలో భద్రత మరింత బలోపేతం చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయడమే లక్ష్యంగా పోలీసుశాఖ పని చేస్తుందన్నారు. సంఘటన స్థలాన్ని ఇన్‌చార్జి సీపీతో పాటు జిల్లా అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, 4వ టౌన్ ఎస్‌హెచ్ఓ సతీష్‌కుమార్, సిఐ శ్రీనివాస్‌రాజ్, ఎస్సై గంగాధర్, బ్యాంకు మేనేజర్ శివకుమార్ ఉన్నారు.

## బాంబుదాడి

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రవాదం'గా అభివర్ణించి, ప్రభుత్వాన్ని బాధ్యుడిగా చేసింది. సిరియా ప్రభుత్వం దీన్ని 'పాత రెజీమ్ శేషాలు, ఐఎస్ మిలిటెంట్లు స్థిరత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం'గా చెప్పి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ నిర్ణయాన్ని పునరుద్ఘాటించింది. ఐక్యరాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెరెస్ ఈ దాడిని ఖేదిస్తూ, నిందితులను శిక్షించాలని డిమమాండ్ చేశారు. మసీదు డిప్యూటీ ఇమామ్ ప్రకారం, ప్రార్థన జరుగుతున్నప్పుడు భారీ పేలుడు జరగడంతో, భయానక వాతావరణం ఏర్పడింది. మసీదులోని ఒక ప్రాంతంలో నిప్పు అంటుకోవడంతో ఖురాన్ కాపీలు దగ్ధమయ్యారు. ఈ ఘటనలో గాయపడనవారిని బయటకు తీసుకువచ్చారు. సౌదీ అరేబియా, జోర్డాన్, లెబనాన్ వంటి పొరుగు దేశాలు కూడా ఈ ఘటనను ఖండించాయి. ఇది సిరియాలో ఐఎస్ వ్యతిరేక క్రాక్‌డౌన్, అలెప్పోలో కుర్దిష్ ఫోర్సెస్‌తో ఘర్షణలు కొనసాగుతున్న సమయంలో చోటు చేసుకుంది. దేశంలో స్థిరత్వానికి మరో సవాలుగా మారింది.

## విస్తృత ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)



ఎనిమిదివేల మంది జనసేవా దళ్ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వగా మరి కొంత మందికి రానున్న రెండు మూడు రోజుల్లో శిక్షణ పూర్తి చేయనున్నట్లు జనసేవాదళ్ బాధ్యులు తెలిపారు. ప్రత్యేకమైన డ్రెస్‌లో ప్రదర్శన ముందు భాగాన జనసేవాదళ్ కార్యకర్తలు కవాతు చేయనున్నారు. జనవరి ఎనిమిది నుంచి అన్ని మండలాల్లో మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నారు. తొమ్మిదిన ఖమ్మం నగరంలో జనవరి 18న జరిగే బహిరంగ సభ జయప్రదం కోరుతూ భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. తొమ్మిదిన ఉదయం తొమ్మిది గంటలకు సిపిఐ గ్రామశాఖలు, పట్టణ శాఖల ఆధ్వర్యంలో ప్రభాతభేరీ మ్రోగించాలని జిల్లా కమిటీ నిర్ణయించింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శతాబ్ది ఉత్సవ సభ జయప్రదం కోరుతూ ముగ్గుల పోటీలను నిర్వహించి మహిళల్లో సభ చారిత్రిక నేపథ్యాన్ని వివరించి ఆహ్వానించాలని నిర్ణయించారు. ఖమ్మం నగరంలో అన్ని ప్రాంతాల్లో బహిరంగ సభ వివరాలు, చారిత్రిక నేపథ్యాన్ని తెలుపుతూ ప్రత్యేక ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని నగరం మొత్తాన్ని తోరణాలతో అలంకరించాలని నిర్ణయించారు. ఈనెల మూడు నుంచి ఆరవ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా జీబుజాతాలను నిర్వహించాలని నిర్ణయించగా ఈ కార్యక్రమానికి జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, సీతామహాలక్ష్మిలు జాతాకు నాయకత్వం వహించనున్నారు. ఈ జాతాల సందర్భంగా జరిగే సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్‌లు హాజరుకానున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com